అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదివారం 7-1-2024

సంపుటి : 10 సంచిక : 07 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు + సోపతి (వెబ్‌లో) వెల : 8.00



న్యాయ హక్కు లభించే వరకు..

ఇదే రాహుల్‌గాంధీ భారత న్యాయ యాత్ర ట్యాగ్ లైన్

- పార్లమెంటులో మాట్లాడనివ్వట్లేదు..అందుకే ప్రజల వద్దకు
- ప్రతిపక్ష నేతలను బెదిరించేందుకు కేంద్ర ఏజెన్సీల దుర్వినియోగం : భారత్ జోడో న్యాయ్ యాత్ర లోగో, నినాద ఆవిష్కరణలో ఖర్గే



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్‌లో సమస్యలు లేవనెత్తడానికి ప్రభుత్వం అవకాశం ఇవ్వనందున తమ పార్టీ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'ను చేపడుతున్నట్టు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ఏఐసీసీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేపడుతున్న 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' లోగో, నినాదాన్ని(న్యాయ్ కా హక్ మిల్నే తక్) మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కెసి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరామ్ రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర దేశంలోని ప్రాథమిక సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలపై దృష్టి పెడుతుంది' అన్నారు. ఇండియా ఫోరం నాయకులు, పౌర సమాజ సభ్యులను కూడా మార్చ్‌లో పాల్గొన డానికి ఆహ్వానించామని తెలిపారు. గతంలో దక్షిణం నుంచి ఉత్తరం వరకు (కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు) భారత్ జోడో యాత్ర అత్యంత ప్రభావవంతంగా, పరివర్తనాత్మకంగా జరిగిందని, ఇప్పుడు తూర్పు నుంచి పడమర వరకు (మణిపూర్ నుంచి ముంబయి వరకు) భారత్ జోడో న్యాయ్ యాత్ర చేపట్టినట్టు చెప్పారు.

'పార్లమెంటులో ప్రజా సమస్యలను లేవనెత్తడానికి ప్రభుత్వం మాకు అవకాశం ఇవ్వలేదు. అందుకే కాంగ్రెస్ భారత్ జోడో న్యాయ్ యాత్రను చేపడుతున్నది. మేం ఈ వేదిక (యాత్ర) ద్వారా ప్రజల సమస్యలను వింటాం' అని ఖర్గే అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష నేతలను బెదిరించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఆదాయపు పన్ను శాఖ వంటి ఏజెన్సీలను ...13లో

పారిశ్రామిక అభివృద్ధికి

> ప్రతి పైసా పెట్టుబడికి రక్షణ కల్పిస్తాం

మెగా మాస్టర్ ప్లాన్

మూడు క్లస్టర్లుగా తెలంగాణ

- మాది ఫ్రెండ్లీ పారిశ్రామిక విధానం
- కొత్తగా ఫార్మా విలేజ్‌లు
- అన్ని రంగాల పరిశ్రమలకు ప్రోత్సహం

సీఐఐ ప్రతినిధుల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



రాష్ట్రవ్యాప్తంగా 2050 నాటికి పారిశ్రామికాభివృద్ధే లక్ష్యంగా మెగా మాస్టర్ పాలసీని రూపొందించనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో భారత పారిశ్రామిక సమాఖ్య (సీఐఐ) ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. తెలంగాణ ప్రాంతంలో 1994 నుంచి 2004 వరకు పరిశ్రమల అభివృద్ధికి అనుసరించిన ఫార్ములా ఒక తీరుగా ఉంటే.. 2004 నుంచి 2014 వరకు అది మరో మెట్టుకు చేరుకుందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఇది అత్యున్నత వృద్ధి దశకు చేరుకోవాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని వెల్లడించారు.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పరిశ్రమల అభివృద్ధికి, పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఫ్రెండ్లీ పాలసీని అనుసరిస్తుందని సీఎం ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టే ప్రతి పైసాకు రక్షణ కల్పిస్తామనీ, అంతకంతకు విలువ కూడా పెరుగుతుందని భరోసా ఇచ్చారు. హైదరాబాద్ ఒక్కచోటే పారిశ్రామిక అభివృద్ధి కేంద్రీకృతం కాకుండా.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు హైదరాబాద్ తరహాలోనే అభివృద్ధి చెందాలనే ఆకాంక్షను రేవంత్ వ్యక్తపరిచారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా పరిశ్రమలు విస్తరించాలనేది తమ లక్ష్యమని అన్నారు. నగరాలు, పట్టణాల్లో అభివృద్ధి ఫలాలు, పెట్టుబడులతోనే గ్రామాలు, గ్రామీణ ప్రాంతాల సౌభాగ్యం, సంక్షేమం కూడా ముడిపడి ఉంటుందని వివరించారు. పారిశ్రామికంగా అన్ని రంగాలు అభివృద్ధి చెందేలా ఫ్రెండ్లీ పాలసీని అమలు చేసేందుకు ఔత్సాహికులు, పారిశ్రామికవేత్తలు సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ పాలసీలో భాగంగా తెలంగాణను మూడు క్లస్టర్లుగా విభజించనున్నట్టు సీఎం తెలిపారు. హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపల అర్బన్ క్లస్టర్, ఓఆర్ఆర్ తర్వాత రీజనల్ రింగ్ రోడ్డు వరకు మధ్యలో ఉన్న ప్రాంతం సెమీ అర్బన్ క్లస్టర్‌గా, రీజనల్ రింగ్ రోడ్డు తర్వాత చుట్టూరా ఉన్న ప్రాంతాన్ని రూరల్ క్లస్టర్‌గా గుర్తించి పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహాలను అందిస్తామని వివరించారు. ఫార్మాసిటీ విషయంలో ప్రభుత్వానికి స్పష్టమైన ఆలోచనలు ఉన్నాయని తెలిపారు. ఫార్మాసిటీతో ...3లో

రాష్ట్రంలో వెల్ స్పాన్ గ్రూప్ పెట్టుబడులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు వెల్‌స్పాన్ గ్రూప్ సంసిద్ధత వ్యక్తం చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. శనివారం సచివాలయంలో వెల్‌స్పాన్ గ్రూప్ చైర్మెన్ బి.కె.గోయెంకా, ఇతర ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. పరిశ్రమల అభివృద్ధికి, పెట్టుబడులను ఆహ్వానించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఫ్రెండ్లీ పాలసీని ...3లో

హిందుత్వ శక్తులకు లొంగిపోతున్నదా?

న్యాయ వ్యవస్థ తీరుపై రాజ్యాంగ నిపుణుల సందేహాలు

అయోధ్య ఆర్టికల్ 370 తీర్పులను ప్రస్తావిస్తూ విమర్శిస్తున్న న్యాయ కోవిదులు



ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ ఇటీవల పీటీఐ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇస్తూ అయోధ్య కేసులో, ఆర్టికల్ 370 రద్దు కేసులో ఏకాభిప్రాయంతో తీర్పు ఇచ్చామని, అందులో హేతుబద్ధత ఉన్నదని తెలిపారు. అయితే ఈ తీర్పులు భారత న్యాయ వ్యవస్థ స్వభావానికి, దాని దిశకు సంబంధించిన అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని విమర్శకులు తెలిపారు. వాస్తవానికి ఈ రెండు తీర్పులను పరిశీలిస్తే పాలకుల ఆలోచనలకు అనుగుణంగానే న్యాయవ్యవస్థలో మెజారిటీ వర్గం వ్యవహరిస్తున్నదని, ఇది ప్రమాదకరమైన సంకేతమని వారు హెచ్చరించారు.

న్యూఢిల్లీ : మోడీ పాలనలో హిందుత్వ ఆధిపత్య వాదం తన వక్రీకరణలు, సొంత భాష్యాల ద్వారా భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తోంది. ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఏకగ్రీవ తీర్పు, మోడీ ప్రభుత్వ చర్యను సమర్థించేలా ఇచ్చిన వివరణ పట్ల లౌకిక, ప్రజాస్వామిక, సమాఖ్య రిపబ్లిక్‌గా కొనసాగుతున్న భారత దేశ భవిష్యత్తుపై పలువురు రాజ్యాంగ నిపుణులు, పాత్రికేయులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణంపై కూడా అత్యున్నత న్యాయస్థానం ఇదే రకమైన పస లేని తర్కాన్ని ప్రదర్శించిందని వారు గుర్తు చేశారు. ఈ రెండు కేసులూ ప్రస్తుత ప్రభుత్వ సైద్ధాంతిక ప్రాజెక్ట్ అయిన 'హిందూ రాష్ట్ర' దృష్టిలో అత్యంత ప్రాధాన్యత కలిగినవి. ఈ రెండింటిలోనూ హిందుత్వ శక్తులకు అనుకూలంగా తుది తీర్పులు వెలువడ్డాయి. ఈ తీర్పుల ద్వారా న్యాయస్థానం అత్యంత అసాధారణమైన అంశాలను సాధారణమైనవిగా మార్చేసింది. ఒకరకంగా 'హిందూ రాష్ట్ర' భావనకు చట్టబద్ధత కల్పించింది. రాజ్యాంగ విరుద్ధమైన వాటిని రాజ్యాంగ బద్ధం చేసింది.

ఆర్టికల్ 370 రద్దుపై...

ఆర్టికల్ 370 జమ్మూకాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని, పరిమిత సార్వభౌమాధికారాన్ని కల్పించింది. అయితే స్వాతంత్య్రానంతరం కేంద్రంలో తొలుత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు రాజ్యాంగం కల్పించిన ఆ హామీని విస్మరించాయి. 2019లో మోడీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత హిందూ రాష్ట్ర అజెండాతో రాష్ట్రపతి ఉత్తర్వులతో ఆర్టికల్ 370ని రద్దు చేసింది. మోడీ ప్రభుత్వ చర్యలో చట్టబద్ధత, హేతుబద్ధత లేకపోవడం, ఓ పద్ధతి ప్రకారం వ్యవహరించకపోవడం, రాజ్యాంగ అనైతికతకు పాల్పడడం వంటి ప్రశ్నలు రాజ్యాంగ ధర్మాసనం ముందుకు వచ్చాయి.

'370'కి వక్రభాష్యం

ఆర్టికల్ 370ని రాజ్యాంగపరమైన అడ్డంకిగా ...3లో

ఇప్పుడు గుర్తొచ్చాయా?

గతంలో ఎప్పుడైనా ఇలాంటి మీటింగులు పెట్టారా? బీఆర్ఎస్ పెద్దపల్లి సమీక్షా సమావేశంలో నేతల ఆవేదన

- హరీశ్‌రావు, కడియం ముందే ఆక్రోశం వెళ్లగక్కిన వైనం
- జ్వరం వల్ల హాజరు కాలేకపోయిన కేటీఆర్
- నేడు 'జహీరాబాద్'పై సమీక్ష

ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ దూరం..?

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎమ్మెల్యే కోటా కింద జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ నిర్ణయించినట్టు తెలిసింది. ఆ కోటాలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఈనెల 29న ఎన్నికలు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈనెల 11న సంబంధిత నోటిఫికేషన్ వెలువడనుంది. రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ప్రత్యేకంగా వేర్వేరుగా ఎలక్షన్ నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) నిర్ణయించిన నేపథ్యంలోనే ...13లో



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్టుగా మన పరిస్థితి తయారైంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ఇప్పుడు తీరుబడిగా సమీక్షలు, సమావేశాలు పెడితే ఏం లాభం...' అంటూ పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేండ్ల నుంచి ఇలాంటి మీటింగులు మీరెప్పుడైనా పెట్టారా..? అలా ...13లో

ఎన్ వెంకటేష్‌కు టికెట్ లేనట్టేనా?

- రేసులో మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, మాజీ మంత్రి కొప్పుల
- పెద్దపల్లిపై సమీక్ష సందర్భంగా హాట్ హాట్ చర్చ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మంది సిట్టింగ్‌లకే టికెట్లిచ్చిన బీఆర్ఎస్ ఈ సారి తన రూటు మార్చనుందా?.. అంటే అవుననే అంటున్నాయి ఆ పార్టీ వర్గాలు. పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గ సన్నాహక సమావేశం సందర్భంగా ...13లో

తొలి సోలార్ మిషన్ విజయవంతం

హాలో ఆర్బిట్‌లోకి ఆదిత్య ఎల్-1



న్యూఢిల్లీ : ఆదిత్య ఎల్-1 భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో చరిత్ర సృష్టించింది. భారతదేశ తొలి సోలార్ మిషన్ విజయవంతమైంది. తొలి ప్రయత్నంలోనే సోలార్ మిషన్ విజయవంతంగా నిర్వహించిన రెండో దేశంగా నిలిచింది. ఆదిత్య ఎల్-1 శాటిలైట్‌ను ఇస్రో శనివారం విజయవంతంగా ...13లో

అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగం

ఏపీ ప్రభుత్వ నియంతృత్వ పోకడ



అమరావతి : తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆంధ్రప్రదేశ్‌లో 26 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఆ రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వ చర్యలకు పూనుకున్నది. రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్న వారిపై ఎస్మా ప్రయోగిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అంగన్వాడీలను అత్యవసర సర్వీసుల కిందకు తీసుకొస్తూ జీవో నెంబర్ 2ను విడుదల చేసింది. ఆరు నెలలపాటు సమ్మెలు, నిరసనలు నిషేధమంటూ తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. మరోవైపు సమ్మె చేసిన కాలానికి అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల వేతనంలో కోత విధించింది. దాదాపు రూ.3వేలు తగ్గించి.. రూ.8,050 వేతనాన్ని వారి ఖాతాల్లో ...13లో

ఉపసంహరించుకోవాలి

- వారి సమస్యలను పరిష్కరించాలి
- సీఐటీయూ రాష్ట్ర కమిటీ డిమాండ్

వివరాలు 13లో..



మీ అభిప్రాయం చెప్పండి


న్యూస్‌క్లిక్ పిటిషన్‌పై కేంద్ర సంస్థలకు సుప్రీం నోటీసులు

- 'స్వాధీనాల'పై మార్గదర్శకాలు అవసరమన్న పిటిషనర్లు

న్యూఢిల్లీ : ఆన్‌లైన్ న్యూస్ పోర్టల్ న్యూస్‌క్లిక్, దాని వ్యవస్థాపక సంపాదకుడు ప్రబీర్ పుర్కాయస్థ దాఖలు చేసిన పిటిషన్లపై అభిప్రాయాన్ని తెలియజేయాల్సిందిగా సుప్రీంకోర్టు శుక్రవారం సీబీఐ, ఈడీ, ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసింది. సోదాలు, ఎలక్ట్రానిక్ పరికరాల స్వాధీనం విషయంలో మార్గదర్శకాలు జారీ చేయాలని పిటిషనర్లు అభ్యర్థించారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగానికి చెందిన అధికారులు గత సంవత్సరం అక్టోబరులో న్యూస్‌క్లిక్ పోర్టల్ ఉద్యోగులు, కంట్రిబ్యూటర్ల నివాసాలపై దాడి చేసి, వారి నుండి ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్న విషయం ...13లో

రేపటి నుంచి రైతుబంధు

అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు బంధు డబ్బులను సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో జమ చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆర్థికశాఖ ఉన్నతాధికారుల ను ఆదేశించారు. రోజువారీగా నిధులను విడుదల చేయాలని సూచించారు. గత ప్రభుత్వం నుంచి క్లిష్టతరమైన ఆర్థిక పరిస్థితులు సంక్రమించినప్పటికి రైతు బంధును సకాలంలో అందచేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర రైతాంగం, ప్రజలు రైతు బంధు విడుదలపై ఎలాంటి అనుమానాలు పెట్టుకోవాల్సిన అవసరంలేదని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో రైతు బంధు నిధుల విడుదలపై ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి, వ్యవసాయ శాఖ కార్యదర్శి, కమిషనర్‌తో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు రైతు బంధు కింద 27లక్షల మంది (40శాతం) రైతులకు వారి బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు జమ చేసినట్టు పేర్కొన్నారు. యాసంగి పంటల సాగు ముమ్మరంగా కొనసాగుతున్నందున త్వరితగతిన మిగతా రైతులకు కూడా సొమ్ము జమ చేయాలని ఆదేశించారు. ఈ అంశంపై ...13లో

ప్రజాపాలనకు 1.25 కోట్ల దరఖాస్తులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆరు గ్యారెంటీల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం వారం రోజులపాటు నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మొత్తం 1,25,84,383 దరఖాస్తులు వచ్చాయి. అయితే ఈ కార్యక్రమం నిత్యం కొనసాగేదే అనీ, చివరి తేదీ అంటూ ఏదీ లేదని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఓ టీవీ ఛానల్‌కు శనివారం ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. రాష్ట్రప్రభుత్వం ఈ దరఖాస్తుల స్వీకరణను డిసెంబర్ 28 నుంచి ప్రారంభించిన విషయం తెలిసిందే. శనివారంతో తొలి విడత దరఖాస్తుల స్వీకరణ ముగిసింది. వీటన్నింటినీ డేటా ఎంట్రీ చేయాలని ప్రభుత్వం ఆయా శాఖల ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. సోమవారం నుంచి దరఖాస్తుల్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగనుంది.

అంగన్వాడీలపై 'ఎస్మా' అన్యాయం

- వర్కింగ్ ఉమెన్ కన్వీనర్ ఎస్వీ రమ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగిస్తూ విడుదల చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని వర్కింగ్ ఉమెన్ కన్వీనర్ ఎస్వీ రమ (సీఐటీయూ) డిమాండ్ చేశారు. అంగన్వాడీలపై ఎస్మాను ప్రయోగించడం అంటే యావత్ కార్మికులు, ప్రజాతంత్ర హక్కులపై దాడి చేయడమేనని అన్నారు. వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా నిర్బంధాన్ని ప్రయోగించటం తగదనీ, ఇలాంటి నియంతృత్వ చర్యలకు పాల్పడితే కార్మిక వర్గం సహించదని హెచ్చరించారు.

ఉద్యోగాల భర్తీలో న్యాయ వివాదాలను పరిష్కరించాలి

- డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగాల భర్తీలో న్యాయ వివాదాలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం డిమాండ్ చేసింది. గత ప్రభుత్వం జారీ చేసిన పలు ఉద్యోగాల నోటిఫికేషన్లలో మహిళలకు వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్ల సమస్య న్యాయ వివాదంలో ఉందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దాని వల్ల అనేక నోటిఫికేషన్లు హైకోర్ట్ పరిధిలో నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. గురుకుల ఫలితాలు కోర్టు కేసులో చిక్కుకుని ఉన్నప్పటికీ గురుకుల బోర్డు అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల ఫలితాలు విడుదల కావడం లేదని తెలిపారు. దీంతో రెండు లక్షల మంది గురుకుల అభ్యర్థులు నిరాశలో ఉన్నారని పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీ జారీ చేసిన పలు నోటిఫికేషన్లు, విద్యాశాఖ జారీ చేసిన డీఎస్సీ కూడా కోర్టు కేసులతో జాప్యం జరిగే అవకాశముందని తెలిపారు. కొత్త ప్రభుత్వం ఈ అంశాలను గమనించి వెంటనే న్యాయ వివాదాలను పరిష్కరించాలని కోరారు. గురుకుల బోర్డు, విద్యాశాఖతోపాటు అన్ని నియామక బోర్డులతో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు.


సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ నాయకురాలు వైఎస్ షర్మిల మర్యాదపూర్వకంగా కలిశారు. తన కుమారుడి నిశ్చితార్థం, వివాహానికి రావాలని ముఖ్యమంత్రిని ఆమె ఆహ్వానించారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

- మంత్రి పొంగులేటిని కలిసిన ఫెడరేషన్ నేతలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు కోరారు. ప్రధానంగా జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను గత ప్రభుత్వం పరిష్కరించకుండా పదేండ్లు జాప్యం చేసిందనీ, కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ఈ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. శనివారం ఫెడరేషన్ ప్రతినిధుల బృందం రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, తన్నీరు శ్రీనివాస్, కార్యదర్శి ఈ. చంద్రశేఖర్, నాయకులు కె. పాండురంగారావు, జే. ఉదయభాస్కర్ రెడ్డి, యర్రమిల్లి రామారావు తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు జర్నలిస్టుల సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. గతంలో జర్నలిస్టులకు మూడుసార్లు ఇండ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా తమకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్ల స్థలాలు ఇస్తుందనే నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఒకేసారి రూ.100 కోట్లు విడుదల చేయాలని, చనిపోయిన జర్నలిస్టు కుటుంబానికి ఇచ్చే సహాయాన్ని రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. పదవీ విరమణ పొందిన జర్నలిస్టులకు పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని, జర్నలిస్టులందరికీ పూర్తి స్థాయిలో హెల్త్ కార్డులు జారీ చేసి, అన్ని ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అవి చెల్లుబాటు అయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆర్ఎన్ఐ గుర్తింపు పొందిన అన్ని చిన్న, మధ్య తరహా పత్రికలను, కేబుల్ టీవీ న్యూస్ చానల్స్, డిజిటల్ మీడియాలను ప్రభుత్వం గుర్తించి, ప్రకటనలు, రాయితీల ద్వారా ఆదుకోవాలని, జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, సరైన వేతనాల చెల్లింపుల కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో అనేక మంది జర్నలిస్టులపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసుల బనాయింపులు జరిగాయనీ, అలాంటివి జరక్కుండా నిరోధిస్తూ రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు వేయాలని కోరారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలనీ, రైల్వే రాయితీ పాస్‌ల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలనీ, వారి పిల్లలకు ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఉచిత విద్య వసతి కల్పించాలని చెప్పారు. వీటిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందిస్తూ జర్నలిస్టుల సమస్యలపై తమకు పూర్తి అవగాహన ఉందనీ, సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమాలను మేనిఫెస్టోలో చేర్చి అమలు చేస్తామని హామీ ఇచ్చిందని చెప్పారు

ప్రయివేటు ఆస్పత్రులతో జీవీకే-ఈఎంఆర్ఐ అధికారుల కుమ్మక్కు

- తెలంగాణ 108 ఉద్యోగుల జేఏసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రయివేటు ఆస్పత్రులతో లోపాయికారీగా కుమ్మక్కైన జీవీకే-ఈఎంఆర్ఐలో కొంత మంది అధికారులు ఉద్యోగులను వేధిస్తున్నారని తెలంగాణ 108 ఉద్యోగుల జేఏసీ ఆరోపించింది. ఈ మేరకు శనివారం జేఏసీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. కాల్ చేసిన రోగిని ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో ఎక్కడికైనా తీసుకుపోయేలా 108 అంబులెన్స్‌ల నిర్వహణ సంస్థ ఈఎంఆర్ఐ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుందని గుర్తుచేశారు. దాన్ని అమలు చేయకుండా తాము చెప్పిన ఆస్పత్రులకే రోగులను తీసుకెళ్లాలని ఆ సంస్థ ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ప్రయివేటు ఆస్పత్రుల నుంచి నగదు (లిక్విడ్ క్యాష్) తీసుకుంటూ ఈ దందా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని వ్యతిరేకించిన ఉద్యోగులకు అవే ప్రయివేటు ఆస్పత్రుల నుంచి డబ్బులు ఆన్‌లైన్‌లో పంపించి వాటిని హైదరాబాద్‌లో యాజమాన్యానికి చూయించి సస్పెండ్ చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ప్రయివేటు ఆస్పత్రులతో ఇలాంటి దందా ఎక్కువగా జరుగుతోందని తెలిపారు. వీరిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసిన బీఆర్ఎస్

- ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరుతాం
- కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు ఒకటో తేదీ జీతాలు ఇచ్చింది
- ఇంటర్నేషనల్ స్కూళ్ల కోసం స్థలాల సేకరణ
- ప్రజాపాలన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ధనిక రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు గ్రామంలో శనివారం ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దరఖాస్తుల స్వీకరణ కౌంటర్‌లను పరిశీలించి.. జనం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కూడా నిండలేదని, అప్పుడే హామీలు అమలు చేయడంలో విఫలమైనట్టు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఈ సంవత్సరపు చివరి త్రైమాసిక నిధులను కూడా ఎన్నికలకు ముందే విడుదల చేసి బీఆర్ఎస్ పాలకులు దోపిడీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దివాలా తీయించిందని, రాష్ట్ర ఖజానాను ఊడ్చి వేసినా, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అధిగమించి ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఐదు సంవత్సరాలుగా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేదని చెప్పారు. ప్రతి మండల కేంద్రంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. అందుకోసం భూములను ఎంపిక చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు గ్రామంలో శిథిలావస్థకు చేరిన కళాశాల నిర్మాణానికి, గ్రామంలో రెండు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తామన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని మోడల్ ఆస్పత్రిగా తీర్చిదిద్దడానికి కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తామని, వైద్య ఆరోగ్య సిబ్బంది నియామకం చేపడతామని చెప్పారు.

డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం

బనిగండ్లపాడు ప్రజాపాలన కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కలెక్టర్ గౌతం, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, డీసీసీ అధ్యక్షులు పువ్వాళ దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, నాయకులు బండారు నరసింహారావు ఘనంగా స్వాగతం పలికారు.

వృత్తిదారుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలి

- బొమ్మగాని ప్రభాకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కల్లు గీత వృత్తిపై ఆధారపడిన లక్షలాది పేద, వెనుకబడిన వారికోసం ప్రభుత్వము వత్తి, వృత్తిదారుల సంక్షేమం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర గీత పని వారల సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని అన్ని కల్లు గీత సహకార సంఘాలకు గ్రామ, పట్టణాలు పునాదిగా వన పెంపకం, పది ఎకరాల భూమి, షాపు ఏర్పాటుకు రెండువేల గజాల స్థలంతో పాటు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. చెట్టుపై నుండి పడి మరణించిన వారి కుటుంబానికి రూ.10 లక్షలు, తాత్కాలికంగా గాయపడిన వారికి రూ. రెండు లక్షల ఎక్స్‌గ్రేషియా పెంచాలని డిమాండ్ చేశారు. గతంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ ధృవీకరణలో ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని మెడికల్ బోర్డు పద్ధతి రద్దు చేయాలని ప్రభాకర్ ప్రభుత్వాన్ని కోరారు. ఏజెన్సీ ఏరియాలోని గీత వత్తిదారులకు లైసెన్సులు సహకార సంఘాలు టీ ఐ ఎఫ్ టి లు ఇవ్వాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని విజ్ఞప్తించారు. పెన్షన్ పెంచాలని గతంలో కారణాలతో రద్దు చేసిన గీత వత్తిదారుల పెన్షన్ పునరుద్ధరించాలని, వత్తిదారులకు వాహనాలు, వత్తి ఆధునికతకు చర్యలు చేపట్టాలని బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేశారు.

మంత్రి తుమ్మలకు శుభాకాంక్షలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుకు తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం చైర్మెన్ బి.కృపాకర్ రెడ్డి, అధ్యక్షులు డి.వైద్యనాథ్, ప్రధాన కార్యదర్శి జి.కృపాకర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన వారు సంఘం నూతన కార్యవర్గ సభ్యులు పరిచయం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటల విధానాన్ని చేపట్టాలని కోరారు. పండించిన ఉత్పత్తులను రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేసే అవకా శాలను వినియోగి ంచుకో వాలని సూచించారు. క్షేత్రస్థా యిలో రైతులకు అందుబాటులో ఉండాలని కోరారు. రాష్ట్ర స్థాయిలో రూపొందించిన ప్రణాళికలను, వ్యవసాయ విశ్వవిద్యాలయ సలహాలు, సూచనలను ఎప్పటికప్పుడు రైతుకు వివరించాలని సూచించారు. జిల్లా స్థాయి వ్యవసాయ విజ్ఞాన కేంద్రాల ద్వారా రైతులను చైతన్య పరచాలని కోరారు. మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ వి.చంద్రమోహన్ తదితరులున్నారు.

బ్రిజ్ భూషణ్‌పై అభియోగాలు మోపాలి

ఢిల్లీ కోర్టును కోరిన పోలీసులు

న్యూఢిల్లీ: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో బీజేపీ ఎంపి, మాజీ రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై అభియోగాలు మోపాలని ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టుకు ఢిల్లీ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ప్రియాంక రాజ్‌పుత్‌ను ఢిల్లీ పోలీసులు కోరారు. బ్రిజ్ భూషణ్‌పై అభియోగాలు మోపడానికి సంబంధించి వాదనలు ముగించినందున, ఆరోపించిన సంఘటనలు కొన్ని విదేశాల్లో జరిగినందున, అవి ఢిల్లీలోని కోర్టుల పరిధిలోకి రావన్న నిందితుల వాదనను పోలీసులు వ్యతిరేకించారు.

గిరీశం పలుకులు...

ఆరెస్బీ

టుబాకో...



గిరీశం : ఆ చుట్టలన్నీ పట్టుకుని ఈ కోవెల గోపురంలో కూచుని కాల్చుకుందాం రా !

శిష్యుడు : కోవిల్లో చుట్టకాల్చవచ్చునా ?

గిరీశం : కాలిస్తే కోవిల్లోనే కాల్చాలోయి. దీని పొగముందు సాంబ్రాణి, గుగ్గిలం ఏమూల? అంటూ లంక పొగాకు వాసన చూసి ఆహా! ఏం టుబాకోనోయ్ ! విలేజి లైఫ్ మా గొప్పగా ఉంటుంది. మాంచి టుబాకో, బెస్ట్ గేదె పెరుగు, మంచి ఘీ. అంచేతనే ననుకుంటా ఇంగ్లీషు పోయట్సంతా కంట్రీలైఫ్, కంట్రీలైఫ్ అంటూ పడి చచ్చిపోయేవారు. ప్రశాంతంగా చుట్ట ముట్టించి తన్మయం చెందుతున్నాడు గిరీశం. అప్పుడే బొగ్గు లోడ్ చేసుకున్న పాతకాలపు స్టీమింజన్‌లా గుప్పున పొగవదిలాడు.

శిష్యుడు : మీకు జంధ్యముంది కాబట్టి బతికిపోయారు. ఇందాకే ఒక కాషాయ బొట్టు పెట్టుకున్నాయన మన వైపు కొరకొరా చూసుకుంటూ వెళ్లాడు. పోదాం పదండి బాబూ! ఏదైనా ప్రమాదం రావచ్చు.

గిరీశం : బేస్ ఇన్‌గ్రాటిట్యూడ్ ! నాతో మాట్లాడమే ఒక ఎడ్యుకేషన్ అని బ్రిటన్ పార్లమెంట్ వరెండాల్లో చర్చ జరిగేదట! రానివ్వు వెధవాయిల్ని కడిగిపారేస్తాను.

శిష్యుడు : రోజులు మారాయి సార్. వాళ్ల నోటితో కాదు. కత్తులతో మాట్లాడతారు అంటూ రెండు చుట్టల్నీ గోడకి రుద్దేసి జేబులో వేసుకుని, గిరీశాన్ని పట్టుకుని పరుగులాంటి నడకతో గుళ్ళోంచి బయటపడ్డాడు.

« » « » « »

రామప్పంతులు, మధురవాణితో 'లౌక్యం' గురించి చర్చ చేస్తున్నాడు. నమ్మిన చోట చేస్తే మోసం, నమ్మని చోట చేస్తే 'లౌక్యం' అని సిద్ధాంతీకరించాడు పంతులుగారు.

మధురవాణి : మీరు చేస్తే లౌక్యం, మరోడు చేస్తే మోసం అనరాదా! అబద్ధానికి అర్ధమేమిటండీ!?

రామ : 'ఉద్యోగధర్మం లౌక్య వృత్తీ' అని అది ఒక వృత్తి .భగవంతుడు కల్పించాడు. లౌక్యవృత్తంటే నిజాన్ని పోలిన అబద్ధమాడి ద్రవ్యాకర్షణ చేసేది

మధు : దాన్నే తిరగేసి చెప్పండి!

రామ : ఆ పైత్యమేమిటి?

మధు : అబద్ధమని తెలిసీ దాన్ని నిజంలాగా పలికి ముందు ఓటర్లనాకర్షించి ఆ తర్వాత ద్రవ్యాకర్షణ దాన్నెతుకుంటూ రాదా? ఇదేనా లౌక్యం పంతులుగారూ!

రామ : పేరుకు సానేఅయినా మా గొప్ప తెలివితేటలిచ్చాడు దీనికి భగవంతుడు. ఎట్నించి ఎటులాగి ముడేస్తుందోనని లోపల భయపడుతూనే ఉన్నాడు. పైకి గంభీరంగా 'అయితే ఏవంటావు' అన్నాడు గొంతు పెంచి.

మధు : అన్నేసి ఉద్యోగాలివ్వలేమని తెల్సినా సాలుకు రెండు కోట్ల ఉద్యోగాలిస్తామనడం సరైందేనా? ఒక్క చోట పైపై మెరుగులు చూపించి దేశమంతా అలానే చేస్తామనడం తప్పుకాదా? ఇవన్నీ నిజంలాంటి అబద్ధాలా? అబద్ధమని తెల్సికూడా చెప్పడం అన్యాయం కాదా పంతులుగారూ!

రామ : రాజేంద్రుని తప్పు పట్టకు మధురం! మధ్యలో



దేశాలు కొట్టుకు చస్తాయని ఆయనేమైనా కలగంటాడా?

మధు: మాటలు మార్చి ఏమార్చకండి మహానుభావా! నేను ముందడిగిన రెండు ప్రశ్నలకూ జవాబు చెప్పి ఆ తర్వాత దేశాలు, యుద్ధాలు కత చెప్పండి. అయినా, ఇప్పటివరకు యుద్ధాలొచ్చినపుడు మన దేశం ఎవరి పక్కన, ఎవరి కోసం నిలబడింది? ఇపుడెక్కడుంది? అయినా. నాకో విషయం అర్థం కాదు. ఒక దేశంలో వారి అత్యున్నత న్యాయస్థానం వారి ప్రధాని తప్పు చేశాడని చెప్పింది. లక్షల్లో ఆదేశ జనం రోడ్లెక్కి వారి దేశ ప్రధానిని ఖండిస్తున్నారు. ఆయన్ని దిగిపొమ్మంటున్నారు. మరి మన రాజేంద్రుని ఆలింగనంలో అర్ధమేంటి?

రామ : ఆ రాచరిక విషయాలు సానులకేం తెలుస్తాయి?

మధు: సమాధానం దొరక్కపోయే సరికి నేను సాన్దాన్నన్నే విషయం గుర్తొచ్చిందా? ఈ లోపు లాఠీ చప్పుడు చేస్తూ కానిస్టేబులొచ్చాడు. "పంతులూ! ఇనస్పెక్టర్ పేరు చెప్పి సుబ్బిశెట్టి దగ్గర రెండువందల్లాగావట! ఉన్నపళాన్న పిలకిచ్చుకీడ్చుకురమన్నాడు" అంటూ లాక్కుపోయాడు.

గుళ్లోంచి గిరీశం, వెంకటేశం తోటలో చేరారు.

శిష్యుడు : మీ వల్ల నాకు చుట్టకాల్చటమొక్కటే వచ్చింది. ఒక్క మారైనా పాఠం చెప్పిన పాపాన పోయారా?

గిరీశం: ఇంగ్లీషోడు చుట్ట పంపిణీ మీదనే స్టీముయంత్రం కనుక్కున్నాడని చెప్పాను కదా! శాస్త్రకారుడు ఏవన్నాడో చూశావా? ఖగపతి అమృతము తేగా! భుగ భుగమని పొంగి చుక్క భూమిని వ్రాలెన్ పొగ చెట్టై జన్మించెను! పొగత్రాగనివాడు దున్నపోతై పుట్టున్ ! అని బృహన్నారదీయంలో ఉందని నీకు చెప్పి నీ జ్ఞానం పెంచింది నేను కాదా!

పారిశ్రామిక అభివృద్ధికి మెగా మాస్టర్ ప్లాన్

(మొదటి పేజీ తరువాయి)

పాటు ఫార్మా విలేజీలను కూడా అభివద్ధి చేస్తామన్నారు. ఓఆర్ఆర్‌పై 14 రేడియల్ రోడ్లు ఉన్నాయనీ, వీటికి 12 జాతీయ రహదారుల కనెక్టివిటీ ఉందని తెలిపారు. వీటికి అందుబాటులో ఉండేలా దాదాపు వెయ్యి నుంచి 3 వేల ఎకరాలకో ఫార్మా విలేజీని అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. వీటి ద్వారా ప్రజల జీవనానికి ఇబ్బంది లేకుండా, కాలుష్యం లేకుండా చూస్తామన్నారు. పరిశ్రమలతో పాటు స్కూళ్లు, హాస్పిటళ్లు, అన్ని మౌలిక సదుపాయాలుండేలా వీటిని అభివృద్ధి చేసే ప్రణాళికలను తమ ప్రభుత్వం రూపొందిస్తుందని అన్నారు. ఇదే విధంగా అన్ని రంగాలకు ప్రోత్సాహకాలను అందిస్తామని స్పష్టం చేశారు.

ఎన్నికలు వేరు... రాజకీయాలు వేరు...

ఎన్నికలు, రాజకీయాలు వేరు.. అభివృద్ధి వేరని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా అభిప్రాయ పడ్డారు. దార్శనికతతో పారదర్శకమైన అభివృద్ధిని తమ లక్ష్యంగా ఎంచుకున్నట్టు తెలిపారు. ప్రభుత్వం పరిశ్రమల వృద్ధికి సహకరించదనే అపోహలు పెట్టుకోవద్దని అన్నారు. ఎవరికి వారుగా తమకున్న అభిప్రాయాలు ఇతరులపై రుద్దవద్దని హితవు పలికారు. 24 గంటల పాటు తాను ఆఫీసు లేదా క్యాంపు కార్యాలయంలో అందరికీ అందుబాటులో ఉంటాననీ, తనతో మాట్లాడి నిర్ణయాలు తీసుకోవాలంటూ పారిశ్రామికవేత్తలను, పెట్టుబడిదారులను ఆహ్వానించారు. తమతోగానీ, ప్రభుత్వ ప్రతినిధులు, అధికారులతోగానీ మాట్లాడకుండానే తొందరపడి ఒక అభిప్రాయానికో, నిర్ణయానికో రావద్దని వారిని కోరారు.

యువతీ యువకులకు నైపుణ్యాలను నేర్పించేందుకు ఆయా యూనివర్సిటీలను నెలకొల్పుతామని రేవంత్ తెలిపారు. స్కిల్ యూనివర్సిటీల్లో డిగ్రీలు పొందిన యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయనీ, పోటీ ప్రపంచంలో ఎక్కడైనా నిలదొక్కుకునే సామర్థ్యం వాళ్ల సొంతమవుతుందని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఐటి శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ప్రతినిధులు సి.శేఖర్ రెడ్డి, అనిల్ కుమార్, డాక్టర్ మోహన్ రెడ్డి, సతీష్ రెడ్డి, సుచిత్రా కె.ఎల్లా, శ్రీమతి వనిత దాట్ల, రాజు, సంజయ్ సింగ్, ప్రదీప్ ధోబాలే, శక్తి సాగర్, వై. హరీష్ చంద్ర ప్రసాద్, గౌతమ్ రెడ్డి, వంశీకృష్ణ గడ్డం, శివప్రసాద్ రెడ్డి రాచమల్లు, రామ్, చక్రవర్తి, షైక్ షామి ఉద్దీన్, వెంకటగిరి, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆ మెట్రో రూట్‌తో ఉపయోగం

సీఐఐ ప్రతినిధుల సమావేశంలో మెట్రో రైల్ రూట్ విస్తరణపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోమారు స్పష్టతను ఇచ్చారు. గతంలో గచ్చిబౌలి - ఎయిర్ పోర్టు వరకు 32 కిలోమీటర్ల మేర ప్రణాళికలు రూపొందించారనీ, దానివల్ల సామాన్య జనాలకు పెద్దగా ఉపయోగం లేదని తెలిపారు. గచ్చిబౌలి, జూబ్లీహిల్స్ చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో అత్యధిక మంది ధనికులు వుండటం వల్ల వారు ఎక్కువగా సొంత వాహనాలు వాడుతున్నారని తెలిపారు. గతంలో సర్వే చేసిన గౌలిగూడ - ఫలక్ నామ - ఏయిర్‌పోర్టు రూట్, ఎల్బీ నగర్ నుంచి ఎయిర్ పోర్టు రూట్‌ను ప్రజలు ఎక్కువగా వినియోగించుకునేందుకు అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఈ ప్రాంతాల నుంచి అరబ్ దేశాలకు అధికంగా వెళుతుంటారని చెప్పారు. విదేశాలకు వెళ్లే వారి కుటుంబాలు ఎయిర్ పోర్టుకు వెళ్లి సెండాఫ్ ఇస్తుంటారని వివరించారు. అందుకే ఈ రూట్ చాలా ఉపయోగకరంగా ఉంటుందని సీఎం అభిప్రాయపడ్డారు.

మూసీ పరివాహక ప్రాంత అభివృద్ధిపై....

మూసీనది పరీవాహక ప్రాంతాన్ని తొలిదశలో 55 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. రింగ్ రోడ్ టూ రింగ్ రోడ్ మొత్తం ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని సీఎం తెలిపారు. అందువల్ల మూసీ నది పరివాహక ప్రాంతాల్లో ఐకానిక్ డిజైన్లతో అమ్యూజ్ మెంట్ పార్కులు, వాటర్ ఫాల్స్, చిల్డ్రన్ వాటర్ స్పోర్ట్స్, స్ట్రీట్ వెండర్స్, బిజినెస్ ఏరియా, షాపింగ్ మాల్స్ లను అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. చారిత్రాత్మక కట్టడాలయిన చార్మినార్, గోల్కొండ, సెవెన్ టూంబ్స్, తారామతి బారాదరి వంటి వాటిని అనుసంధా నిస్తూ ఒక టూరిజం సర్క్యూట్‌ను రూపొందించాలని సూచించారు. ఈ ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టేందుకు పీపీపీ మోడల్‌లో పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు రాత్రి సమయం ఆహ్లాదకరంగా గడిపేం దుకు వీలుగా సౌకర్యాలు కల్పించాలంటూ అధికారులను ఆదేశించారు. మూసీ నది పరివాహక ప్రాంతంలో చెక్ డ్యాములను నిర్మించి వాటర్ ఫౌంటెన్స్, వాటర్ ఫాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఫైవ్ స్టార్ హొటళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం సహకారమందిస్తుందని అన్నారు.

రాష్ట్రంలో వెల్ స్పాన్ గ్రూప్ పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

అనుసరిస్తున్నదని ఈ సందర్భంగా సీఎం తెలిపారు. పెట్టుబడులు పెట్టే కంపెనీలకు తమ ప్రభుత్వ సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని వెల్లడించారు. గోయెంకా మాట్లాడుతూ తమ కంపెనీ భవిష్యత్తులో చందన్ వ్యాలీ పారిశ్రామిక విభాగంలో రూ.250 కోట్ల పెట్టుబడి పెట్టబోతోందని వివరించారు. టైర్ 2, 3లలోని ఐటీలను అభివృద్ధి చేసి ప్రమోట్ చేసేందుకు, వికారాబాద్, అదిలాబాద్ జిల్లాల్లోని యువతకు ఐటీ ఉద్యోగాలను కల్పించేందుకు తమ కంపెనీ సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

హిందూత్వ శక్తులకు లొంగిపోతున్నదా?

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు భావించాయి. ఈ అధికరణకు అవి వక్రభాష్యం చెప్పాయి. ఈ వాదనను న్యాయస్థానం సమర్థించింది. భారతదేశంలో విలీనమైన తర్వాత జమ్మూకాశ్మీర్‌కు ఎలాంటి సార్వభౌమాధికారం ఉండదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ తన తీర్పులో స్పష్టం చేశారు. అయితే ఈ వివరణ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన మాటలకు విరుద్ధంగా ఉంది. ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించిన తీర్పులో అత్యంత సందేహాస్పదమైనది 370 (3) అర్థాన్ని అశాస్త్రీయంగా చెప్పడం. ఆర్టికల్ రద్దుకు ఆమోదం తెలపాలంటే దానికి ముందుగా కాశ్మీర్ శాసనసభ దానిని విధిగా సిఫార్సు చేయాల్సి ఉంటుంది. అయితే దీనిని న్యాయమూర్తులు ఉద్దేశపూర్వకంగానే విస్మరించారు. 'రాజ్యాంగ సభ' స్థానంలో 'శాసనసభ' అనే పదాన్ని వాడేందుకు వీలుగా ఆర్టికల్ 370 (3)ని సవరించడానికి ఆర్టికల్ 368ని ఉపయోగించుకున్న తీరును జస్టిస్ చంద్రచూడ్ తప్పుపట్టారు. ఈ ప్రక్రియ రాజ్యాంగ విరుద్ధమైనదని పేర్కొంటూ దానిని తోసిపు చ్చారు. అయితే ఈ తప్పుడు రాజ్యాంగ ప్రక్రియ ద్వారానే ఆర్టికల్ 370ని రద్దు చేశారన్న విషయాన్ని ధర్మాసనం పరిగణనలోకి తీసు కోలేదు. ఇది ఆశ్చర్యం కలిగించిందని న్యాయ నిపుణులు తెలిపారు.

న్యాయ కోవిదుల విస్మయం

ఈ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో అనేక లొసుగులు ఉన్నాయని జస్టిస్ (రిటైర్డ్) మదన్ లోకర్, జస్టిస్ (రిటైర్డ్) రోహింటన్, ఫాలీ నారిమన్ వంటి రాజ్యాంగ న్యాయ నిపుణులు అభిప్రాయపడ్డారు. జమ్మూకాశ్మీర్ స్థాయిని తగ్గించడం రాజ్యాంగబద్ధం అవుతుందా కాదా అనే అంశాన్ని పరిశీలించేందుకు ధర్మాసనం విముఖత చూపడంపై వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించే విషయంలో అధికారులు మౌఖికంగా ఇచ్చిన హామీపై సంతృప్తి వ్యక్తం చేయడంలో ధర్మాసనం తొందరపాటు కనబరిచిందని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికలు జరిగే వరకూ రాష్ట్రంలో ఎన్నికలు వాయిదా వేయడానికి న్యాయస్థానం అనుమతించడంపై కూడా వారు అసంతృప్తి వ్యక్తం చేశారు.


ఆధారాలపై విశ్వాసాల విజయం

ఆర్టికల్ 370పై ఇచ్చిన తీర్పుతో పోలిస్తే అయోధ్య వివాదంలో వెలువరించిన తీర్పు పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు. అయోధ్య తీర్పు సందర్భంగా రాజ్యాంగ ధర్మాసనం ఏమని ప్రకటించిందంటే...మసీదు ప్రాంతంలో మందిరం ఉన్నదని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవు. బాబ్రీ మసీదు విధ్వంసం తీవ్రమైన నేరం... అనే వ్యాఖ్యలు చేసినప్పటికీ సుప్రీంకోర్టు చివరికి ఈ వివాదానికి ఏమని ముగింపు పలికింది? తాను చెప్పిన కారణాలకు విరుద్ధంగా తానే తీర్పు ఇచ్చింది. మైనారిటీ వర్గాలు అందించిన వాస్తవాలు, ఆధారాలపై మెజారిటీ వర్గాల విశ్వాసాలు, నమ్మకాలే విజయం సాధించాయి. కోర్టు చేసిన వ్యాఖ్యానాలు ఇలా ఉన్నాయి...'విశ్వాసాలు వ్యక్తిగతమైనవి. అవి ఆత్మిక సాంత్వన కలిగిస్తాయి. నమ్మకం సమర్ధనీయమా అనే విషయం న్యాయ విచారణకు అతీతమైనది. ఇది సాక్షుల వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకునే కేసు కాదు. సాక్షులు తమ నమ్మకాలు, విశ్వాసాల ఆధారంగా సాక్ష్యం చెబితే వాటిలో వాస్తవాలను అనుమానించాల్సిన అవసరం లేదు. విశ్వాసాల ఆధారంగా చెప్పిన విషయాలను కోర్టులు ప్రశ్నించలేవు. రాత ప్రతుల ఆధారంగా ఇచ్చే వివరణలు అనుమానాలకు తావిస్తాయి. న్యాయస్థానాలు వాటి జోలికి వెళ్లకపోవడమే మంచిది'.

పరస్పర విరుద్ధ తీర్పులు

దీనిని బట్టి మనకు ఏమర్థమవుతుంది? ముస్లిం పిటిషనర్లు పుంఖానుపుంఖాలుగా సమర్పించిన రుజువులు, ఆధారాల కంటే హిందువుల విశ్వాసాల ఆధారంగానే తీర్పు ఇచ్చినట్లు స్పష్టమవుతోంది కదా!. అయితే ఇక్కడ ఓ విషయాన్ని గమనించాలి. అయోధ్య కేసులో హిందువుల విశ్వాసాలను న్యాయస్థానం గౌరవించింది. మరి అదే హిజాబ్ కేసులో ముస్లింల నమ్మకాలను తోసిపుచ్చింది.

అయోధ్య తీర్పు సందర్భంగా 1991వ సంవత్సరం నాటి ప్రార్థనా స్థలాల చట్టాన్ని సుప్రీంకోర్టు ప్రశంసించింది. ఈ చట్టం భారత లౌకిక నిర్మాణాన్ని పరిరక్షిస్తుందని, చారిత్రక ప్రార్థనా స్థలాల మత స్వభావాన్ని మార్చడాన్ని నిషేధిస్తోందని కొనియాడింది. అయితే జస్టిస్ చంద్రచూడ్ ప్రధాన న్యాయమూర్తి అయిన తర్వాత అదే చట్టాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను అనుమతించారు. జ్ఞానవాపి, మధుర మసీదు కేసుల విషయంలో ఆయన నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం ఆ చట్టం స్ఫూర్తిని నీరుకార్చింది. ఈ విషయాల్నింటినీ పరిశీలిస్తే హిందూత్వ అజెండాతో ఏకీభవిస్తున్న సుప్రీంకోర్టు తీర్పులు సారూప్యతల దృష్ట్యా అనుకోకుండా ఇచ్చినవో లేక యాదృచ్ఛికంగా ఇచ్చినవో కావని బెంగళూరుకు చెందిన ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ శివసుందర్ అభిప్రాయపడ్డారు.



15లోగా సూచనలు చేయండి

- ఆ తర్వాతవాటిని పరిగణనలోకి తీసుకోం
- జమిలి ఎన్నికలపై ప్రజలకు రామ్ నాథ్ కోవింద్ కమిటీ ఆహ్వానం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

జమిలి ఎన్నికలపై ఈ నెల 15 లోగా ఏమైనా సూచనలు ఉంటే చేయాలనీ 'ఒకే దేశం, ఒకే ఎన్నిక'పై మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ ప్రజలను కోరింది. ఏకకాల ఎన్నికలను ప్రారంభించడానికి ప్రస్తుత చట్టపరమైన పరిపాలనా ఫ్రేమ్‌వర్క్‌లో తగిన మార్పులు చేయడం కోసం ప్రజల నుంచి సూచనలను ఆహ్వానించింది. ఈ నెల 15 తర్వాత వచ్చే వాటిని పరిగణనలోకి తీసుకోబోమని తెలిపింది. ఈ మేరకు కమిటీ శనివారం ప్రకటన విడుదల చేసింది. సూచనలను కమిటీ వెబ్‌సైట్ శీఅశీవ.స్త్రశీజ.ఱఅలో పోస్ట్ చేయవచ్చని, లేదా ంఎ-ప్త్రశీఎఎస్త్రశీజ.ఱఅకు ఈ-మెయిల్ ద్వారా పంపవచ్చని ప్రకటనలో పేర్కొంది. గతేడాది సెప్టెంబరులో ఏర్పాటైన ఈ కమిటీ రెండుసార్లు సమావేశమైంది. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనపై రాజకీయ పార్టీల అభిప్రాయాలను, పరస్పర అంగీకారంపై చర్చను కోరుతూ ఇటీవల రాజకీయ పార్టీలకు లేఖ రాసింది. ఆ తరువాత పార్టీలకు మరో గుర్తు చేసింది. ఆరు జాతీయ పార్టీలు, 33 రాష్ట్ర పార్టీలు, ఏడు నమోదైన గుర్తింపు లేని పార్టీలకు లేఖలు పంపారు. ఏకకాల ఎన్నికలపై లా కమిషన్ అభిప్రాయాలను కూడా కమిటీ తీసుకుంది. ఈ సమస్యపై లా కమిషన్‌తో మళ్లీ చర్చించే అవకాశం ఉంది.

ఇజ్రాయిల్‌కు భారత నిర్మాణ కార్మికులు

- నియామకాలు చేపట్టిన బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాలు
- తీవ్రంగా ఖండిస్తున్న కార్మిక సంఘాలు

న్యూఢిల్లీ : నిర్మాణ కార్మికులను ఎంపిక చేసి, వారిని యుద్ధంతో అతలాకుతలమవుతున్న ఇజ్రాయిల్‌కు పంపాలంటూ బీజేపీ పాలనలోని రెండు రాష్ట్రాలు ఇటీవల నోటీసులు జారీ చేశాయి. అదే బాటలో పయనించేందుకు మరో బీజేపీ పాలిత రాష్ట్రం సిద్ధమవుతోంది. నిర్మాణ రంగంలో పని చేసేందుకు పాలస్తీనా కార్మికుల స్థానంలో లక్ష మంది భారతీయులను తీసుకోవాలని ఇజ్రాయిల్ భావిస్తోందని వార్తలు వచ్చాయి. గత అక్టోబర్ 7వ తేదీన హమాస్‌పై యుద్ధం ప్రారంభించిన తర్వాత గాజాకు చెందిన పాలస్తీనా కార్మికుల వర్క్ పర్మిట్లను ఇజ్రాయిల్ రద్దు చేసింది. గడచిన పదిహేడు సంవత్సరాల నుండీ ఇజ్రాయిల్ సాగించిన ముట్టడి కారణంగా గాజాలో నిరుద్యోగం, పేదరికం పెరిగిపోయాయి.

ఇజ్రాయిల్ దాష్టీకాల నడుమ పాలస్తీనా కార్మికులను వారాల తరబడి అక్రమంగా నిర్బంధించడం, వేధింపులకు గురిచేయడం పరిపాటిగా మారింది. ఇజ్రాయిల్ నియంత్రణలోని వెస్ట్‌బ్యాంక్‌లో కూడా అనేకమంది పాలస్తీనా కార్మికుల వర్క్ పర్మిట్లు రద్దయ్యాయి. బ్యాంక్ ఆఫ్ ఇజ్రాయిల్ అందించిన వివరాల ప్రకారం గత సంవత్సరం రెండో త్రైమాసిక కాలంలో ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ నుండి 75 వేలు, గాజా నుండి 12 వేల మంది కార్మికులు ఇజ్రాయిల్‌లోని నిర్మాణ రంగంలో పనిచేశారు. వీరితో పాటు వెస్ట్‌బ్యాంక్ నుండి మరో పదిహేను వేల మంది కార్మికులు అనధికారికంగా ఇజ్రాయిల్ నిర్మాణ రంగంలో పనిచేశారు. 23 వేల మంది వలస కార్మికులు కూడా నిర్మాణ పనులలో భాగస్వాములయ్యారు.

ఇజ్రాయిల్ నిర్మాణ రంగంలో పాలస్తీనియన్లు, వలస కార్మికులు వెట్టి చాకిరీ చేసే వారు. ఇజ్రాయిల్‌కు చెందిన అక్రమ వలసవాదుల సెటిల్మెంట్లలో కూడా వీరు పనిచేశారు. పాలస్తీనా కార్మికుల వర్క్ పర్మిట్లను రద్దు చేయడంతో ప్రతి నెలా దేశ ఆర్థిక వ్యవస్థకు 830 బిలియన్ డాలర్ల మేర నష్టం వాటిల్లిందని ఇజ్రాయిల్ ఆర్థిక మంత్రిత్వ శాఖ అంచనా వేసింది.



ఇజ్రాయిల్ నిర్మాణ రంగం అత్యంత ప్రమాదకరమైనది. ఈ రంగంలో పనిచేస్తూ మృత్యువాత పడిన లేదా హతులైన వారిలో అత్యధికులు పాలస్తీనియన్లే. వీరిలో ఇజ్రాయిల్ పౌరసత్వం కలిగిన వారు కూడా ఉన్నారు. పాలస్తీనా కార్మికులకు వర్క్ పర్మిట్లు రద్దు కావడంతో ఇప్పుడు ఇజ్రాయిల్ దృష్టి మన దేశంపై పడింది. అయితే ఇజ్రాయిల్‌కు మన భవన నిర్మాణ కార్మికులను పంపడాన్ని దేశంలోని పది ప్రధాన కార్మిక సంఘాలు రెండు నెలల క్రితమే తీవ్రంగా తప్పుపట్టాయి. ఇది అనైతికమని, వినాశనకరమని మండిపడ్డాయి. ఈ చర్య ద్వారా పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ సాగిస్తున్న నరమేధంలో భారత్ భాగస్వామి అవుతోందని ఆరోపించాయి. కార్మిక సంఘాల అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ హర్యానాలోని బీజేపీ ప్రభుత్వం డిసెంబరులో కార్మికుల నియామక ప్రక్రియను చేపట్టింది. ఇజ్రాయిల్‌లో నిర్మాణ పనులు సహా వివిధ పనులు నిర్వహించేందుకు రాష్ట్రం నుండి పది వేల మందిని పంపాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇజ్రాయిల్ నుండి వచ్చిన 'సెలక్టర్లు' ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. వీరిలో ఇజ్రాయిల్ బిల్డర్ల సంఘం (ఐబీఏ) సభ్యులు కూడా ఉన్నారు. హర్యానా నుండి తరలించే కార్మికుల సంఖ్యను 30 వేలకు పెంచాలని వారు యోచిస్తున్నారు.

హర్యానా మాదిరిగానే బీజేపీ పాలిత ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు కూడా ఇజ్రాయిల్‌కు కార్మికులను పంపే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఉత్తరప్రదేశ్ ఓ అడుగు ముందుకు వేసి ఇజ్రాయిల్ ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకునేందుకు తహతహలాడుతోంది. యూపీ నుండి ఇజ్రాయిల్ వెళ్లేందుకు ఇష్టపడే నిర్మాణ కార్మికులకు 1,609 డాలర్ల వేతనాన్ని ఆశ చూపారు. భారత ప్రభుత్వం నిర్దేశించిన కనీస వేతనం కంటే ఇది చాలా ఎక్కువ. అయినప్పటికీ ఇజ్రాయిల్ వెళ్లేందుకు యూపీ కార్మికులు నిరాకరిస్తున్నారు.

కార్మికులను ఇజ్రాయిల్‌కు పంపడాన్ని భారత భవన నిర్మాణ కార్మికుల సమాఖ్య (సీడబ్ల్యూఎఫ్ఐ) తీవ్రంగా వ్యతిరేకిస్తూ నిరసనలకు పిలుపునిచ్చింది. నిర్మాణ కార్మికులను ఇజ్రాయిల్‌కు పంపేందుకు కుట్ర జరుగుతోందని హర్యానా కుశాల్ రోజ్‌గార్ నిగమ్ ఆరోపించింది. దేశంలోని నిర్మాణ కార్మికులందరూ ఐక్యంగా ఉన్నారని, పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతున్నారని ఆ సంఘం పేర్కొంది.

ఆ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునివ్వండి

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంకు జాక్టో వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో జాక్టో చైర్మెన్ జి సదానందంగౌడ్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు కోర్టు కేసుల కారణంగా జాప్యం జరుగుతున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో కోర్టు వివాదాలను పరిష్కరించి వెంటనే షెడ్యూల్‌ను విడుదల చేయాలని కోరారు. ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమాల పేరుతో ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేసే కార్యక్రమాలను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని సూచించారు. ఎస్‌సీఈఆర్టీలో డిప్యూటేషన్ ఆన్‌డ్యూటీ పేరుతో ఏండ్ల తరబడి పనిచేస్తున్న వారిని వెంటనే విడుదల చేసి ఉపాధ్యాయుల కొరతను తగ్గించి విద్యార్థులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఎస్‌సీఈఆర్టీ నిబంధనల మేరకు 2010కి ముందు ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలని కోరారు. పాఠశాల గ్రాంట్లను వెంటనే విడుదల చేయాలని తెలిపారు. 317 జీవో ద్వారా నష్టపోయిన స్పౌజ్, వితంతువులు వేర్వేరు కారణాల పేరుతో ఆగిపోయిన బదిలీలన్నింటినీ పరిష్కరించాలనీ, స్థానికత ఆధారంగా సొంత జిల్లాలకు పంపించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలని పేర్కొన్నారు. 10,479 పోస్టులను అప్‌గ్రేడ్ చేసిన భాషా పండితులు, పీఈటీల ఉన్నతీకరణను పూర్తి చేయాలని తెలిపారు. పాఠశాలల్లో ఉచితంగా విద్యుత్, ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. మల్టీజోన్-1, మల్టీజోన్-2 పరిధిలో బదిలీ అయి రిలీవ్ కాని ఉపాధ్యాయులను వెంటనే పంపించాలని ప్రభుత్వాన్ని వారు విజ్ఞప్తి చేశారు. ఈ ఆ కార్యక్రమంలో జాక్టో నాయకులు ఎం పర్వత్‌రెడ్డి, హేమచంద్రుడు, గుండం మోహన్‌రెడ్డి, కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.



విద్యారంగాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం
- పీఆర్టీయూఎస్ డైరీ ఆవిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని దేశానికే ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో తగిన మౌలిక సౌకర్యాలను కల్పిస్తామనీ, ఉపాధ్యాయుల కొరత లేకుండా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. పీఆర్టీయూటీఎస్ నూతన సంవత్సరం డైరీని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి ఆయన శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆవిష్కరించారు. ఇచ్చిన మాట ప్రకారం డిసెంబర్ వేతనాలను ఈనెల ఐదో తేదీలోగా చెల్లించినందుకు ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ఉపాధ్యాయులకు పదోన్నతులతోపాటు అన్ని సమస్యలనూ పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, పంచాయతీరాజ్ ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





సెల్ఫీ

నిరుద్యోగ భారతం పెరుగుతోంది. దారిద్ర్యం పైపైకి పోతోంది. ప్రజాస్వామ్యం అడుక్కి పోయి నియంతృత్వం పెరిగి పోగోంద. తిండికి విలవిల్లాడుతున్న జనం ఒక వైపు ఆదాయాలు రెట్టింపవుతున్న ఆదానీలు మరో వైపు వీటన్నిటినీ తిలకిస్తూ మన నాయకుడు మాత్రం సెల్ఫీల చుట్టూ పరిభ్రమణం సాగిస్తున్నాడు. రేపటి అధికారపు కలకు వ్యూహం రచిస్తున్నాడు.

నేడు యువత నోళ్లలో నానుతున్న పదం సెల్ఫీ. ఎక్కడ పదిమంది కలిసినా, స్నేహితులు తారసపడినా, ప్రదేశాల పర్యటనకు వెళ్లినా, ప్రముఖులను కలిసినా చేతిలో సెల్ కెమెరాతో వాళ్లకు వాళ్లే తీసుకునే ఫోటో పేరే సెల్ఫీ. ఈ సెల్ఫీ పిచ్చి చాలా మంది యువతలో పెరిగి, అదో వ్యసనంగా కూడా మారి పోయింది. జలపాతాల్లో, జూపార్కుల్లో, కొండలపై, ఆగాధాల్లో, వంతెనలపై నిలబడి సెల్ఫీ తీసుకుంటూ ప్రమాదాల పాలయి జీవితాలను కోల్పోయిన వాళ్లూ వున్నారు. ఏదో స్నేహితులు కలవక కలిసి నపుడు, సంతోషాల సందర్భంలో తప్పేమీ లేదు. కానీ ప్రమాదపు స్థలాల్లో సాహస ఫోటోలు ప్రాణాలకే ముప్పు తెస్తాయి. ఈ పరిణామం ఒకటయితే, రెండోది. ఈ సెల్ఫీ మోజును, అలవాటును ఉపయోగించుకుని ప్రచారం పొందేందుకు అధినాయకులువెంపర్లాడటం ప్రహసనంగా మారింది.

ఆ మధ్య బేటీ పడావ్, బేటీ బచావ్ నినాద ప్రచారంలో భాగంగా ఆడబిడ్డలతో సెల్ఫీ దిగి సోషల్ మీడియాలో పోస్టు చేయాలని కోరారు. ఆడపిల్లలను కాపాడటానికి, చదివించుకోవటానికి కావలసింది నిధుల కేటాయింపు, అవసరమైన ప్రణాళికలు, ఆచరణాత్మక కృషి తప్ప సెల్ఫీ ప్రచారాలతో అవి సాధ్యం కాదనేది నాయక మన్యులకు తెలియని విషయం కాదు. అయినా ఏమీ చేయలేమని తెలిసాక వాళ్లు చేసేది ప్రచారమే మరి! ఆ ప్రచార సంవత్సరాలలోనే ఆడపిల్లపై లైంగికదాడులు, హత్యలు పెరిగాయి. అణచివేతా పెరిగింది. నినాదం మాత్రం తంతుగానే మిగిలింది. అందులో భాగంగానే కొన్ని నెలల క్రితం (యు.జి.సి) యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ కళాశాలలకు ఒక సర్క్యులర్ జారీ చేసింది. అదేమంటే భారతదేశం పలు రంగాల్లో సాధించిన విజయాలపై యువతలో అవగాహన కలిగించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ 3డీ ఫోటో తో కూడిన సెల్ఫీ పాయింట్ ను ఏర్పాటు చేయాలని కోరింది. ఈ సెల్ఫీ పాయింట్ల వద్ద ఫోటోలు తీసుకుని ప్రత్యేక లక్షణాలను సామాజిక మాధ్యమాలలో షేర్ చేసేలా విద్యార్థులను ప్రోత్సహించాలనీ కోరింది. దీనిపై పెద్ద యెత్తున విమర్శల దుమారం చెలరేగింది. యూనివర్సిటీ విద్యను ప్రయివేటు పరం చేస్తు. పరిశోధన రంగానికి కోతలు పెడుతూ, సరైన వసతులు లేని స్థితిలో ఈ ప్రచార ఆర్భాటాలు ఏ వెలుగులకని విద్యార్థులు, మేధావులు ప్రశ్నలు ఎక్కుపెట్టారు. రాజకీయ ప్రచారానికి యూనివర్సిటీలను వేదిక చేయరాదని విద్యావేత్తలు విమర్శ చేశారు. యు.జి.సి, ఆ డిజైన్డ్ పాయింట్స్‌ను వెనక్కు తీసుకుంది. ఇక ఇప్పుడు సెంట్రల్ రైల్వేశాఖ తమ 19 జోన్‌లలో వున్న స్టేషన్లలో 3డి మోడీ సెల్ఫీ బూత్ లను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఏర్పాటూ మొదలయింది. అమరావతి కేంద్రంగా పని చేస్తున్న సామాజిక కార్యకర్త సమాచార హక్కు చట్టం క్రింద సెల్ఫీ పాయింట్లకు ఎంత ఖర్చు అవుతున్నదో తెలపాలని కోరారు. సదరు రైల్వే పి.ఆర్.ఓ. ఒక్కో సెల్ఫీ పాయింట్‌కు ఆరు లక్షలు ఖర్చయ్యాయని తెలిపారు. అంతే! ఆ పి.ఆర్.వో.పై బదిలీ వేటు పడింది. కారణం ఖర్చు వివరాలు చెప్పటమే.

సాధారణ ప్రజలు ప్రయాణించేందుకు రైళ్ళను పెంచక పోగా అనేక రైళ్లను రద్దు చేశారు. కిక్కిరిసిన ప్రయాణాలతో జనం ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వీరికి సదుపాయాలు పెంచటంలేదు. కానీ కోట్ల రూపాయలతో సెల్ఫీ ప్రచారానికి పూనుకోవటం, రాబోయే ఎన్నికలకు రాజకీయ ప్రమోజనాలకు వినియోగించటంపై ప్రతిపక్ష నాయకులు మండిపడుతున్నారు. అంతే కదా! ఇక రక్షణ శాఖ కూడా తమ విభాగాలకు సెల్ఫీ పాయింట్లు పెట్టాలని సూచనలు జారీ చేసింది. ఎయిర్ పోర్టులు, మ్యూజియమ్‌లు, మార్కెట్లు, స్కూల్స్, పర్యాటక కేంద్రాలలో మోడీ బొమ్మతో 3డి ఎఫెక్ట్ తో ఈ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఫోటోషూట్ పిచ్చి ఈ రకంగా పరిణమించింది. ఈ మధ్య లక్షద్వీప్ తీర ప్రాంతంలో నీటిలో విన్యాసాల వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ అవుతున్నాయి. ఒక వైపు మణిపూర్ మండుతునే వుంది. సామాన్యుల బాధలు పెరుగుతూనే ఉన్నాయి. నిరుద్యోగ భారతం పెరుగుతోంది. దారిద్ర్యం పైపైకి పోతోంది. ప్రజాస్వామ్యం అడుక్కి పోయి నియంతృత్వం పెరిగి పోగోంద. తిండికి విలవిల్లాడుతున్న జనం ఒక వైపు ఆదాయాలు రెట్టింపవుతున్న ఆదానీలు మరో వైపు వీటన్నిటినీ తిలకిస్తూ మన నాయకుడు మాత్రం సెల్ఫీల చుట్టూ పరిభ్రమణం సాగిస్తున్నాడు. రేపటి అధికారపు కలకు వ్యూహం రచిస్తున్నాడు.

సంపాదకీయం

అన్ని వ్యవస్థలు అదానీ వైపే!



తెలకపల్లి రవి

సుప్రీం కోర్టు తీర్పు కారణంగా అయోధ్యలో కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంలా రామమందిర ప్రాణ ప్రతిష్ట 22న జరగబోతున్నది.మధుర, కాశీ మందిరాల వివాదాలను కూడా తిరగదోడే న్యాయప్రక్రియ పూర్తయిపోయింది. క్రోనీ కార్పొరేట్ సామ్రాజ్యాధినేత గౌతమ్ అదానీ గ్రూపు అక్రమాలపై అంతర్జాతీయ స్థాయిలో వచ్చిన ఫిర్యాదుల కేసును సుప్రీం కోర్టు తోసిపుచ్చింది.ఆ తీర్పు వచ్చిన మరుసటి రోజునే మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సెబీ(సెక్యూటిరీస్ అండ్ ఎక్స్‌చేంజెస్ రెగ్యులేటరీ బోర్డ్) నిబంధనలు మార్చింది.పైకి విడివిడిగా కనిపించే ఈ పరిణామ క్రమం వెనక వున్న వ్యవస్థాగతమైన లింకేమిటో తెలియాలంటే న్యాయం అన్నదాని గురించి కారల్ మార్క్స్ ప్రసిద్ధ వాక్యాలు గుర్తు చేసుకోవలసి వుంటుంది. 'చట్టం వ్యవస్థపై ఆధారపడి వుంటుంది గానీ వ్యవస్థ చట్టంపై ఆధారపడి వుండదు.' 'మత రాజ్య వ్యవస్థలో దైవదూషణ అన్నిటికంటే పెద్ద నేరంగా వుంటుంది.రాచరికంలో రాజద్రోహానికి అత్యధిక శిక్ష. వర్గ సమాజంలో ప్రైవేటు ఆస్తికి భంగం కలిగించే చర్య అనుమతించబడదు.'45 ఏళ్ల కిందట ఆంధ్రాయూనివర్సిటీ ప్రసంగంలో ఈ వాక్యాలు ఉటంకించిన సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ చిన్నపరెడ్డి దాన్ని వివరించడానికి మూడు ఉదాహరణలివి. విచిత్రంగా ఇప్పుడు భారత దేశంలో ఈ మూడు లక్షణాలు కలిసి కనిపిస్తున్నాయి.గుళ్లూ గోపురాల వివాదాలు, రాజద్రోహ కేసులు,బడా ఆశ్రిత పెట్టుబడిదారులను కాపాడే మార్కెట్ శాసనాలు ఏకకాలంలో అమలవుతున్నాయి.

అదానీ అనుబంధం, హిండెన్ బర్గ్ పరిశోధన

నరేంద్ర మోడీ అధికారం చేపట్టిన నాటినుంచి కేంద్రం వత్తాసుతోనే దేశ విదేశాల్లో అదానీ గ్రూపు చెలరేగిపోవడం అందరికీ తెలిసిన విషయమే. ప్రభుత్వ సంస్థల ఆస్తులు కాంట్రాక్టులు దానికే వెళ్లేలా చేయడంలో బిజెపి ప్రభుత్వ పాత్ర చాలా సార్లు వెల్లడైంది.అస్ట్రేలియా శ్రీలంక వంటి దేశాల్లోనూ అదానీ గ్రూపు తరపున మోడీ సిఫార్సులు

> **మోడీ రాజ్యంలో సమస్త వ్యవస్థలూ శక్తులూ కూడా అదానీని కాపాడ్డానికే అంకితమైన తీరు ఇదిన్యూస్‌క్లిక్ పై కేంద్రం దాడికి కారణం నివెల్లీరాయ్ సింఘం ద్వారా దానికి మూడు కోట్ల రూపాయాలు అందాయనే ఆరోపణ. వాస్తవానికి అవి చట్టబద్దంగా జరిగిన లావాదేవీలు. కానీ దాన్ని పెద్ద వ్యవహారంగా చేసి ప్రబీర్ పురకాయస్థ తదితరులనునెలల తరబడి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. ఇప్పటికీ వేధిస్తూనే వున్నారు.**

చేసినట్టు ఆ దేశాల నేతలే వెల్లడించారు. ఎపిలో గంగవరం కృష్ణపట్నం వంటిరేవులతో సహా,భోగాపురం ఎయిర్‌పోర్ట్ సహా అనేక ఆస్తులు టెంటర్లు వారికే దక్కాయి. మరోవైపున స్టాక్ మార్కెట్‌లో అదానీ గ్రూపు షేర్ల రేట్లు విపరీతంగా పెరిగిపోతూ వచ్చాయి. అతి పెద్ద కార్పొరేట్‌గా అంబానీల స్థానంలో అదానీ అవతరిస్తున్నట్టు కనిపించింది. అటు అదానీ ఇటు అంబానీ మధ్యలో ప్రధాని అనేది నానుడిగా మారింది. అంబానీలు అన్ని ప్రభుత్వాల్లోనూచక్రం తిప్పినా మోడీ హయాంలో ఆయన ఇప్పుడైన కుబేరుడుగా అదానీకి తిరుగులేకుండా పోయిందని పారిశ్రామిక వర్గాలు భావించాయి. ఇలాటి తరుణంలో 2023 జనవరి 24న హిండెన్ బర్గ్ రిసెర్చి గ్రూపు అదానీ వ్యవహారాలపై ఒక సంచలన పరిశోధనా నివేదిక ప్రకటించింది.ఈ గ్రూపు షేర్లు ఇంతగా విజృంభిచడంవెనక అనైతిక ఆర్థిక పద్ధతులున్నాయనీ వెల్లడించింది. అదానీ గ్రూపు బినామీల ద్వారా తన షేర్లను అరువు తీసుకొని మార్కెట్ రేటుకు అమ్ముతూ మళ్లీ తక్కువ రేటుకు కొంటూ, కృత్రిమంగా గిరాకీ పెంచినట్టు వెల్లడించింది.స్టాక్ మార్కెట్ భాషలో దీన్నే షార్ట్ సెల్లింగ్ అంటారు.అంటే ఒక సంస్థ మార్కెట్‌లో తన షేర్లను తనే తీసుకుని భారీగా అమ్మడం, తర్వాత చౌకగాకొనడం,రేటు పెరిగాక విడుదల చేయడం.ఇదే ఒక అభ్యంతరకర మార్గమైతే ఆ సంస్థకు సంబంధించిన బినామీలు లేదా భాగస్వాముల ద్వారానే భారీగా కొనుగోళ్లు అమ్మకాలు చేయించి జోరుగా పెరిగిపోతున్న భ్రమ కలిగించడం. ఇదంతా ఎందుకంటే సాధారణ మదుపరులు



ఎగబడిపోయి షేర్లు కొనుగోలు చేయడానికి. మార్కెట్ విలువు బాగా పెంచి చూపించి రుణాలు, అడ్వాన్సులు పుట్టించుకోవడానికి,అన్నిటినీ మించి ప్రత్యర్థులను దెబ్బతీయడానికి,ఈ క్రమంలో వీటినే ఆధారంగా చూపి ప్రభుత్వ బ్యాంకులు ఆర్థిక సంస్థలనుంచి ఉదారంగా అప్పులు, భాగస్వామ్యాలు పొందడానికీ ఇవి ఉపయోగపడతాయి. అదానీ విషయంలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాతో సహా అనేక సంస్థలు విస్తారంగా సహకరించాయి. ఇదే గాక షేర్ల కొనుగోలులోనూ అవీ పాలుపంచుకున్నాయి.ఈ క్రమంలో విపరీతంగా వందల కోట్లు చేతులు మారి మనీ లాండరింగ్ కార్యకలాపాలు సాగాయి. దీనిపై రెండేళ్ల పరిశోధన జరిపి ఇందుకు సంబంధించిన అనేక వాస్తవాలు వివరాలు హిండెన్ బర్గ్ బయిటపెట్టింది. ఆ సమయంలో అదానీ గ్రూపు పెరుగుదల 817 శాతంగా వుండింది. ఆస్తుల విలువ 17,80,000 కోట్లు. ప్రధాని మోడీకి అత్యంత సన్నిహితుడైన అదానీ వ్యవహారాలపై వెంటనే దర్యాప్తు జరపాలనీ, అన్ని నిజాలు బయిటపెట్టాలనీ ప్రతిపక్షాలు ఆందోళన చేశాయి.

సుప్రీం కోర్టులో జరిగిందేమిటి?

అదానీపై తీవ్రమైన ఈ ఆరోపణలను విచారించడం కోసం ఒక కమిటీని నియమించాలంటూ ఫిబ్రవరిలో సుప్రీం కోర్టులో పిల్ దాఖలైంది.కోర్టులోనూ పార్లమెంటులోనూ పోరాటం జరుగుతున్నా కేంద్రం కనీసంగా స్పందించలేదు. అదానీ గ్రూపు తనను తాను సమర్థించుకుంటూ ఎదురుదాడిచేసింది.అంతేగాక దూసుకుపోతున్న భార తీయ కంపెనీని దెబ్బతీయడం కోసం దేశ వ్యతిరేక శక్తులు కుట్రలు పన్నుతున్నాయని బిజెపి నేతలు కొత్తపల్లవి అందుకున్నారు. ఎట్టకేలకుమూడు మాసాల తర్వాత మార్చి2న సుప్రీం కోర్టు దీనిపై విచారణ జరిపి రెండు మాసాలలోగా నివేదిక నివ్వాలని సెబీని ఆదేశించింది. స్టాక్ మార్కెట్‌లావాదేవీలలోనూ డబ్బు మార్పిడిలోనూ అక్రమాలు నిగ్గు తేల్చాలన్నది.మరోవైపున కోర్టు తరపునకూడా ఒక త్రిసభ్య కమిటీని నియమించింది. మాజీ సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే అధ్యక్షతన ఈకమిటీ నివేదిక మే19న అందజేసింది. అక్రమాలకు పాల్పడినట్టు ఆధారాలు దొరకలేదని సమర్థించింది. దీనిపై సెబీ వ్యవహరించిన తీరులోనూ ఉల్లంఘనలు లేవంటూనే పూర్తి వివరాలు రాబట్టడంలో అది విఫలమైనట్టు పేర్కొంది. ఏవో పరిశోధనా సంస్థలు అనేక ఆరోపణలు తీసుకొచ్చినా వాటి మూలాలలోకి వెళ్లడంలో సెబి కృతకృత్యంకాలేకపోయింది. అదానీ గ్రూపు షేర్ల విపరీత పెరుగుదలకారణాలు, పెట్టుబడి పెట్టిన కంపెనీలతో వారి బాంధవ్యం వంటి అంశాలను కూడా నిగ్గుతేల్చలేదని విమర్శించింది. సెబీ నిబంధనల మార్పువల్ల పారదర్శకత లేకుండాపోయిందనీ, లోపాయి కారీ పెట్టుబడులు సమకూర్చేవారి వివరాలు దాచిపెట్టబడ్డాయనీ కూడా ఈ కమిటీ చెప్పింది.నిజానికి 2014లోనే డిఆర్ఐ(డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్) దృష్టికి ఈ ఆరోపణలు వచ్చాయనేది ఇక్కడ గమనించాలి.వీటిపై విచారణ జరుగుతున్నట్టు 2020లో21లో పార్లమెంటుకు కేంద్రం సమాధానమిచ్చింది. తీరా చూస్తే ఆ దర్యాప్తు లోపభూయిష్టంగా వున్నట్టు సుప్రీం నియమించిన కమిటీనే ఇక్కడ చెప్పడం గమనించదగింది. ఈలోగా తాజా ఆదేశాల ప్రకారం రెండు మాసాల్లో నివేదిక నివ్వాల్సిన సెబీ ఆగష్టు వరకూ పొడగింపు పొందింది.ఇలా మొత్తం ప్రహసనంగా మారిపోగా రాజకీయంగా దానిపై ఎంత కల్లోలం రేగుతున్నా అదానీ మాత్రం యథాతథంగా కార్యకలాపాలు సాగిస్తూ పోయారు.నవంబరునాటికి వాదనలు వినడం పూర్తి కాగా తీర్పు రిజర్వు చేసిన చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ ధర్మాసనం జనవరి3న ప్రకటించిన తీర్పు దేశానికి దిగ్భ్రాంతి కలిగించింది.

అయితే ఒకె.. అంతా రైటే..

సెబీ విచారణలో ఎలాటి పొరబాటు లేదని సుప్రీం కోర్టు కితాబు నిచ్చింది.అది విఫలమైంది గనక సిబిఐకి దర్యాప్తు అప్పగించాలనే అభ్యర్థనను తోసిపుచ్చుతూ అది అరుదైన సందర్భాల్లో మాత్రమే సాధ్యమని చెప్పడం మరింత విపరీతమైన అంశం. దీనికి సిజెఐ అనేక వాదనలు తెచ్చారు గాని ఎన్ని రాజకీయ వ్యాజ్యాలలో సిబిఐని ఎన్ఐఎను తీసుకొచ్చారో దేశమంతటికీ తెలుసు. నిజానికి సుప్రీం కోర్టు సమయంలో పెద్దభాగం దానికే సరిపోతున్నది. కంపెనీల షార్ట్ సెల్లింగ్‌పై సెబి నిబంధనలను తాము నియంత్రించలేమని కూడా చేతులెత్తేసింది.చాలాకాలంగా ఈ విషయంలో పాటిస్తున్న నియంత్రణను కొంతకాలం కిందట మార్చినట్టు వాదించిన సెబీ సమర్థనను ఈ విధంగా సుప్రీం తీర్పు కూడా ఆమోదించింది.

> **అదానీ వ్యవహారాలను గతంలో ఎన్నడూ తానుదర్యాప్తు చేసిందేలేదని సెబీ తన వాంగ్మూలంలో చెప్పడం ఇక్కడ అతి పెద్ద పిల్లిమొగ్గ.మరోపక్క షార్ట్ సెల్లింగ్‌ను స్టాక్ మార్కెట్ లావాదేవీలను నియంత్రణ చేయడం కోసం తాము భవిష్యత్తులో చర్య తీసుకుంటామని కేంద్రం తరపున సోలిసిటర్ జనరల్ ఇచ్చిన హామీని ఒకే చేసింది**

అదానీ గ్రూపుపై విస్తారమైన పరిశోధనల సమాచారం నివేదికలు అందుబాటులో వున్నా సెబీ వాటిని ఉపయోగించుకోలేకపోయిందని తాను నియమించిన కమిటీయే చెప్పినా ధర్మాసనం పట్టించుకోలేదు, పైగా వీరంతా చట్టబద్ధమైన సెబీ నియంత్రణ సంస్థగా విచారిస్తుంట థర్డ్‌పార్టీ(బయిటివారనీ)ఎందుకని ప్రశ్నించింది. పత్రికల్లో మీడియాలో వచ్చిన నివేదికలను కథనాలను పరిగణనలోకి తీసుకోనవసరం లేదని ఎదురువాదించింది.ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్‌పేపర్స్(ఒసిసిఆర్‌పి) విడుదల చేసిన నివేదికను పిల్‌లో ప్రస్తావించడాన్ని తోసిపుచ్చింది. ఇది సహజన్యాయ సూత్రాలకే విరుద్ధమని చెప్పనక్కర్లేదు. సెబీ అనుసరించిన పద్ధతులు సూత్రాలు సరైనవా కావా అని చెప్పడం తన పరిధిలో వుండదని కూడా వ్యాఖ్యానించింది. అదానీ వ్యవహారాలను గతంలో ఎన్నడూ తానుదర్యాప్తు చేసిందేలేదని సెబీ తన వాంగ్మూలంలో చెప్పడం ఇక్కడ అతి పెద్ద పిల్లిమొగ్గ.మరోపక్క షార్ట్ సెల్లింగ్‌ను స్టాక్ మార్కెట్ లావాదేవీలను నియంత్రణ చేయడం కోసం తాము భవిష్యత్తులో చర్య తీసుకుంటామని కేంద్రం తరపున సోలిసిటర్ జనరల్ ఇచ్చిన హామీని ఒకే చేసింది.

న్యూస్‌క్లిక్ కేసులో ఏమైంది?

తీర్పు రాగానే సత్యం గెలిచిందని అదానీ గొప్పగా స్వాగతించారు. ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించాయి.పరస్పర విరుద్ధాంశాలను ఎత్తిచూపుతూ కాంగ్రెస్ ప్రతినిధి జైరాం రమేష్ ఒక సమగ్ర ప్రకటన చేశారు. ఈ తీర్పు చాలా నిరుత్సాహ కరమని సిపిఎం పేర్కొంది.ప్రభుత్వం అన్నిటినీ కప్పిపుచ్చడానికి సుప్రీం తీర్పు లైసెన్సుగా మారిందని కూడా సిపిఎం విమర్శించింది.తమాషా ఏమంటే వివరాలు తప్పక వెల్లడించాలని తీర్పు వచ్చిన రెండు రోజుల్లోనే షార్ట్ సెల్లింగ నిబంధనలు సెబీ సవరించింది! అదానీని కాపాడే ప్రక్రియ అయిపోగానే వాటి అవసరం తీరిపోయిందన్నమాట. మోడీ రాజ్యంలో సమస్త వ్యవస్థలూ శక్తులూ కూడా అదానీని కాపాడ్డానికే అంకితమైన తీరు ఇదిన్యూస్‌క్లిక్ పై కేంద్రం దాడికి కారణం నివెల్లీరాయ్ సింఘం ద్వారా దానికి మూడు కోట్ల రూపాయాలు అందాయనే ఆరోపణ. వాస్తవానికి అవి చట్టబద్ధంగా జరిగిన లావాదేవీలు. కానీ దాన్ని పెద్ద వ్యవహారంగా చేసి ప్రబీర్ పురకాయస్థ తదితరులనునెలల తరబడి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. ఇప్పటికీ వేధిస్తూనే వున్నారు. మీడియాపై అదానీ పట్టు అంతులేకుండా పెరిగిపోతున్న స్థితి కూడా చూస్తున్నాం.17లక్షల కోట్ల వ్యాపార సామ్రాజ్యం అక్రమాలను అంతర్జాతీయ సమాజం లోతులు చూపుతున్నా దాటేస్తున్న ఈ సర్కారు న్యూస్‌క్లిక్ విషయంలో మన దర్యాప్తు సంస్థల సమాచారాన్నే మరోరూపంలో ఇచ్చిన న్యూయార్క్ టైమ్స్ కథనాన్ని ఆధారంగా చూపుతుంది. కానీ అదానీ కి సంబంధించిన వేల కోట్ల స్టాక్ భాగోతాలలో మనీలాండరింగ్‌లలో మాత్రం పత్రికల కథనాలపై ఆధారపడలేమని అత్యున్నత న్యాయస్థానం తీర్పు చెబుతుంది. తలకిందులు తర్కం అంటే ఇదే కదూ?

రామా కనవేమిరా?

నారదుడు ఆకాశమార్గాన వెళుతూ, ఆంజనేయుడు కోసం వెదుకుతున్నాడు. ఎక్కడో గంధమాధన పర్వతం మీద తపస్సు చేసుకుంటున్నాడన్న విషయం గుర్తుకు వచ్చి వెంటనే అక్కడ దిగిపోయాడు. అక్కడ వాతావరణం నారదుడిని ఎంత ఆశ్చర్యానికి, ఆనందానికి గురి చేసింది! అంతా రామ నామ స్మరణే. మూరు మోగుతున్నది. ఆంజనేయుడు తపస్సు చేసుకుంటున్న చోటుకి చేరుకున్నాడు. తనకి అలవాటైన విధంగా "నారాయణ నారాయణ" అన బోయాడు కాని నారదుడి నోరు పెగలటం లేదు. మళ్ళీ ప్రయతినంచాడు కాని ప్రయత్నించినా లాభం లేక పోయింది. చుట్టు పక్కలంతా రామనామమే పలుకుతున్నప్పుడు తన ప్రయత్నం వృధా అని నారదుడికి తెలిసిపోయింది. వెందుకే రామరామ అన్నాడు. వెంటనే ఆంజనేయుడు కళ్ళు తెరిచాడు.

"నారద మునీంద్రా! నమస్కారములు అంతా కుశలమేనా"! అంటూ నమస్కరించాడు ఆంజనేయుడు.

"ఆ, నేను కుశలమే, నీకు ఆనందం కలిగించే ఒక శుభవార్త తెలపాలని వచ్చితిని!' అన్నాడు నారదుడు.

"నాకు కొత్తగా ఆనందం కలిగే వార్తేమున్నది. సదా రామనామం జపిస్తూ నేను ఆనందంగానే ఉన్నాను కదా! అన్నాడు ఆంజనేయుడు.


"కానే కాదు!ఈ వార్త వింటే నీవు ఎగిరి గంతు వేస్తావు! అంత గొప్ప శుభవార్తను తీసుకుని వచ్చాను!" అన్నాడు నారదుడు.

"నీవు ఇంతగా చెబుతున్నావంటే అది నిజంగా శుభవార్తే అయ్యి ఉంటుంది! అదేమిటో సెలవియ్యి మునీంద్రా!" అన్నాడు ఆంజనేయుడు కుతూహలంగా.

"అయోధ్యలో నీ రాముడికి, కలియుగంలో గుడి కట్టలేదు! ఇన్నాళ్ళకి మహాద్భుతమైన గుడి నిర్మించుకున్నారు. త్వరలోనే ప్రారంభం కూడా జరపబోతున్నారు!" అన్నాడు నారదుడు.

ఈ వార్త వింటూనే ఆంజనేయుడు ఆనందంతో గంతులు వేశాడు.

"మునీంద్రా! ఇది నిజంగానే గొప్ప శుభవార్త! అంటూ



నారదుడిని భుజాల మీదికి ఎత్తుకున్నాడు.

"ఆంజనేయా! నీ ఉత్సాహం చూస్తుంటే ఇదే ఊపు నన్ను ఇలాగే ఆయోధ్యకు తీసుకెళ్ళేలా ఉన్నావే! అన్నాడు నారదుడు.

అంతకన్నా భాగ్యమా! మునీంద్రా పదండి వెళ్దాం! అంటూ ఆంజనేయుడు ఆకాశ మార్గాన, నారదుని భుజాల మీదనే కూర్చోబెట్టుకుని అయోధ్య చేరుకున్నాడు.

"మునీంద్రా! మనం ఇలాగే అయోధ్య లోకి ప్రవేశిస్తే మనల్ని గుర్తించి స్వాగత సత్కారాలు, పూజలు చేయవచ్చు. అందుకే ప్రజలు మనను గుర్తించకుండా మారు వేషలలో సంచరించుదాము! అన్నాడు - ఆంజనేయుడు.

నారదుడు సరేనన్నాడు! ఇద్దరూ మారు వేషలలో ఆయోధ్య పుర వీధులలో సంచరించసాగారు! అయోధ్యలో తిరుగుతున్న కొద్ది ఆంజనేయుడికి క్రమంగా అసహనం పెరిగింది.

మునీంద్రా! ఇది అయోధ్యయేనా! పొరపాటున మనం వేరే పురమును చేరుకుంటిమా! నేను అయోధ్యకు రాక చిరకాలము గతించింది! దారి తప్పినట్లున్నది" అన్నాడు ఆంజనేయుడు అసహనమూ అనుమానమూ కలగలిపి.

"అంజనేయా! ఇది ఆయోధ్యే! అనుమానము వలదు. నీవు అయోధ్యలో నివసించినది త్రేతా యుగమందున. ఇది కలియుగము మార్పు అనివార్యము కదా!" అన్నాడు నారదుడు.

"ఆ మాత్రము గ్రహించలేనా మునీంద్రా! అయోధ్యలో నా రాముడి చిహ్నాలేమీ కనబడుట లేదు! ఎక్కడా రామానామము కనబడుట లేదు! ఎవరీ నూతన ముని తెల్లటి గడ్డంతో కనబడుతున్నాడు. వశిష్టుడే అని భ్రమ పడ్డాను! కాని వశిష్టుడు కాదు! రామ నామమునకు బదులుగా నమో! అని వినబడుచున్నది! ఇది ఏమి మంత్రము కొత్తగా ఉన్నది" అన్నాడు ఆంజనేయుడు.

"నిజమే అంజనేయా! పురజనులతో చర్చించుదాము!" అంటూ కాషాయ వస్త్రాలు వేసుకున్న ఒక భక్తుడిని పలకరించినాడు నారదుడు. 'భక్తా! ఇక్కడ రాముల వారి ఆలయం నిర్మించుతున్నారు కదా! ఆ చిహ్నాలేమీ కనబడటం లేదు! తెల్లటి గడ్డం గల ఆ ముని ఎవరు? నమో! మంత్రానికి అర్థమేమిటి?" ప్రశ్నల వర్షం కురిపించాడు.

నారదుడి ప్రశ్నలకు, ఆ భక్తుడు పగలబడి నవ్వాడు. అంతేకాదు తోటి భక్తులను కూడా పిలిచి విషయం చెప్పాడు. దాంతో వారందరు కూడా నవ్వారు.

"ఇందులో నవ్వవలసిన విషయమేమున్నది?" అన్నాడు నారదుడు. "నవ్వవలసినది కాక పేరెమున్నది? ప్రపంచమే అంగీకరించిన నాయకుడి ఫోటో చూసి, మీరు ముని అంటున్నారు! ఆయన పేరే మీరు వింటున్న నమో! అన్నాడు ఆ భక్తుడు. "ఆయోధ్యలో వినిపించవలసింది, రామ నామము, కన్పించ వలసింది రామ చిత్రము మాత్రమే! నడుమ ఈ నమో ఎవ్వరు? అన్నాడు ఆంజనేయుడు కోపంగా.

"నమో ! ఎవ్వరంటావేమిటి? ఆయన అవతార పురుషుడు! అలాంటి అవతార పురుషుడి గురించి అడ్డంగా మట్లాడుతున్నారు. ఎవర్రా మీరు పాకిస్తాన్ నుండి వచ్చారా? లేక చైనా నుండి వచ్చారా?" అన్నాడొక భక్తుడు.

దాంతో ఆంజనేయుడు, నారదుడు తమ నిజరూపాలు దాల్చారు.

"నేను నారదుడను, ఆయన ఆంజనేయుడు! అన్నాడు నారదుడు.

"ఈయన ఆంజనేయుడు ఎందుకవుతాడు! ఇదిగో చూడు ఆంజనేయుడు ఇలా ఉంటాడు! అంటూ తన ఫోన్లోని ఆంజనేయుడి ఫోటో చూపాడు మరో భక్తుడు.

ఆ ఫోటోను నారదుడు, ఆంజనేయుడు చాలా సేపు చూశారు

ఇంతకూ ఇది నా చిత్రమేనా, రాక్షసుల మీద యుద్ధం చేసే సమయంలో కూడా ఇంత క్రూరంగా కన్పించలేదు!" అన్నాడు ఆంజనేయుడు.

"అదే నేనూ చెప్పేది! ఇదే ఆంజనేయుడి ఫోటో! ఫోటోలా నీవు లేవు కాబట్టి నీవు ఆంజనేయుడివి కాదు! ఇక వెళ్ళు!" అన్నాడా భక్తుడు.

"ఇది అయోధ్య కదా! మరి రాముడి చిత్రము లేవీ కనబడుట లేదు! మొత్తం ఆ నమో చిత్రాలే కన్పిస్తున్నాయి!" అన్నాడు అనుమానంగాఆంజనేయుడు.

"పిచ్చివాడా! నీవు ఈ దేశ వాసివి కానట్లు ఉన్నావు. రాముడి ఫోటోలు ఇక్కడెందుకు ఉంటాయి. అదిగో ఆ గుడిలో ఉంటాయి! రాముడికి గుడి కట్టిస్తున్నాడు మా నమో! అంటే రాముడి కన్నా నమోనే గొప్పవాడని తెలుస్తోంది కదా! అందుకే అయోధ్యలోనే కాదు ఈ దేశమంతా నమో ఫోటోలు పెడుతున్నాము! రాముడి గుళ్ళో కూడా రామ్‌లల్లా విగ్రహం, మూడడుగులు, నమో విగ్రహం ఎనిమిది అడుగులు ఉంటాయి. రామ్‌లల్లా ఒక చేతి వేలు నోట్లో వేసుకుని, మరో చేత్తో నమో చేయి పట్టుకుని ఉండేలా డిజైన్ చేస్తున్నాము!" అన్నాడు భక్తులు ముక్తకంఠంతో.

చివరి వాక్యం వింటూనే, ఆంజనేయుడు, నారదుడు కళ్ళు తిరిగి పడిపోయారు!.

- ఉషా కిరణ్

హైదరాబాద్‌లో మరిన్ని డంప్ యార్డులు

- జనావాసాలకు దూరంగా ఏర్పాటు
- ప్రజారోగ్యానికి ఇబ్బంది లేకుండా చర్యలు : సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ చుట్టూ నాలుగువైపులా నాలుగు డంప్ యార్డులను జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఈ డంప్ యార్డుల వల్ల ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరం మొత్తానికి జవహర్ నగర్‌లో ఒకే డంప్ యార్డు ఉన్నది. ప్రతిరోజు సుమారు 8 వేల టన్నుల చెత్తను అక్కడకు చేరవేస్తున్నారు. దాని వల్ల వాయు కాలుష్యం, చెడువాసన వంటి వాటితో చుట్టు పక్కల ఉండే ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. ఇలాంటి కాలుష్యాన్ని తగ్గించే విధంగా సిటీకి దూరంగా గతంలో శంషాబాద్, మెదక్ వైపు డంప్ యార్డు సైట్‌లను పరిశీలించామనే విషయాన్ని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. చెత్త ద్వారా 15 మెగావాట్ల విద్యుత్ ను ఉత్పత్తి చేయవచ్చునీ, ఇందుకు గాను టిఎస్ఎస్పీడీసిఎల్‌తో సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి వారికి సూచించారు. చెత్తను సాధ్యమైనంత వరకు రీసైకిల్ చేయాలని అన్నారు. ఇందుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలందిస్తామని తెలిపారు.

తెలంగాణ ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ చైర్మెన్‌గా రేవంత్

- సభ్యులుగా 25 మంది సీనియర్ నేతలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పార్లమెంటు ఎన్నికలకు ఏఐసీసీ సమాయత్తమవుతున్నది. అన్ని రాష్ట్రాలకు కీలకమైన ఎన్నికల కమిటీలను ఏర్పాటు చేసింది. ఈమేరకు శనివారం తెలంగాణ ఎన్నికల కమిటీ చైర్మెన్, సభ్యులను నియమించింది. తెలంగాణ ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ చైర్మెన్‌గా టీపీసీసీ అధ్యక్షులు, సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని సభ్యులుగా భట్టి విక్రమార్క, టి.జీవన్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, కె. జానారెడ్డి, వి.హనుమంత రావు, చల్ల వంశీచంద్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, మధుయాష్కీగౌడ్, ఎస్‌ఏ. సంపత్‌కుమార్, రేణుకా చౌదరి, బాలరాం నాయక్, జగ్గారెడ్డి, గీతారెడ్డి, అజరుద్దీన్, అంజన్‌కుమార్ యాదవ్, మహేష్‌కుమార్‌గౌడ్, షబ్బీర్‌అలీ, ప్రేమ్‌సాగర్‌రావు, పొదెం వీరయ్య, సునీతారావులను నియమించింది. ఎక్స్ అఫిషియో సభ్యులుగా యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్ చైర్మెన్లు నియమించారు.

ఫార్ములా ఈ- రేస్ రద్దు పట్ల కాంగ్రెస్ హర్షం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఫార్ములా ఈ-రేస్ వల్ల గతంలో హైదరాబాద్ నగర ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని టీపీసీసీ ఉపాధ్యక్షులు జి నిరంజన్ గుర్తు చేశారు. అందుకే రేస్‌కు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంలేదన్నారు. శనివారం శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వం ట్రాఫిక్‌ను స్తంభింప చేసి అవివేక నిర్ణయం తీసుకుందని విమర్శించారు. ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొన్నారని చెప్పారు. రేస్ వల్ల ప్రజలకు ఏ మాత్రం ఉపయోగం లేదని చెప్పారు. ఈ రేస్‌ల వల్ల పెట్టుబడులు వస్తాయంటూ మాజీ మంత్రి కేటీఆర్ చెప్పడం తెలివి తక్కువ తనమని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్సీ కోటా కింద రెండు స్థానాలు ఖాళీగా ఉన్నా ఎన్నికలు వేరువేరుగా జరుగుతాయని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసిందన్నారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో కూడా ఇలాగే జరిగాయని చెప్పారు.

13 నుంచి జూనియర్ కాలేజీలకు సంక్రాంతి సెలవులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలకు ఈనెల 13 నుంచి 16 వరకు నాలుగు రోజులపాటు సంక్రాంతి సెలవులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతిఓజా శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ప్రయివేటు, ఎయిడెడ్ జూనియర్ కాలేజీల యాజమాన్యాలు సంక్రాంతి సెలవులు ఇవ్వాలని డీఐఈవోలను ఆదేశించారు. ఈ నిబంధనలను పాటించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని యాజమాన్యాలను హెచ్చరించారు. ఈనెల 17న జూనియర్ కాలేజీల్లో తరగతులు పునఃప్రారంభమవుతాయని వివరించారు. రాష్ట్రంలోని పాఠశాలలకు ఈనెల 12 నుంచి 17 వరకు ఆరురోజులపాటు సంక్రాంతి సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. డిసెంబర్ 22 నుంచి 26 వరకు మిషనరీ స్కూళ్లకు క్రిస్మస్ సెలవులను ఇచ్చింది. దీంతో ఈనెల 12 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులు మిషనరీ స్కూళ్లకు వర్తించబోవు. ఈనెల 18 నుంచి మిగతా పాఠశాలల్లో తరగతులు పునః ప్రారంభమవుతాయి.

పాలిటెక్నిక్ సప్లిమెంటరీ పరీక్షలు యథావిధిగా నిర్వహించాలి

- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి పీఎస్ఎస్‌సీ, ఏఐడీఎస్‌వో వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రతి విద్యాసంవత్సరంలోనూ పాలిటెక్నిక్ విద్యార్థులకు రెగ్యులర్‌తోపాటు సప్లిమెంటరీ పరీక్షలను యథావిధిగా నిర్వహించాలని పీఎస్ఎస్‌సీ, ఏఐడీఎస్‌వో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని పీఎస్ఎస్‌సీ రాష్ట్ర కార్యదర్శి ఎన్ నాగరాజు, ఏఐడీఎస్‌వో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం వెంకటేశ్ శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. సీ-18 స్కీం నుంచి ఏటా ఒక్కసారి మాత్రమే సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. గతేడాది విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు లేనందున ఏడాది విద్యకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వివరించారు. సీ-18, సీ-21 స్కీం బ్యాచ్ విద్యార్థులకు ఏప్రిల్‌లో జరగబోయే రెగ్యులర్ పరీక్షలతోపాటు సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించాలని కోరారు.

ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్‌కు మాతృవియోగం

- మాజీ సీఎం కేసీఆర్ సంతాపం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎడిటర్ కె. శ్రీనివాస్ మాతృమూర్తి కండ్లకుంట రంగనాయకమ్మ శనివారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయన కుటుంబానికి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి హరీశ్‌రావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపాన్ని తెలిపారు. శ్రీనివాస్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సీపీఐ సంతాపం

ఆంధ్రజ్యోతి సంపాదకులు కె శ్రీనివాస్ మాతృమూర్తి కండ్లకుంట రంగనాయకమ్మ మరణం పట్ల సీపీఐ రాష్ట్ర సమితి సంతాపం ప్రకటించింది. ఆమె కుటుంబ సభ్యులకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రగాఢ సానుభూతిని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కేసీఆర్‌కు పలువురి పరామర్శ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్‌ను శనివారం ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు పరామర్శించారు. ఆయన చిన్ననాటి మిత్రులు గోడిసెల రాజేశం, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి. లోక్ జనశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కొమ్మినేని వికాస్, తులా పునీత్ తదితరులు కేసీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరు ధైర్యంగా ఉండాలనీ, బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం వస్తుందని చెప్పారు.

నారాయణ కాలేజీ గుర్తింపు రద్దు చేయాలి : పీడీఎస్‌యూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కలుషిత ఆహారంతో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నారాయణ కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిడికాయల పరశురాం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ర్యాంకుల పేరుతో పరిమితికి మించి విద్యార్థులను ఇరుకు గదుల్లో బలవంతంగా ఉంచడం సరైంది కాదని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతుల్లేకున్నా నారాయణ కాలేజీ యాజమాన్యం వసతి గృహాలను నడుపుతున్నదని పేర్కొన్నారు. దీనికి ఇంటర్ బోర్డు అధికారుల సహకారం ఉందని వివరించారు. కార్పొరేట్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న హాస్టళ్లను ప్రభుత్వం తనిఖీ చేసి వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

నెలరోజులకే.. విమర్శలా..?

- తాము ఇచ్చిన హామీలను అమలు చేసి తీరుతాం..
- విద్య, వైద్యంపైనే ప్రభుత్వం దృష్టి
- బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో అభివృద్ధి శూన్యం
- ప్రజాపాలన కార్యక్రమంలో మంత్రులు

"కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెల రోజులే అయింది.. అప్పుడే బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారు.. అసలు బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది. పదేండ్లలో గ్రామాలు, తండాల్లో అభివృద్ధి శూన్యం.. అయినా మేము ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తాం.." అని ప్రజాపాలన కార్యక్రమం ముగింపులో మంత్రులు చెప్పారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు కోసం చేపట్టిన 'ప్రజాపాలన' కార్యక్రమం శనివారంతో ముగిసింది. గ్రామాలు, తండాల్లో ఎక్కడికక్కడ గ్రామసభలు పెట్టి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వీటిలో ఎక్కువగా మహాలక్ష్మి, చేయూత, ఇండ్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు వచ్చాయి. డిసెంబర్ 28న ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ఈనెల ఆరు వరకు సాగింది. వచ్చిన దరఖాస్తులను ఈనెల 8 నుంచి 17 వరకు డేటా ఎంట్రీ జరుగుతుందని అధికారులు తెలిపారు. మొదటి రెండు రోజులు దరఖాస్తుల అందజేతలో కొన్ని ఇబ్బందులు ఎదురైనా.. ఆ తర్వాత సీఎం, మంత్రులు వివరణ ఇవ్వడంతో సాఫీగా సాగింది. కోటికిపై దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో పలుచోట్ల మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. కాగా, మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం వందురుగూడ ఆదివాసీ గిరిజనులు తమ గ్రామాన్ని వెంకటా పూర్ గ్రామంలోనే కొన సాగించాలని ప్రజా పాలన కార్యక్రమాన్ని బహిష్కరించారు.



మెదక్‌లో...

నవతెలంగాణ- విలేకరులు

ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కామారెడ్డి జిల్లాలో పర్యటించి పలు గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. జుక్కల్ నియోజకవర్గం బిచ్కుంద మండలం ఎల్లారం తండా, పిట్లం మండలం కుర్తిలో దరఖాస్తులు స్వీకరించారు. అంతకుముందు కౌలాస్ కోటను సందర్శించి పర్యాటక కేంద్రంగా మారుస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "బిచ్కుంద మండలంలోని ఎల్లారం తండాకు ఇప్పటి వరకు ఎమ్మెల్యే, ఎంపీ వచ్చిన దాఖలాలు లేవు. రెవెన్యూ శివారు లేదు. గూగుల్ మ్యాప్‌లో ఈ తండా పేరే లేదు. ఇదీ బీఆర్ఎస్ పాలనలో పరిస్థితి" అన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను దశల వారీగా అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పదేండ్ల అధికారంలో ప్రజలనే కాదు చివరకు మంత్రుల ను కూడా ప్రగతి భవన్ లోకి అనుమతివ్వ లేదన్నారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో 24,74,325 దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా చివరి రోజు ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తుల స్వీకరణ ముమ్మరంగా కొనసాగింది. ప్రజలు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. శంషాబాద్ మండలం నర్కుడలో 925, పెద్ద గోల్కొండ గ్రామంలో 536 దరఖాస్తులు స్వీకరించినట్టు అధికారులు తెలిపారు. కొత్తూరు మండలంలో 6260, మున్సిపాలిటీలో 4011 దరఖాస్తులు స్వీకరించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. వికారాబాద్ జిల్లా దోమలో 1413 దరఖాస్తులు స్వీకరించారు. పరిగి మండల కేంద్రంలోని మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాలతో పాటు స్థానిక శ్రీ సాయి డిగ్రీ, పీజీ కళాశాలలో కంప్యూటర్ ఆపరేటర్లతో నిర్వహిస్తున్న డాటా ఎంట్రీ పనులను కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు.

సూర్యాపేట జిల్లాలో మొత్తం 79,539 దరఖాస్తులు, నల్లగొండ జిల్లాలో 5,25444, భువనగిరి జిల్లాలో 2,17000 దరఖాస్తులను స్వీకరించారు.

దృఢ నిశ్చయంతో ఉన్నాం.. మంత్రి పొన్నం

గత ప్రభుత్వం ఎన్ని అప్పులు మిగిల్చినా... ప్రజలకు మంచి చేయాలని దృఢ నిశ్చయంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజాపాలన బహిష్కరణ

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం వందురుగూడ ఆదివాసీ గిరిజనులు ప్రజాపాలన కార్యక్రమాన్ని బహిష్కరించారు. చివరి రోజు శనివారం గ్రామంలో ప్రజాపాలన ఏర్పాటు చేయగా అధికారులకు ఒక్క దరఖాస్తు కూడా అందలేదు. అధికారులను గిరిజనులు గ్రామంలోకి రాకుండా అడ్డుకున్నారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని తమ గ్రామంలో నిర్వహించొద్దంటూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. వెంకటాపూర్ గ్రామం నుంచి వేరు చేసిన తమ గూడాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఐదు సంవత్సరాలుగా తాము నిరసనలు చేపడుతున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీ చట్టాలను ఏమాత్రమూ లెక్కచేయకుండా గ్రామాన్ని ఏర్పాటు చేశారని, పీసా చట్టాన్ని గౌరవించడం లేదని అన్నారు.

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో 9,98,813 అర్జీలు

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురం భీం - ఆసిఫాబాద్ జిల్లాల్లో ఐదు గ్యారంటీ లతో పాటు ఇతర పథకాలకు 9,98,813 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఇతర పథకాల కు సంబంధించి 1,25, 608 వినతులు ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో ఐదు పథకాలకు 224136, ఇతరాంశాలకు 29145 దరఖాస్తులు రాగా, మొత్తం 253281 వచ్చాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 181794, మంచిర్యాలలో 283249, నిర్మల్ జిల్లాలో మొత్తం 280489 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. తొలి రోజు నుంచి చివరి వరకు గ్రామాలు, పట్టణాల్లో ప్రజాపాలన పేరిట చేపట్టిన ఈ సభలకు జనం తండోపతండాలుగా తరలివచ్చి అర్జీలు అందించారు. శనివారంతో ఈ ప్రక్రియ ముగియగా.. వెంటనే ఆన్‌లైన్‌లో వివరాలను క్రోడీకరించే ని ని ప్రారంభించారు.

ప్రజల వద్దకే ప్రభుత్వం

- మంత్రి దామోదర రాజనర్సింహ

'అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం. ప్రజల వద్దకు ప్రభుత్వాన్ని తీసుకురావడమే ప్రజాపాలన. రాజకీయాలకతీతంగా అభివృద్ధికి సహకరించాలి. మెరుగైన విద్య, వైద్యంపైనే ప్రభుత్వం దృష్టి పెట్టింది' అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం రుస్తుంపేట, మండల కేంద్రమైన చేగుంటలో నిర్వహించిన ప్రజాపాలనకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే సునీతారెడ్డి, అదనపు కలెక్టర్ రమేష్‌తో కలిసి మంత్రి హాజరయ్యారు.

ప్రజాపాలనలో అభహస్తం గ్యారంటీల పథకాలకు శుక్రవారం రాత్రి వరకు 2,39,424 కుటుంబాల నుంచి 2,17,224 దరఖాస్తులు స్వీకరించినట్టు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ తెలిపారు. ఇతర దరఖాస్తులు 49,935 వచ్చినట్టు చెప్పారు. వరంగల్ జిల్లాలో 2.86 లక్షలు, హనుమకొండ జిల్లాలో 2,50,367 దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చివరి రోజు ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామంలో ఎమ్మెల్యే వచ్చి ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని అధికారులు మధ్యాహ్నం వరకు దరఖాస్తులు స్వీకరించలేదు. దీంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేయగా వెంటనే తీసుకున్నారు. జగిత్యాల జిల్లాలో ఏడు రోజుల వ్యవధిలో గ్రామీణ ప్రాంతంలో 2,42,356, పట్టణ ప్రాంతంలో 77,435 దరఖాస్తులు కలిపి మొత్తం 3,60,923 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 68,072 దరఖాస్తులు ఇతర సమస్యలపై వచ్చాయి. సిరిసిల్ల జిల్లాలో మొత్తం 1,90,965 దరఖాస్తులొచ్చాయి. ఇతర సమస్యలపై 28,564 అర్జీలు వచ్చాయి. కరీంనగర్ జిల్లాలోని 313 పంచాయతీలు, వార్డుల సభల ద్వారా 214206 దరఖాస్తులు ఆరు గ్యారంటీల కోసం రాగా, ఇతర సమస్యలపై 22112 అర్జీలు వచ్చాయి.



నిజామాబాద్‌లో...

డ్రైవర్లకు రక్షణ కల్పించండి

న్యాయసంహితలో సెక్షన్ 104(2) రద్దు చేయాలి

- టీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో నిరసన దినం జయప్రదం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్రప్రభుత్వం అమల్లోకి తెచ్చిన భారతీయ న్యాయ సంహిత్ చట్టంలో సెక్షన్ 104(2)ను రద్దు చేసి డ్రైవర్లకు రక్షణ కల్పించాలని టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) డిమాండ్ చేసింది. ఎస్‌డబ్ల్యూఎఫ్ పిలుపు మేరకు శనివారం టీఎస్ఆర్టీసీ పరిధిలోని అన్ని డిపోలు, యూనిట్లలో ఆర్టీసీ కార్మికులు డిమాండ్ బ్యాడ్జీలు ధరించి, నిరసన దినం పాటించారు. రవాణారంగ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణం స్పందించి చట్టంలో మార్పులు చేయాలనీ, లేకుంటే దేశవ్యాప్త సమ్మెకు కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా పలుచోట్ల ఆర్టీసీ కార్మికులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. భోజన విరామ సమయంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎక్కడికక్కడ ఫెడరేషన్ స్థానిక నాయకత్వం కార్మికులను కదిలిస్తూ, నిరసన దినం ఆవశ్యకతను వారికి వివరించే ప్రయత్నం చేసింది. రవాణారంగ కార్మికుల సమస్యలు రాజకీయ అజెండా అయ్యేలా ఆందోళనలు, పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని బస్ భవన్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు ఏవీ రావు, గంగాధర్, బిక్షపతి గౌడ్ నాయకత్వం వహించారు. ఖమ్మం రీజియన్‌లో వెంకటేశ్వర్లు, పద్మావతి, వరంగల్ రీజియన్‌లో ఎల్లయ్య, ఆదిలాబాద్‌లో ఎమ్‌బీ రావు, నల్గొండలో సుధాకర్, హైదరాబాద్ డిపోల్లో ఎస్ కృష్ణ, ప్రకాష్, గీత నాయకత్వం వహించారు. మహబూబ్‌నగర్‌లో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు, కరీంనగర్‌లో శ్రీనివాస్ నాయకత్వం వహించారు. సంస్థలోని ఇతర కార్మిక సంఘాలు కూడా ఈ సమస్యపై ఉమ్మడి పోరాటానికి కలిసి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం జయప్రదం చేసిన కార్మికులందరికీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ తరపున ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.

బాలల గృహం నుంచి 26 మంది బాలికలు అదృశ్యం..!



మధ్యప్రదేశ్ : గుజరాత్, జార్ఖండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాలకు చెందిన 26 మంది బాలికలు భోపాల్‌లో అక్రమం గా నిర్వహిస్తున్న షెల్టర్ హోమ్ నుంచి అదృశ్యమయ్యారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మెన్ ప్రియాంక్ కనుంగో.. భోపాల్ శివార్లలోని పర్వాలియా ప్రాంతంలోని ఆంచల్ బాలికల హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించినప్పుడు ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. షెల్టర్ హోమ్ రిజిస్టర్‌ను పరిశీలించిన తర్వాత అందులో 68 మంది బాలికల ఎంట్రీలు ఉన్నాయని, అయితే వారిలో 26 మంది కనిపించడం లేదని కనుంగో గుర్తించారు. అదృశ్యమైన బాలికల గురించి షెల్టర్ హోమ్ డైరెక్టర్ అనిల్ మాథ్యూను ప్రశ్నించగా.. ఆయన పొంతన లేని సమాధానలు చెప్పడంతో.. అనుమానం వచ్చిన అధికారి.. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల దర్యాప్తులో బాలికల హాస్టల్‌లో అనేక అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. అసలు షెల్టర్ హౌంను అక్రమంగా నిర్వహిస్తున్నట్లు తేలింది. ఈ విషయం గురించి తెలుసుకున్న గవర్నర్.. దీనిపై దర్యాప్తు చేయాల్సిందిగా ఆదేశిస్తూ ప్రభుత్వ సీఎస్‌కు నోటీసులు పంపినట్టు తెలిపారు. ఇక షెల్టర్ హౌంలోని మిగతా పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పజెప్పారు.

ఎన్నికల మ్యానిఫెస్టోలోని హామీలను అమలు పరచండి



మంత్రి తుమ్మలకు తెలంగాణ రైతు సంఘం వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో రైతు సమస్యలపై పొందుపరిచిన హామీలను అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం కోరింది. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి. సాగర్, ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాదరావు, సహాయ కార్యదర్శి మూడ్‌శోభన్ తదితరులు వినతిపత్రం సమర్పించారు.

వినతిపత్రంలోని కీలకాంశాలివే

- భూమాతగా ప్రకటించిన ధరణిలోని లోపాలను సరి చేస్తామన్నారు. ధరణిలో 20 లోపాలున్నట్టు గత మంత్రివర్గ ఉప సంఘం అంగీకరించింది. వాటిని సరిచేసేందుకు మీసేవ ద్వారా ప్రతి రైతు రూ.1650 చెల్లించారు. రాష్ట్రంలో 4.5 లక్షల మంది డబ్బులు చెల్లించి ధరఖాస్తులు చేసుకున్నారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి భూసమస్యలపై గల లోపాలను సవరించి అందరికీ పాస్ పుస్తకాలు ఇవ్వాలి. సమగ్ర భూ సర్వే నిర్వహించి, గ్రామ సభలు జరిపి లోపాలను సవరించాలి.
- రెవెన్యూ రికార్డుల్లో కౌలు రైతుల పేర్లు, వాస్తవ సాగుదారుల పేర్లు నమోదు చేయడానికి రెవెన్యూ రిజిస్టర్‌లో ఓ 'కాలమ్'ను ఏర్పాటు చేయాలి. అందులో వాస్తవ సాగుదారుల పేర్లు నమోదు చేయాలి. 2011 కౌలు చట్టాన్ని అమలు చేయాలి. సాగుదారులందరికి ప్రభుత్వం ప్రకటించిన రూ.12,500 సబ్సిడీ ఇవ్వాలి.
- గత రాష్ట్ర ప్రభుత్వం 2020 నుంచి 'కేంద్ర పీఎం ఫసల్ బీమా' నుంచి విరమించుకుంది. అప్పటినుండి రాష్ట్ర రైతులకు ఎలాంటి పరిహారం రావడంలేదు.ఏటా రూ.5 కోట్ల పంటలకు నష్టం వాటిల్లుతుంది. రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని రూపొందించి, ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి పంటల పరిహారం ఇవ్వాలి. ఇందుకు పథకాన్ని రూపొందించాలి.
- ప్రాధాన్యత క్రమంలో సాగునీటి పథకాలను పూర్తి చేయాలి. ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్ ఉమ్మడి జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టులను రానున్న ఏడాదిలో పూర్తి చేసేందుకు బడ్జెట్ కేటాయింపులు చేయాలి. కాళేశ్వరం సహా భారీ ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతిని 'హైకోర్టు జడ్జి' ద్వారా విచారణ జరిపించాలి. నేరస్తులను శిక్షించాలి. సబ్సిడీపై మైక్రోఇరిగేషన్ (డ్రిప్, స్ప్రింక్లర్) పథకాలు అమలు చేయాలి. ఐడీసీ నిర్వహణలోని లిఫ్ట్ పథకాలను రిపేర్లు చేయాలి.
- రాష్ట్రంలో వ్యవస్థీకృతంగా కల్తీ విత్తనాల వ్యాపారం సాగుతుంది. ఏటా నాలుగైదు లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటున్నాయి. కల్తీ విత్తనాలను పట్టుకోవడమే తప్ప నేరస్తులపై ఎలాంటి శిక్షలు లేవు. నష్టపోయిన రైతులకు పరిహారాలు లేవు. 'వెంటనే ప్రభుత్వం 'రాష్ట్ర విత్తన చట్టా'న్ని రూపొందించాలి. కల్తీ విత్తన సంస్థల కంపెనీలను రద్దు చేయాలి.
- గత రెండేడ్లుగా వ్యవసాయ శాఖ 'యాక్షన్‌ప్లాన్' ప్రకటన లేదు. వెంటనే వార్షిక ప్రణాళికలు ప్రకటించాలి. ఈ వార్షిక ప్రణాళికలో ప్రాంతాల భూసారాన్ని బట్టి పంటల విధానాన్ని రూపొందించాలి.
- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసా పథకం ప్రకారం ఎకరాకు రూ.15,000 చొప్పున రైతుల ఖాతాలో వేయాలి. యాసంగి పంటలకు సంబంధించి ఎకరాకు రూ.7,500 చొప్పున వాస్తవ సాగుదారులందరికి వారి ఖాతాలలో జమ చేయాలి.
- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన పంటల మద్దతు ధరలు, బోనస్ వెంటనే అమలు చేయాలి. వడ్లకు క్వింటాల్ రూ.2683తోసహా మొక్కజొన్న తదితర పంటలకు మ్యానిఫెస్టోలో ప్రకటించిన ధరలను వెంటనే అమలు చేయాలి. అందుకు వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీలకు జీవో విడుదల చేయాలి. లీటర్ పాలకు రూ.5 బోనస్ అమలుకు నిధులు విడుదల చేయాలి. రాష్ట్ర స్థాయి 'వ్యవసాయ ఉత్పత్తుల ధరల నిర్ణాయక కమీషన్' ఏర్పాటు చేసి అన్ని పంటలకు మద్దతు ధరలు నిర్ణయించాలి.
- రూ.2లక్షల లోపు రుణాలు ఏకకాలంలో మాఫీ చేయాలి
- రిజర్వు బ్యాంక్ ఆదేశాల ప్రకారం బ్యాంకులు తమ డిపాజిట్లలో 18 శాతం లిస్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇవ్వాలి.
- అటవీహక్కుల చట్టం 2006 ప్రకారం అర్హులకు హక్కు పత్రాలు ఇవ్వాలి.
- మూసివేసిన చెరుకు ఫ్యాక్టరీలను తెరిపించుటకు చర్యలు ప్రారంభించాలి.

హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	63,270	-	---
22 క్యారెట్లు	58,000	-	---
కిలో వెండి	78,000	-	---

చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	75
రిటైల్ (లైవ్)	రూ.	97
స్కిన్‌తో	రూ.	141
స్కిన్‌లెస్	రూ.	160

హైదరాబాద్‌లో కార్ రేస్ రద్దు

ఫార్ములా-ఈ రేసు ఆతిథ్యం పాయే

- ఈ-రేసు రద్దు చేస్తూ ఎఫ్‌ఐఏ ప్రకటన
- ప్రభుత్వ తీరుపై ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు

నవతెలంగాణ-హైదరాబాద్

రయ్ రయ్.. అంటూ హుస్సేన్‌సాగర్ తీరంలో స్ట్రీట్ సర్క్యూట్‌లో మెరుపు వేగంతో విన్యాసాలు చేసిన ఫార్ములా రేసింగ్ ఈవెంట్ హైదరాబాద్ చేజారింది. పదేండ్ల తర్వాత భారత్‌కు వచ్చిన ఫార్ములా రేసు ఈవెంట్..మోటార్‌స్పోర్ట్స్ అభిమానులకు నిరాశే మిగిల్చింది. ఫిబ్రవరి 10న హైదరాబాద్‌లో జరగాల్సిన ఎఫ్‌ఐఏ ఏబీబీ హైదరాబాద్ గ్రాండ్ ప్రీ రేసు నిర్వహణపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరాసక్తి వ్యక్తం చేయటంతో.. నిర్వాహకులు ఫార్ములా-ఈ రేసును రద్దు చేస్తున్నట్టు శనివారం ప్రకటించారు. ఫార్ములా-ఈ రేసు ఈ ఏడాదితో పదో సీజన్‌కు సిద్ధమవగా ప్రపంచవ్యాప్తంగా పది విశ్వ నగరాల్లో రేసు నిర్వహిస్తోంది. అందులో భారత్ నుంచి హైదరాబాద్ చోటు దక్కించుకుంది. కానీ, ఇటీవల అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరగా.. హైదరాబాద్ ఫార్ములా ఈ రేసు నిర్వహణపై ఆసక్తి చూపించలేదు.

కాంట్రాక్టు రూల్స్ పాటించలే..: హైదరాబాద్ ఈ రేసు రద్దుపై శనివారం ఎఫ్‌ఐఏ ఓ ప్రకటన చేసింది. తెలంగాణ ప్రభుత్వ విభాగం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ నిర్ణయం వెల్లడించిన తర్వాత హైదరాబాద్ గ్రాండ్ ప్రీ రేసు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నాం. 2023 అక్టోబర్ 30న తెలంగాణ ప్రభుత్వంతో చేసుకున్న కాంట్రాక్టు రూల్స్‌ను పాటించలేదు. ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్‌ఈఓ)కు మరో దారి లేకుండా పోయింది. ఒప్పంద రూల్స్‌ను అతిక్రమించిన తెలంగాణ ప్రభుత్వంపై ఏ చర్యలు తీసుకోవచ్చనే అంశంపై ఎఫ్‌ఈఓ ఆలోచన చేస్తుంది' అని ఫార్ములా ఈ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఫార్ములా ఈ సహ వ్యవస్థాపకులు, ఫార్ములా ఈ చీఫ్ చాంపియన్‌షిప్ ఆఫీసర్ అల్బర్టో లాంగో సైతం తెలంగాణ ప్రభుత్వ నిర్ణయంపై విస్మయం వ్యక్తం చేశాడు. 'ఫార్ములా రేసుకు భారత్‌లో విపరీత ఆదరణ ఉన్న నేపథ్యంలో రేసు రద్దు నిర్ణయంపట్ల ఎంతో బాధపడు తున్నాం. అంతర్జాతీయ స్థాయి ఈ రేసు నిర్వహణ హైదరాబాద్‌తో పాటు భారత దేశానికి ప్రతిష్టాత్మకమని మాకు తెలుసు. ఫెడరేషన్ ఆఫ్ మోటార్‌స్పోర్ట్స్ క్లబ్స్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అక్బర్ ఇబ్రహీం, గత తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌కు ఈ రేసు తీసుకొచ్చేందుకు ఎంతో మద్దతుగా నిలిచారు. తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం పట్ల మేమెంత బాధపడుతున్నామో, భారత రేసింగ్ అభిమానులు సైతం అంతే బాధపడుతున్నారని మాకు తెలుసు' అని తెలిపారు.

ఎందుకు వద్దనుకున్నారంటే! : హైదరాబాద్ సిటీ విశ్వ నగరంగా ఎదుగుతోంది. ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఫార్ములా ఈ రేసు నిర్వహణతో హైదరాబాద్‌కు గ్లోబల్ గుర్తింపు లభిస్తుంది. తద్వారా విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు అవకాశాలు రెట్టింపు అవుతాయి. హైదరాబాద్ గ్రాండ్ ప్రీలో రేసులో పోటీపడే కార్లు పూర్తిగా ఎలక్ట్రిక్ వాహనాలే. సంప్రదాయ ఇంధనాల వాడకం నుంచి ప్రజలను ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి మళ్లించేందుకు సైతం ఈ ఈవెంట్ ఉపయోగపడుతుందని గతంలో తెలంగాణ ప్రభుత్వం విశ్వసించింది. అందుకే చెన్నై, నోయిడా నుంచి గట్టి ఎదురైనా హైదరాబాద్‌కు ఫార్ములా - ఈ రేసును తీసుకొచ్చింది. గత ఏడాది ఫిబ్రవరిలో ఇక్కడ ఈ రేసు విజయవంతంగా ముగిసింది. ఫార్ములా ఈ రేసు నిర్వహణతో హైదరాబాద్‌కు సుమారు రూ.700 కోట్ల బిజినెస్ అయ్యిందని ఓ నివేదిక తెలిపింది.

ఇక తాజా ప్రభుత్వం ఫార్ములా ఈ రేసు వద్దనుకునేందుకు పలు కారణాలు కనిపిస్తున్నాయి. ఫార్ములా ఈ రేసు ఫిబ్రవరి 10న జరుగనుండగా.. అందుకు రెండు రోజుల ముందు నుంచే ప్రాక్టీస్ రేసులు ఉంటాయి. దీంతో రేసు కనీసం ఐదు రోజుల పాటు ట్యాంక్‌బండ్, హుస్సేన్ సాగర్ వద్ద ట్రాఫిక్ ఆంక్షలు విధించాలి. రాష్ట్ర సచివాలయం సైతం ఆ ఐదు రోజులు పని చేసేందుకు అవకాశం ఉండదు. గతంలో సెక్రటేరియట్ సమీపంలోని బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో ఉండేది. దీంతో అప్పుడు ఎటువంటి ఇబ్బంది కలుగలేదు. ఇక నగరం నడిబొడ్డున ఫార్ములా ఈ రేసు పెట్టడంతో సాధారణ ప్రజలు ట్రాఫిక్‌తో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిజానికి, గత ఏడాది ప్రాక్టీస్ రేసు ముంగిట పౌర వాహనాలు రేసింగ్ ట్రాక్‌పైకి దూసుకొచ్చాయి. ఈ ఘటనను నిర్వాహకులు తీవ్రంగా పరిగణించారు. పోలీసులు భద్రత కట్టుదిట్టం చేసి, నిర్వాహకులకు భరోసా ఇవ్వటంతో రేసు సజావుగా ముగిసింది. ఈ ఏడాది ఫార్ములా ఈ రేసు షెడ్యూల్‌తో తొలుత హైదరాబాద్‌ను చేర్చకపోవడానికి సైతం ఇదోక కారణం. ఇక ఆర్థిక పరంగానూ తెలంగాణ ప్రభుత్వం ఈ ఈవెంట్‌ను భారంగా భావిస్తోంది. గత ఏడాది ఫార్ములా ఈ రేసు నిర్వహణ కోసం మాజీ సీఎంకు సన్నిహిత కంపెనీకి రూ. వందల కోట్ల విలువైన కాంట్రాక్టు అప్పగించారు. హుస్సేన్ సాగర్ తీరంలో రేసింగ్ ట్రాక్ ఏర్పాటు సహా రేసింగ్ జట్లకు తాత్కాలిక గ్యారేజ్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రజాధనం భారీగా వెచ్చించారు. దుబారా ఖర్చు చేయబోమని కొత్త ముఖ్యమంత్రి చెప్పటంతో.. ఫార్ములా ఈ రేసు కోసం తెలంగాణ ప్రభుత్వం తాజాగా భారీ నిధులు వెచ్చించేందుకు ఏమాత్రం సిద్ధంగా లేదు. ఫార్ములా ఈ రేసు ఈవెంట్లను ప్రజలకు ఇబ్బందులు లేకుండా నగరానికి వెలుపల ఎక్కడైనా నిర్వహించాలనే అభిప్రాయం గతంలో కాంగ్రెస్ నాయకులు సైతం వినిపించారు. దీంతో హైదరాబాద్ గ్రాండ్ ప్రీ రద్దుకు మొగ్గుచూపినట్టు తెలుస్తోంది.

ఇది తిరోగమన చర్య : హైదరాబాద్ ఫార్ములా ఈ రేసు రద్దుపై తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కెటిఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ' ఇది కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న చెత్త, తిరోగమన నిర్ణయం. ఫార్ములా ఈ రేసు వంటి ఈవెంట్లు హైదరాబాద్‌కు భారత్‌లో, ప్రపంచవ్యాప్తంగా మన బ్రాండ్ విలువను పెంచుతాయి. ఈ రేసు సందర్భంగా వారం పొడవునా కార్యక్రమాలు పెట్టుబడుల ఆకర్షణకు దోహదం చేస్తాయి. సస్టైయినబుల్ మొబిలిటి వీక్ సైతం నిర్వహించటంతో దేశవ్యాప్తంగా హైదరాబాద్‌కు ఈ రంగంలో మంచి గుర్తింపు లభిస్తుంది. ఇటువంటి అభివద్ధి తిరోగమన నిర్ణయాలు మంచిది కాదు' అని కెటిఆర్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు.

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు మమత బదిలీ

- జీహెచ్ఎంసీలో పెద్దసంఖ్యలో ఉన్నతాధికారుల బదిలీ
- ఏండ్ల తరబడి ఒకే చోట పనిచేసిన వారు..

నవతెలంగాణ-సిటీబ్యూరో


మమత

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు, జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి.మమతను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆమెను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా నియమించింది. జీహెచ్ఎంసీలో ఏండ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న కీలక అధికారులను కూడా ప్రభుత్వం బదిలీ చేసింది. ఈమేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు మమత 2010 నుంచి 2018 వరకు కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా పనిచేశారు. 2018 నుంచి కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా కొనసాగుతున్నారు. ఇప్పుడు ఆమెను బదిలీ చేసిన ప్రభుత్వం అక్కడ ఐఏఎస్ అధికారిని అభిలాష అభినవ్‌ను నియమించింది. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి డిప్యుటేషన్ రద్దు చేసి ఆయన స్థానంలో ఐఏఎస్ అధికారి స్నేహ శబరీష్‌కు బాధ్యతలు అప్పగించారు. వీరితోపాటు మరికొంత మంది డిప్యూటీ కమిషనర్లనూ ప్రభుత్వం బదిలీ చేసింది. జీహెచ్ఎంసీ సూపరింటెండెంట్ ఇంజినీర్ వెంకటరమణను మూసీ నది అభివృద్ధి సంస్థ ఎస్ఈగా బదిలీ చేశారు. అక్కడ ఎస్ఈగా ఉన్న మల్లికార్జునను ఈఎన్‌సీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జీహెచ్ఎంసీ ఫలక్‌నుమా డీసీగా వై.శ్రీనివాస్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ డీసీగా వి.నర్సింహ, సంతోష్‌నగర్ డీసీగా ఏ.నాగమణి, చార్మినార్ డీసీగా ఏ.సరిత, పలక్‌నుమా అసిస్టెంట్ కమిషనర్‌గా డి.లావణ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పురుడు పోసిన అంబులెన్స్ సిబ్బంది

- డాక్టర్ సూచనలతో సుఖ ప్రసవం
- కృతజ్ఞతలు తెలిపిన కుటుంబీకులు

నవతెలంగాణ-తాడ్వాయి




ఏజెన్సీ ప్రాంతంలో పురిటి నొప్పులతో ఇబ్బంది పడుతున్న మహిళకు అంబులెన్స్ సిబ్బందే పురుడు పోశారు. డాక్టర్ల సూచనలతో సుఖ ప్రసవం చేయగా.. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటన ములుగు జిల్లాలో శనివారం జరిగింది. తాడ్వాయి మండలం లింగాల గ్రామా నికి చెందిన ఊకే శాలినికి పురిటి నొప్పు లు రావడంతో కుటుంబీకులు అంబు లెన్స్‌కి సమాచారం అందించారు. 108 సిబ్బంది ఈఎంటి శివలింగం ప్రసాద్, పైలట్ కరుణాకర్ వెంటనే బయలుదేరారు. అయితే, ఆ ప్రాంతం దట్టమైన అటవీ ప్రాంతం.. రోడ్డు మార్గం లేకపోవడంతో అతికష్టమ్మీద లింగాలకు చేరుకున్నారు. భద్రాద్రి కొత్త గూడెం సరిహద్దు ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న లింగాల గ్రామా నికి చేరుకున్న గర్భిణికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం ముగులు సామాజిక వైద్యశాలకు తరలిస్తున్న క్రమంలో పస్రా గ్రామం వద్దకెళ్లే సరికి పురిటినొప్పులు తీవ్రమయ్యాయి. ఈఎంటి శివలింగం ప్రసాద్.. ఈఆర్‌సిపి డాక్టర్ గోపీనాథ్ సూచనలతో శాలినికి సుఖ ప్రసవం చేశారు. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం గోవిందరావుపేట ప్రాథమిక వైద్యశాలకు తరలించారు. సిబ్బందికి గర్భిణీ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నీటిపారుదల ప్రాజెక్టులు కుంభకోణాల మయం

- రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్
- కమీషన్లు, కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకే కాళేశ్వరం
- ప్రొఫెసర్ కోదండరామ్
- మేడిగడ్డపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

నవతెలంగాణ-బంజారాహిల్స్



తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులు కుంభకోణాల ప్రాజెక్టులుగా మారాయని రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై గతేడాది డిసెంబర్ 29న మేడిగడ్డలో ఇంజినీరింగ్ చీఫ్ మురళీధర్‌రావు చేసిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌పై శనివారం తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్స్ ఫోరం కన్వీనర్ దొంతుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కౌంటర్ పవర్ పాయింట్ ప్రదర్శన ఇచ్చారు. ఈ ప్రదర్శనకు సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులతో నిర్వాసితులు వివిధ వర్గాల వారు, ఆదివాసులు చెప్పలేనంత హింసకు, దౌర్జన్యాలకు గురయ్యారన్నారు. ప్రాజెక్టు కట్టడం అంటే సర్వస్వం కోల్పోవడంగా మారిందన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత కూడా.. మేడిగడ్డ విషయంలో ఎలాంటి అవకతవకలూ లేవని గతంలో రిపోర్టు ఇచ్చిన అధికారికే మళ్లీ విచారణ బాధ్యత అప్పగించడం సరికాదన్నారు. పాశం యాదగిరి మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో చేపట్టిన ప్రాజెక్టులు ప్రజలకు ఉపయోగంగా లేకపోగా ఆదివాసుల పాలిట యమపాశాలుగా మారాయన్నారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ నిర్వాసితుల వేదన అంతులేనిదన్నారు.తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొ.కోదండరామ్ మాట్లాడుతూ.. కమీషన్లు, కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని విమర్శించారు. గోదావరి నీళ్లతో ప్రాణహిత ఎల్లంపల్లి లింక్ ద్వారా తెలంగాణ ప్రజలకు మేలు జరుగుతుందనుకుంటే తెలంగాణ వచ్చాక కాంట్రాక్టుల జేబులు నింపే లక్ష్యంతో దానిని రీడిజైన్ చేశారన్నారు. తన సొంత లాభాల కోసమే కేసీఆర్ ప్రాణహితను రీడిజైన్ చేశారని ఆరోపించారు. కాళేశ్వరంలో జరిగిన అవినీతిని ప్రజలకు చూపించి దోషులను శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.

తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్ మాట్లాడుతూ.. కుంభకోణాలతో చేపట్టిన ప్రాజెక్టుల డబ్బే తెలంగాణలో ప్రతి ఎన్నికల్లో వరదలై పారిందని, రేపటి పార్లమెంట్ ఎన్నికల్లోనూ పారనుందని ఆరోపించారు. రాష్ట్రం అడుక్కునే అప్పుల కుప్పగా మారితే, మెగా కృష్ణారెడ్డి లాంటివాళ్ళు ప్రపంచ బిలియనీర్లుగా ఎదిగారని విమర్శించారు. తెలంగాణ విఠల్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి జైలుకు వెళ్లాల్సిన ఇంజినీర్లు, మంత్రులు, అధికారులు వీరే నంటూ పెద్ద లిస్టును సభాముఖంగా చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఇంజినీర్ విఠలావు, వెంకటరమణ పాల్గొన్నారు.

ఫిబ్రవరి నుంచి కార్యరంగంలోకి కేసీఆర్

మాజీ మంత్రి హరీశ్‌రావు వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ సీఎం కేసీఆర్ కోలుకుంటున్నారనీ, త్వరలోనే ఆరోగ్యవంతుడై ప్రజల మధ్యలోకి వస్తారని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి నుంచి ప్రతీ రోజూ పార్టీ కార్యాలయమైన తెలంగాణ భవన్‌కు వచ్చి కార్యకర్తలను కలుస్తారని తెలిపారు. శనివారం నిర్వహించిన పెద్దపల్లి నియోజకవర్గ సన్నాహక సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడు తూ... త్వరలోనే కేసీఆర్ జిల్లాల పర్యటనలు ఉంటాయని చెప్పారు. కేసీఆర్ కిట్ మీద ఉన్న ఆయన బొమ్మను కాంగ్రెస్ ప్రభుత్వం తొలగిస్తోందనీ, కానీ తెలంగాణ ప్రజల గుండెల నుంచి ఆయన్ను ఎవరూ తొలగించలేరని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. రేవంత్ పాలన మూడు రద్దులు.. నాలుగు వాయిదాలు అన్నట్టుగా నడుస్తోందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు కాంగ్రెస్ పాల్పడుతోందని అన్నారు. ఈ క్రమంలో బాధితులకు భరోసానివ్వ టానికి వీలుగా తమ పార్టీ ఎమ్మెల్యేలంతా కలిసి బస్సు కట్టుకుని వెళతామని చెప్పారు. తద్వారా కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని భరోసానిచ్చారు.

ఆన్‌లైన్ గేమింగ్ నిర్వాహకులతో కుమ్మక్కు

స్టాక్ మార్కెట్ పేరుతో మోసాలు

- బ్యాంక్ అకౌంట్స్ సేకరణకు లక్షల్లో కమీషన్లు
- రెండు సైబర్ మోసాల్లో నిందితుల అరెస్ట్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆన్‌లైన్ గేమింగ్.. స్టాక్ మార్కెట్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న నిందితులను హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని సీసీసీలో శనివారం విలేకరుల సమావేశంలో జాయింట్ సీపీ ఏవీ రంగనాథ్‌తో కలిసి సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి వివరాలు వెల్లడించారు. హర్యానాకు చెందిన హితేశ్ గోయల్, దుబాయ్‌లో ఉంటున్న అతని స్నేహితుడు సంజీవ్ కలిసి ఆన్‌లైన్ గేమింగ్ నిర్వహించే 'డఫాబెట్ ఆన్‌లైన్ గేమింగ్' ఆర్గనైజర్లతో కుమ్మక్కయ్యారు. ఫిలిప్పీయన్స్, దుబాయ్, హాంకాంగ్, చైనాతోపాటు ఇతర దేశాల్లో ఆన్‌లైన్ గేమింగ్ నిర్వహించే వారికి బ్యాంక్ అకౌంట్లు, వ్యాపారుల ఐడీలను అందిస్తు న్నారు. తద్వారా పెద్దఎత్తున కమీషన్లు తీసుకుంటు న్నారు. ఆన్‌లైన్ గేమింగ్‌లో సోమాజిగూడకు చెందిన ఓ వ్యాపారిని మోసం చేయడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు.. నిందితుడు హితేశ్ గోయల్‌ను ఢిల్లీలో అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.1.40కోట్లు, 23సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్స్, 52డెబిట్ కార్డులతో పాటు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

కమీషన్ల మీద బ్యాంక్ అకౌంట్స్ అందజేత

మరో ఘటనకు సంబంధించి.. గోవాకు చెందిన రోనక్‌తన్నా నాగ్‌పూర్‌లో నివాసముంటున్నాడు. దుబాయ్ నుంచి ఆన్‌లైన్ మోసాలకు పాల్పడే వారికి బ్యాంక్ అకౌంట్స్ పంపిస్తున్నాడు. అందుకు రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు కమీషన్లు తీసుకుంటున్నాడు. ఆ తర్వాత 'యూనిటీ స్టాక్స్' పేరుతో నకిలీ సంస్థను సృష్టించాడు. యూనిటీ స్టాకకు చెందిన షేర్స్ కొనుగోలు చేస్తే సులువుగా డబ్బులు సంపాదించొచ్చని, 30శాతం రిటన్స్ వస్తాయని ఇన్వెస్టర్లను నమ్మించాడు. ఇలా దేశవ్యాప్తంగా మోసాలకు పాల్పడుతున్నాడు. ఇదే తరహాలో నగరానికి చెందిన ఓ మహిళను నమ్మించిన నిందితుడు రూ.3 కోట్ల 16 లక్షల 34764లు ఇన్వెస్ట్ చేయించాడు. వాటిని తన బ్యాంక్‌కు మళ్లించుకుని మోసం చేశాడు. గుర్తించిన బాధితురాలు సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితున్ని అరెస్టు చేశారు. నిందితుడి ఖాతాలోని రూ.20లక్షలను ఫ్రీజ్ చేశారు. అతనికి సహకరించిన జుడిత్ గోన్సాల్వెస్, సనా మొహ్మద్ ఖురేషికి కూడా నోటీసులు జారీ చేశారు. నిందితుడు 95 బ్యాంక్ ఖాతాలు వాడుతున్నట్టు సీపీ తెలిపారు. అతనిపై ఇతర రాష్ట్రాల్లో పలు కేసులున్నట్టు చెప్పారు.

కొడుకు మృతి.. తట్టుకోలేక తల్లి..

గంట వ్యవధిలోనే ఇద్దరూ..

- కూచన్‌పల్లిలో తీవ్ర విషాదం



నవతెలంగాణ- హవేలీ ఘనాపూర్

గుండెపోటుతో కొడుకు మెదక్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతిచెందగా.. ఆ విషయం తెలిసి తల్లడిల్లి తల్లి అక్కడే కుప్పకూలిపోయింది. ఈ ఘటనతో శనివారం హవేలీ ఘనాపూర్ మండల పరిధిలోని కూచన్‌పల్లి గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కూచన్‌పల్లి గ్రామానికి చెందిన వీరప్పగారి నరసింహగౌడ్(38) ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు.

అతడికి తల్లి లక్ష్మి(52), భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శనివారం ఉదయం 3 గంటల సమయంలో ఛాతిలో నొప్పి వస్తుందని నరసింహగౌడ్ చెప్పడంతో కుటుంబీకులు ఆస్పత్రికి వెళ్దామంటూ.. చిన్న నొప్పే అంటూ పడుకున్నాడు. అయితే, కొద్ది సేపటికి పిలిస్తే అతనిలో చలనం లేదు. కుటుంబీకులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. ఆ తర్వాత తల్లి లక్ష్మి మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లింది. బెడ్డుపై విగతజీవిగా కుమారున్ని చూసి బోరున విలపించిన తల్లి అక్కడే కుప్పకూలింది. పరీక్షించిన వైద్యులు ఆమె కూడా చనిపోయినట్టు చెప్పారు. దీంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో కూరుకుపోయింది. భర్త, అత్త ఇద్దరూ ఒకేసారి మృతిచెందడంతో నర్సింహగౌడ్ భార్య కన్నీరుమున్నీరవుతోంది. ఒకే కుటుంబంలో తల్లీకొడుకు మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట సర్పంచ్ దేవ గౌడ్ తదితరులు ఉన్నారు.

కమ్యూనిస్టు నేత మహారాణి కోనార్ కన్నుమూత

- బర్ధ్వాన్ మెడికల్ కాలేజీకి భౌతిక కాయం అందజేత
- అరుణాంజలి ఘటించిన పార్టీ నేతలు, కార్యకర్తలు

న్యూఢిల్లీ : ప్రముఖ కమ్యూనిస్టు నేత, అంగన్‌వాడీల సమాఖ్య వ్యవస్థాపక నేత మహారాణి కోనార్ శుక్రవారం పశ్చిమ బెంగాల్‌లోని బర్ధ్వాన్‌లో కన్నుమూశారు. ఆమె వయసు 90సంవత్సరాలు. 1933 నవంబరు 23న జన్మించిన మహారాణి కోనార్ 1958లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. బర్ధ్వాన్ జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ, వామపక్ష ఉద్యమాన్ని అభివృద్ధిపరచడంలో కీలక పాత్ర పోషించారు. బెంగాల్‌లో ఐద్వా కీలక నేతల్లో ఒకరిగా మారారు. కిసాన్ ఉద్యమ నేత బినయ్ కోనార్‌ను ఆమె వివాహం చేసుకున్నారు. ప్రముఖ కమ్యూనిస్టు నేత హరే కృష్ణ కోనార్ ఆమె బావగారు.

బర్ధ్వాన్‌లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో మహారాణి కోనార్ భౌతిక కాయాన్ని వుంచారు. రాణిదీగా పిలుచుకునే వేలాదిమంది పార్టీ కార్యకర్తలు, అభిమానులు తమ ప్రియతమ నేతకు ఘనంగా నివాళులర్పించారు. బర్ధ్వాన్ జిల్లా సిపిఎం కమిటీ తరపున అంజు కర్, అనాది సాహు, అమల్ హల్దార్, అచింత్య మాలిక్, సయ్యద్ హుస్సేన్, గౌతమ్ ఘోష్, దీపంకర్ చక్రవర్తి, బలరాం చటర్జీ ప్రభృతులు అరుణ పతాకాన్ని కప్పి ఆమెకు అంజలి ఘటించారు. అనంతరం ఆమె భౌతిక కాయాన్ని బర్ధ్వాన్ మెడికల్ కాలేజీ అధికారులకు అందజేశారు.

70వ దశకంలో పశ్చిమ బెంగాల్‌లో నెలకొన్న భయోత్పాతక వాతావరణంలో సంఘటిత ప్రజా ప్రతిఘటనకు ఆమె ఒక ఆశాకిరణంగా మారారు. తన ప్రాణాలకు ముప్పు వున్నప్పటికీ లెక్క చేయకుండా ఆమె పార్టీ నేతలకు, కార్యకర్తలకు తన ఇంట్లో ఆశ్రయం కల్పించారు. ఫ్యూడల్ భూస్వాములకు వ్యతిరేకంగా ఎఐకెఎస్ నేతృత్వంలో బర్ధ్వాన్ జిల్లాలో ఆమె వీరోచిత రైతాంగ ఉద్యమంలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను సంఘటితపరచడంలో ఆమె క్రియాశీలంగా పాల్గొన్నారు. ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్ వ్యవస్థాపక నేతల్లో ఆమె ఒకరు. పశ్చిమ బెంగాల్‌లో ఐసిడిఎస్ వర్కర్ల యూనియన్ ఉపాధ్యక్షురాలిగా ఆమె సుదీర్ఘకాలం పనిచేశారు. సిఐటియు పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా కూడా వున్నారు.

సీఐటీయూ సంతాపం

బెంగాల్‌లో వామపక్ష ఉద్యమానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన మహారాణి కోనార్ మృతికి సిఐటియు తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేసింది. ఆమె మృతికి సంతాప సూచకంగా పార్టీ పతాకాన్ని అవనతం చేసింది. ఆమె చనిపోయే రోజువరకు తన రాజకీయ జీవితంలో క్రియాశీలంగా వ్యవహరించారని సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ పేర్కొన్నారు. ఒక నెల రోజుల క్రితం ఆమె డివైఎఫ్ఐ పశ్చిమ బెంగాల్ నిర్వహించిన ఇన్సాఫ్ యాత్రలో పాల్గొన్నారు. కార్మికోద్యమాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలనే విషయంలో ఆమె నిరంతరంగా శ్రమించారని, ఆమె ప్రదర్శించిన నిబద్ధత, స్ఫూర్తి, అంకితభావం తరతరాల వరకు గుర్తుండిపోతాయని అన్నారు. ఆమె మృతితో కార్మికోద్యమ భావజాలం పట్ల గట్టి నిబద్ధత కలిగిన ఒక మంచి నేతను కోల్పోయామని పేర్కొన్నారు.

ఇజ్రాయిల్ మారణకాండ

- ఖాన్ యూనిస్‌లో ఇంటిపై దాడి:22మంది పాలస్తీనియన్ల మృతి

గాజా : ఖాన్ యూనిస్ నగరంలోని ఇంటిని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ బలగాలు జరిపిన దాడిలో 22మంది పాలస్తీనియన్లు మరణించారు. ఈ నగరం సురక్షిత ప్రాంతమనుకుని ఇక్కడకు తమ కుటుంబం తరలివచ్చిందని, కానీ ఇక్కడ శుక్రవారం రాత్రి జరిగిన దాడిలో తాను మినహా మిగిలిన కుటుంబ సభ్యులంతా మరణించారని 11 ఏళ్ల బాలుడు ఏడుస్తూ మీడియాకు తెలిపాడు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలేంవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఇజ్రాయిల్ బలగాలు దాడులు కొనసాగిస్తున్నాయి. అనేకచోట్ల పాలస్తీనియన్ల నుండి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోందని వార్తలందుతున్నాయి. గాజా ప్రాంతం పాలస్తీనియన్లకు మృత్యుకుహరంలా మారిందని ఐక్యరాజ్య సమితి మానవతా కార్యకలాపాల విభాగం చీఫ్ వ్యాఖ్యానించారు. హమస్ డిప్యూటీ నేత అల్ అరౌరి మృతికి కారణమైన ఇజ్రాయిల్ దాడిపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో లెబనాన్ అధికారికంగా ఫిర్యాదు నమోదు చేసింది. గాజాలో పౌరులపై ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధాన్ని తక్షణమే ముగించాలని పాలస్తీనా స్వతంత్ర మానవ హక్కుల కేంద్రానికి చెందిన న్యాయవాది బహజత్ అల్ హెలో విజ్ఞప్తి చేశారు. రాఫా నగరం నుంచి ఆయన మాట్లాడుతూ పాలస్తీనియన్లుగా అత్యంత క్లిష్టమైన, బాధాకరమైన పరిస్థితుల్లో జీవిస్తున్నామన్నారు. 20లక్షల మందికి పైగా ప్రజలు బందీలుగా వున్నారని అన్నారు.

ఇజ్రాయిలీ బలగాల విచక్షణారహిత దాడులతో రోజూ చావు అంచుల వరకు వెళుతున్నామని అన్నారు. ఇంత జరుగుతున్నా ప్రపంచం నోరెత్తకుండా మౌనం పాటించడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్‌ను జవాబుదారీ చేసేలా ఒక్క చర్య కూడా తీసుకోవడంలో యావత్ ప్రపంచ దేశాలు విఫలమయ్యాయని అన్నారు. గాజాలో చిన్నారులందరూ తీవ్రమైన పోషకాహార లోపానికి గురవుతున్నారని, తీవ్ర స్థాయిలో భయకంపితులవుతున్నారని యునిసెఫ్ పేర్కొంది. ప్రస్తుతం నెలకొన్న మానవతా సంక్షోభంలో ప్రధాన బాధితులు చిన్నారులేనని యునిసెఫ్ ప్రతినిధి టెస్ ఇన్‌గ్రామ్ వ్యాఖ్యానించారు.

కొత్తవి లేకపోగా.. ఉన్నవాటిని ఊడబీకేస్తున్నారు...

- మాజీ మంత్రి కడియం
- దళితులకు అన్యాయం చేయొద్దంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అధికార కాంగ్రెస్ రాష్ట్రంలో కొత్త పథకాలను ప్రారంభించకపోగా.. బీఆర్ఎస్ హయాంలో ఉన్న వాటిని కూడా ఊడబీకేస్తోందని ఆ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆవేదన వ్యక్తం చేశారు. గృహలక్ష్మి పథకం రద్దుతో లక్షలాది మంది లబ్దిదారులు నష్టపోతున్నారంటూ ఆయన వాపోయారు. పెద్దపల్లి పార్లమెంటు సన్నాహక సమావేశం అనంతరం శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి తాము వ్యతిరేకం కాదనీ, కానీ గృహలక్ష్మిని ఎత్తేయటం మాత్రం దారుణమని విమర్శించారు. సంబంధిత లబ్దిదారులను ఇందిరమ్మ ఇండ్ల పథకంలో చేర్చనైనా చేర్చండి, లేదంటే గృహలక్ష్మి పథకాన్ని యథావిధిగా కొనసాగించండి అని సూచించారు. దళితబంధు లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయిన తర్వాత... ఇప్పుడు ఆ పథకాన్ని ఆపాలంటూ ఉత్తర్వులివ్వటం సరికాదన్నారు. ఆ స్కీము కింద ఇచ్చే సాయాన్ని పెంచుతామని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు ఏకంగా దాన్ని ఎత్తేయటం దారుణమన్నారు. సమీక్షలకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ కనీస హోం వర్క్ చేయటం లేదని విమర్శించారు. ఆయనకు ఎవరు బ్రీఫింగ్ ఇస్తున్నారో తెలియటం లేదని ఎద్దేవా చేశారు. ఫార్మాసిటీ, మెట్రో రైలుపై సీఎం వైఖరి కొన్ని రోజుల్లోనే మారిపోయిందని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ... పెద్దపల్లి పార్లమెంటు స్థానంలో ఈసారి కచ్చితంగా గులాబీ జెండా ఎగరటం ఖాయమన్నారు. సుమారు ఏడు గంటలపాటు నిర్వహించిన సమీక్షా సమావేశంలో వచ్చిన అభిప్రాయాలను అధినేత కేసీఆర్ దృష్టికి తీసుకుపోతామని వివరించారు. రెవెన్యూ తదితర శాఖల్లో కీలక పోస్టింగులను సీఎం రేవంత్ సోదరులే నిర్ణయిస్తున్నారని ఆరోపించారు. ఆయన మనుషులే హైదరాబాద్ చుట్టుపక్కల విచ్చలవిడిగా లేఅవుట్లు వేస్తున్నారని విమర్శించారు. విలేకర్ల సమావేశంలో పెద్దపల్లి ఎంపీ నేతగాని వెంకటేశ్, ఎమ్మెల్సీ భానుప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల భాగస్వామ్యంతోనే విజయపథంలో సంస్థ

- ఆర్టీసీ ఎండీ సజ్జనార్
- మియాపూర్ డిపోలో వనభోజనం



నవతెలంగాణ-మియాపూర్

ఆర్టీసీ ఉద్యోగులందరినీ సేవలు, భాగస్వామ్యంతోనే సంస్థ విజయపథంలో నడుస్తోందని ఎండీ సజ్జనార్ అన్నారు. ఉద్యోగుల సేవలు అభినందనీయమని కొనియాడారు. రంగారెడ్డి జిల్లా మియాపూర్ బస్ డిపో-2 ఉద్యోగులతో కలిసి శనివారం వనభోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెండేండ్ల నుంచి మియాపూర్ డిపో ఉద్యోగులు కలిసికట్టుగా మంచి పనితీరు కనబరుస్తున్నారని చెప్పారు. గతేడాది డిపోకు అవార్డులు కూడా వచ్చాయన్నారు.

గతంలో కంటే ప్రస్తుతం నగరంలో ట్రాఫిక్ పెరిగిందని, రద్దీ రోడ్లలో కూడా డ్రైవర్లు ఎలాంటి తప్పులూ చేయకుండా నడపడం సంతోషకరం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళలకు ఉచిత ప్రయాణం పథకంతో కండక్టర్లు ఒత్తిడికి గురవుతున్నా.. అధిగమించి పనిచేస్తున్నారని కొనియాడారు. ఆర్టీసీ ఉద్యోగులు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. మహిళలందరూ ఒరిజినల్ ఆధార్ కార్డును వెంట తెచ్చుకోవాలని, కండక్టర్లకు సహకరించాలని కోరారు. వనభోజనం చేయడం చాలా సంతోషంగా, పండుగలా ఉందన్నారు. అనంతరం ఉత్తమ సిబ్బందికి ప్రోత్సాహకాలు అందజేశారు.

అమ్మా జాగ్రత్త.. నన్ను క్షమించు..

- ఆన్‌లైన్ గేమ్‌కు బానిసై విద్యార్థి ఆత్మహత్య

నవతెలంగాణ-బంజారాహిల్స్

'ఐ లవ్ యూ అమ్మ.. నువ్వు జాగ్రత్త.. నన్ను క్షమించు' అంటూ సందేశం పంపి డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడలో తల్లి జయమ్మతో కలిసి నివాసముంటున్న అఖిల్(21) డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతు న్నాడు. అతను పబ్జీ గేమ్‌కు బాగా అలవాటు పడ్డాడు. మూడు నెలలుగా కాలేజీకి కూడా వెళ్లకుండా గేమ్‌కు బానిసయ్యాడు. బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అఖిల్ స్నేహితులతో కలిసి తిరిగాడు. అనంతరం ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో తల్లి బయటకు వెళ్లింది. 'అమ్మ ఐ లవ్ యూ.. నువ్వు జాగ్రత్త' అంటూ తల్లికి ఫోన్‌లో సందేశం పంపించాడు. ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి ఇంటికి వచ్చేసరికి లోపలికి నుంచి డోర్ లాక్ చేసి ఉండటంతో వాచ్‌మెన్ సహాయంతో ఆమె తలుపులు తీసి లోపలికి వెళ్లి చూడగా అఖిల్ ఉరేసుకుని కనిపించాడు. వెంటనే నిమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. 2018లో అఖిల్ నాన్న చనిపోయాడు. ఇక కొడుకే సర్వస్వంగా బతుకుతున్న తల్లి ఇప్పుడు ఒంటరైంది.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం- చార్మినార్
ఆదివారం | జనవరి 07, 2024 | www.navatelangana.com

ఎల్బీనగర్ డీసీపీగా ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ-హయత్ నగర్
రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ జోన్‌కు నూతన డీసీపీగా సీహెచ్.ప్రవీణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇతను గతంలో నిర్మల్ జిల్లా ఎస్పీగా పనిచేశారు. ఎల్బీనగర్‌లో డీసీపీగా పని చేసిన సాయిశ్రీ ఈస్ట్ జోన్ డీసీపీగా బదిలీపై వెళ్లారు. నూతన డీసీపీ కమిషనర్ సుధీర్ బాబును మర్యాద పూర్వకంగా కలిశారు. తర్వాత పుష్పగుచ్ఛం అందజేశారు.

బ్లాంకెట్స్ అందజేసిన పెండెం కృష్ణ కుమార్



నవతెలంగాణ - చైతన్యపురి
దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట, మన్సూరాబాద్, నాగోల్, మలక్‌పేట, కోటి, అబిడ్స్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నిద్రిస్తున్న వారికి శనివారం బ్లాంకెట్‌లను గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్, రచయిత, ప్రముఖ కళాకారులు, సోషల్ వర్కర్ డాక్టర్ పెండెం కృష్ణ కుమార్ ఉచితంగా అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా బ్లాంకెట్స్ అందజేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని చెప్పారు.

'తల్లిదండ్రుల బాగోగులు చూడడం కనీస బాధ్యత'



- నిరుపేదలకు, అనాథలకు బియ్యం పంపిణీ చేసిన దోసపాటి రాము

నవతెలంగాణ - ఎల్బీనగర్
తల్లీదండ్రుల బాగోగులు చూడడం బిడ్డల కనీస బాధ్యత అని రైస్ ఏటీఎం ఫౌండర్ దోసపాటి రాము అన్నారు. ఎల్బీనగర్‌లోని రైస్ ఏటీఎం దగ్గర ఆసరా లేని వారికి శనివారం బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుండి నిరుపేదలకు, అనాథలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ రోజు రెండు వందల మందికి ఉచితంగా బియ్యం అందజేసినట్లు చెప్పారు. చాలా మంది తమ తల్లీదండ్రులను పట్టించుకోకుండా రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే పెన్షన్ మందులకు సరిపోక ఆకలికి చచ్చి పోతామేమో అనే భయంతో, దిక్కుతోచక రైస్ ఏటీఎం దగ్గరకు వస్తున్నారని అన్నారు.
ఎల్బీనగర్‌లోని రాకొహిల్స్ కాలనీ లో ఉన్న రైస్ ఏటీఎం దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్కరి కష్టాలు తెలుసుకొని..వారికి కావాల్సిన సాయం చేస్తున్నా మని పేర్కొన్నారు. మూడు సంవత్సరాల నుండి వేల మందికి కుట్టు మిషన్స్, టిఫిన్ సెంటర్ సామాను, ఇస్త్రీ పెట్టలు, తోపుడు బండ్లు ఉచితంగా ఇచ్చి, ఉపాధి కల్పించినట్లు వివరించారు. కరోనా సమయంలో, వరదలు వచ్చినప్పుడు బియ్యం, కూరగాయలు, పాలు, బ్రేడ్, బిస్కెట్స్‌ను పంపిణీ చేసినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో యశ్విని జొన్నలగడ్డ, రాఘవేంద్ర, కరణ్, రాకేష్ పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీకి జాతీయ అవార్డు



నవతెలంగాణ-సిటీబ్యూరో
నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో జీహెచ్ఎంసీకి ప్రతి యేటా స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు దక్కించుకుంటుంది. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను జీహెచ్ఎంసీకి వివిధ విభాగాలలో ప్రతి ఏటా అవార్డును పొందుతున్నది. స్వచ్ఛ సర్వేక్షణ్-2023 లో జాతీయ అవార్డుకు ఎంపిక అయ్యింది. అందుకోసం గత నెల డిసెంబర్ 23వ తేదీ నుండి పది రోజుల పాటు క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాన్ని సేకరించారు. 2024 జనవరి 11వ తేదీన న్యూఢిల్లీలో కేంద్ర గృహ పట్టణాభివృద్ధి వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా జాతీయ స్థాయి అవార్డును అందించనున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీకి ఇన్విటేషన్‌ను పంపించింది. స్వచ్ఛ సర్వేక్షణ్ -2023 అవార్డులో భాగంగా ఒక లక్ష కంటే ఎక్కువ జనాభా ఉన్న సిటీలను (నేషనల్ ర్యాంకింగ్), ఒక లక్ష కంటే తక్కువ ఉన్న జనాభా సిటీ (స్టేట్ అండ్ జోనల్ ర్యాంకింగ్) లో ఎంపిక చేసి అవార్డు ప్రదానం చేస్తారు.
జీహెచ్ఎంసీకి వాటర్ ప్లస డ్రైయిన్స్ నుండి వేస్ట్ వాటర్ పర్యావరణానికి హాని కలిగించకుండా ఎస్.టి.పిల ద్వారా శుద్ధి చేసి బయటకు పంపించడం జరుగుతుంది. ఇందుకు గాను గత రెండు సంవత్సరాల నుండి వాటర్ ప్లస్ సిటీగా మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్స్ సర్టిఫై చేసి త్రీ స్టార్ హోదా ను కల్పిస్తుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ స్వచ్ఛ సర్వేక్షణ్ -2023 లో గార్బేజ్ ఫ్రీ సిటీలో ఇదివరకు త్రీ స్టార్ సిటీ ర్యాంకింగ్ జాబితాలో ఉండగా తాజాగా 5 స్టార్ రేటింగ్ పొందనున్నది. జీహెచ్ఎంసీకి స్వచ్ఛ సర్వేక్షణ్ కింద 2015 నుంచి 2022 వరకు 10 లక్షల జనాభా కంటే ఎక్కువ సిటీ జాబితాలో ర్యాంకింగ్ సాధించింది. 2022 సంవత్సరంలో గార్బేజ్ ఫ్రీ సిటీ కింద త్రీ స్టార్ హోదా ను పొందింది. తిరిగి ఈ సంవత్సరం కూడా రీ-సర్టిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకుంది.
జాతీయ స్థాయిలో జీహెచ్ఎంసీకి అవార్డు రావడం మరింత బాధ్యత పెరిగిందని జాతీయ స్థాయిలో గ్రేటర్ కు అవార్డు దక్కడంలో విశేష కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఈ సంధ్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ రోనాల్డ్ రోస్ ధన్యవాదాలు తెలిపారు.

అనాథాశ్రమంలో అన్నదానం



నవతెలంగాణ - చైతన్యపురి
అన్నదానం మహాదానమని తెలంగాణ ప్రైవేట్ అంబులెన్స్ ఓనర్స్, డైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి కాటమయ్య అన్నారు. ఈ మేరకు శనివారం కాటమయ్య తన కూతురు రమ్యశ్రీ పుట్టినరోజు సందర్భంగా.. ఆత్మీయ ఆనాథ ఆశ్రమంలో 120 మందికి అన్నదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జన్మదిన వేడుకలకు వృధా ఖర్చు చేయకుండా ఇలా అనాథల మధ్య తన కూతురు పుట్టిన రోజు జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం తన కూతురు జన్మదిన సందర్భంగా సమాజ సేవ కార్యక్రమాలు చేస్తూ వస్తున్నానని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొద్ది భాగం సమాజసేవ కోసం వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ- బడంగ్ పేట్
సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ 9వ డివిజన్‌లోని గ్రీన్ హోమ్స్ కాలనీ, 18వ డివిజన్ పరిధిలో ఉన్న సాయి నగర్ ఫేస్ 1కాలనీలలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్లు నిమ్మల సునీతా శ్రీకాంత్ గౌడ్, బండారు మనోహర్‌లతో కలిసి పరిశీలించారు.
ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. ఈ పరిశీలనలో డీఈఈ జ్యోతి రెడ్డి, ఏఈఈ వినీల్ గౌడ్, వివిధ కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా మాస్టర్ ఓరేటర్ ప్రోగ్రాం



నవతెలంగాణ- సంతోష్ నగర్
చంపాపేట్ డివిజన్ చంపాపేట్ బ్రాంచ్ నారాయణ ఈ టెక్నో పాఠశాలలో శనివారం మాస్టర్ ఓరేటర్ వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందోత్సవాలతో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నారాయణ సంస్థ డైరెక్టర్ సారణి మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల నుండి ఈ కార్యక్రమం చాలా ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఆంగ్ల భాష నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఇది ఒక గొప్ప వేదిక అని పేర్కొన్నారు. ఈ వేడుకలకు బ్రాంచ్‌లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఏజీఎం హెమెంబర్, డీజీఎం గోపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ రోహిణి, అకాడమిక్ డిన్ మల్లేష్, వైస్ ప్రిన్సిపాల్ బిందు, ఏఓ గీత, విద్యార్థులు, ఉపాధ్యాయుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి
యువకుడు మృతి



నవతెలంగాణ - హయత్ నగర్
ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ దయాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా రోషన్ కాలనీ ఉట్టపల్లి నైస్ హాస్టల్‌కు చెందిన మహమ్మద్ యూసఫ్(18) తన ఇద్దరి స్నేహితులతో కలసి ఓ ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై బయలుదేరివెళ్లాడు. ఎల్బీనగర్ నుండి టీకేఆర్ కమాన్ రోడ్డు మార్గంలో వెళ్తుండగా సాగర్ రింగ్ రోడ్డు ఫ్లై ఓవర్‌పై బైక్ అదుపుతప్పి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో యూసఫ్ తీవ్ర రక్తస్రావంతో ఘటనాస్థలంలోనే మృతిచెందాడు. ఇద్దరి స్నేహితులకు గాయాలయ్యాయి. అందులో ఒకరు అక్కడి నుండి పారిపోయాడు. ప్రత్యక్ష సాక్షి అయిన శివకుమార్ పోలీసులకు సమాచారం అందించాడు. శనివారం ఉదయం ఎల్బీనగర్ పోలీసులు మహమ్మద్ యూసఫ్ తండ్రి మరుఫ్‌కు ఫోన్ చేసి వివరాలు తెలియజేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ ముజీబ్ ఆధ్వర్యంలో
'ఎంఎన్‌జే'లో అన్నదానం

నవతెలంగాణ-సిటీబ్యూరో
అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మెన్, టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని(ముజీబ్) ఆధ్వర్యంలో శనివారం ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలో 500 మంది ఇన్‌పేషెంట్ అటెండర్‌లకు పరిశుభ్రమైన ఆహారాన్ని ఏర్పాటు చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎన్‌జే ఆస్ప త్రిలో ప్రత్యేకంగా నెలలో రెండు లేదా మూడుసార్లు పేద వారికి ఆహారం అందించడం ఎంతో సంతృప్తినిస్తుందని తెలిపారు. కుటుంబం, స్నేహితులు, యూనియన్ సభ్యుల మద్దతు లేకుండా ఇది సాధ్యం కాదని చెప్పారు.
ఈ కార్య క్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కుర్రాడి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ ఖలీద్ అహ్మద్, వైదిక్ శస్త్ర, ఎంఎన్‌జే యూనిట్ సెక్రటరీ శివకుమార్, ఈఎస్ఐ రాజ్ కుమార్, మహ్మద్ చౌష్ పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు అందజేసిన
రామకృష్ణ రాధిక గౌడ్ దంపతులు



నవతెలంగాణ - చైతన్యపురి
రెడి టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన ఉచిత ఓల్డ్ ఏజ్ హోమ్‌లోని వృద్ధులకు శనివారం ప్రతిమ డెవలపర్స్ 1వ వార్షికోత్సవం సందర్భంగా..సంస్థ వ్యవస్థాపకులు మామిడి రామకృష్ణ, రాధిక గౌడ్ దంపతులు నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా మామిడి రామకృష్ణ మాట్లాడుతూ తమ సంస్థ వార్షికోత్సవం సందర్భంగా వృద్ధాశ్రమంలో సరుకులు అందజేయడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్న పెద్ది శంకర్‌ను అభినందించారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మామిడి రాధిక గౌడ్, ప్రాజెక్ట్ డైరెక్టర్స్ ఉయ్యాల పాండుగౌడ్, కానుగు శేఖర్, గాజుల గంగాధర్, ప్రతిమ గ్రూప్ ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూసీ బ్యూటిఫికేషన్‌కు ముందడుగు

- సబర్మతి, యమున రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులను అధ్యయనం చేసిన ఆమ్రపాలి
- నమామిగంగ ప్రాజెక్ట్ డీజీ అశోక్ కుమార్‌తో భేటి

నవతెలంగాణ-సిటీబ్యూరో
మూసీనది బ్యూటిఫికేషన్‌కు ముందడుగు పడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ పై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) ఆమ్రపాలి ఆధ్వర్యంలో అధికారుల బృందం గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును, యమునా రివర్‌ను సందర్శించి అక్కడి ఉన్నతాధికారులతో సమావేశమై అధ్యయనం చేశారు. జనవరి 3న ఆమ్రపాలి అహ్మదాబాద్ సందర్శించారు. శనివారం(6న) యమున ప్రాజెక్టును సందర్శించారు. ఆయా ప్రాజెక్టులకు అనుసంధానంగా ఉన్న సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)లను, వాటి సామర్థ్యాన్ని పరిశీలించారు.
ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ నమామి గంగా ప్రాజెక్టు డైరెక్టర్ జనరల్(డీజీ) అశోక్ కుమార్ ఐఏఎస్ (తెలంగాణ క్యాడర్)తో కలిసి చర్చించారు. ఆ రెండు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుల ఉన్నతాధికారులు తమ అనుభవాలను మూసీ రివర్‌ఫ్రంట్ కార్పొరేషన్ ఎండీ అమ్రపాలికి వివరించారు.
అహ్మదాబాద్ మున్సిపల్ ఉన్నతాధికారి తెన్నరసన్, సబర్మతి రివర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్(సీఈ) జగదీష్ పటేల్, జనరల్ మేనేజర్ సుశాంత్ భాటియా, నమామి గంగా ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశిష్ఠ, ఉన్నతాధికారులు ఎస్. కే.మదన్, పీయూష్ గుప్తా తదితరులతో మూసీ రివర్ ఫ్రంట్ అధికారులు సమావేశం అయ్యారు.



కాంగ్రెస్ అంటేనే ప్రజా పాలన

- చిలుక ఉపేందర్ రెడ్డి

నవతెలంగాణ - చైతన్యపురి
కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే సకలజన హితం, ప్రగతి పథ ప్రజా ప్రభుత్వం, ప్రజా పాలన అని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్ సౌభాగ్య పురం కాలనీ సంక్షేమ సంఘం భవనంలో ప్రజా పాలనలో భాగంగా ఆఖరి రోజున శనివారం దరఖాస్తుదారులకు వచ్చిన సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల లోపు ఆరు గ్యారెంటీ పథకాల అమలుకు కార్యాచరణ చేపట్టడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా హామీలన్నీ అమలు చేసి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సెక్రటరీ నరసింహారెడ్డి, చంద్రశేఖర్,వంగాల శ్రీకాంత్, ప్రభుత్వ అధికారులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని హైటెక్ స్కూల్‌లో మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, టీచర్లు కంటి, చెవి, ముక్కు, గొంతు, పళ్ళు, థైరాయిడ్, చర్మ సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 350 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ బాబు రావు, డాక్టర్లు అనుదీప్, పృథ్వీ, కౌశిక్, ఆదిత్య, హర్షవర్ధన్, వెంకటస్వామి, విష్ణుప్రియా, నవీన్, నిఖిత, మార్కెటింగ్ ఇన్‌చార్జి కుమారస్వామి, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

సురేష్ రెడ్డి ఆశీస్సులు తీసుకున్న పీఏ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

130 సుభాష్ నగర్ డివిజన్ కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి సంజీవ్ పీఏ సంజీవ్ కుమారుడి పుట్టినరోజు సందర్భంగా మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డిని కుటుంబ సమేతంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. శనివారం కార్పొరేట్ కార్యాలయంలోని తన నివాసంలో కలిశాడు. సంజీవ్ కుమారుడికి సురేష్ రెడ్డి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి, ఆశీర్వదించాడు. ప్రజా శ్రేయస్సు కోసం పరితపించే నాయకుడు సురేష్ రెడ్డి ఆశీస్సులు తీసుకోవడం తన కుమారుడి అదృష్టంగా భావిస్తున్నానని సంజీవ్ అన్నారు. జీఎస్ఆర్ టీం సభ్యులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

శ్రీ సోమవంశ సహస్రార్జున క్షత్రియ సమాజ్ వారి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆయన ఇంటి వద్ద శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, శ్రీ సోమవంశ సహస్రార్జున క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు సూర్య ప్రకాష్ రతన్, ప్రధాన కార్యదర్శి సర్వేశ్, మన్మోహన్, ఎ.రాంచందర్ షా, ఆర్.విశాల్, రాజ్ కుమార్, శంకర్, వి.విశాల్ కుబీర్ శామ్ మహర్, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో బండారికి సన్మానం



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ వారి సమస్యలను ఎమ్మెల్యేకు వినతిపత్రం రూపంలో అందజేశారు. అనంతరం బండారి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌కు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. వారి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, సీనియర్ సిటిజన్స్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌కు హాజరైన కార్పొరేటర్ ప్రభుదాస్



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని తిరుమలానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు, సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పోటీల్లో గెలిచిన వారితో పాటు పోటీల్లో పాల్గొన్న విద్యార్థినీలందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. విద్యతో పాటు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంతో వారిలోని ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాకేష్, అనితరాణి, అరుణాదేవి, గాయత్రి, సరిత, హరిశ్చంద్, సిబ్బంది, స్థానిక నాయకులు గడియారం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధికే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది



- కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్

నవతెలంగాణ-కీసర

పేదల బాగు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శనివారం మేడ్చల్ నియోజకవర్గం దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని బండ్లగూడలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తు స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, బడుగు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ స్కీంలు ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి ఒక్కరూ అభయహస్తం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సామల శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ యాదగిరి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో అభివృద్ధికి సహకరించాలి



- కార్పొరేటర్ బన్నాల గీత

నవతెలంగాణ-ఉప్పల్

అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి సహకరించాలని కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. శనివారం చిల్కానగర్ డివిజన్‌లోని కల్యాణపురి, సీతారామ కాలనీలో జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్ అధికారులతో కలిసి పర్యటించారు. నూతనంగా వేయించిన మంచినీటి పైప్‌లైన్‌తో దెబ్బతిన్న సీసీ రోడ్లను పరిశీలించారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కార్పొరేటర్‌కు పలు చౌరస్తాల్లో జంక్షన్లు ఏర్పాటు జాప్యం అవుతుందని, మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటుతో దెబ్బతిన్న సీసీరోడ్లకు మరమ్మత్తులు చేయించాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గీతాప్రవీణ్ మాట్లాడుతూ.. కాంట్రాక్టర్‌తో మాట్లాడి జంక్షన్లు ఏర్పాటు చేయాలని జలమండలి ఏఈ ఆసిఫ్ అలీని ఆదేశించారు. జీహెచ్ఎంసీ ఏఈ రాజకుమార్‌కు నూతన సీసీ రోడ్లకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. కల్యాణపురి, సీతారామ కాలనీల్లోాలనీలో నూతన పైప్ లైన్ వేయించినందుకు కాలనీ అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ రాజ్ కుమార్, జలమండలి ఏఈ ఆసిఫ్ అలీ, వర్క్ ఇన్స్‌స్పెక్టర్ కేదార్, కల్యాణపురి అధ్యక్ష కార్యదర్శులు, శివరామరాజు, వికాస్, శశి, ఎంకేకే పిలయి, రామ్‌కోఠి, ప్రేమ్‌రాజ్, మాసూమ్, శ్రీనివాస్ రెడ్డి, దశరథ్, బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎదుల కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోకుండా జగన్, రామాంజనేయులు, నరేష్ గౌడ్, శ్యామ్, బాలు తదితరులున్నారు.

ఒకవైపు కూల్చివేతలు .. మరోవైపు నిర్మాణాలు

- ప్రభుత్వ స్థలాల్లోని నిర్మాణాలపై తూతూ మంత్రంగానే చర్యలు
- కూల్చివేతలకు జంకుతున్న రెవెన్యూ యంత్రాంగం..!



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూముల కబ్జాలపై రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోంది. సర్వే నంబర్ 63/ 26 నుంచి 63/ 30 వరకు ఉన్న ప్రభుత్వ భూమిలో కొన్ని రోజులుగా సాగుతున్న కబ్జాలను అడ్డుకోవడంలో, చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనుకంజ వేయడం వెనుక పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ అధికారులు కబ్జాదారులతో కుమ్మక్కు కావడంతోనే మౌనం వహిస్తున్నారన్న ప్రచారం జోరుగా జరుగుతోంది. ప్రభుత్వభూముల కబ్జాలపర్వం వెనుక రెవెన్యూ అధికారులకు భారీ ఎత్తున ముడుపులు అందడం వల్లనే కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాదారుల కబంధ హస్తాల్లోకి వెళ్లతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక వైపు ప్రభుత్వ భూములను కాపాడాలంటూ జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలను జారీ చేసినా మేడిపల్లి రెవెన్యూ అధికారులు పెడచెవిన ఎడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. కొంతమంది దళారులు అధికారులకు, కబ్జాదారుల మధ్యవర్తిత్వం వహించి కోట్ల విలువైన భూములను అప్పనంగా దారాదత్తం చేస్తున్నారు. అధికారుల అండ పూర్తిస్థాయిలో ఉండటం వల్లనే కబ్జాదారులు మరింత బరితెగించి కబ్జాలకు పాల్పడుతున్నారు. కబ్జాలకు సంబంధించి రెవెన్యూ అధికారులకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నా వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా కబ్జాదారులకు అన్ని విధాలుగా వత్తాసు పలుకుతుండటం గమనార్హం. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూమిని గుర్తించి వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని అప్పటి జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఆదేశాలను తుంగలో తొక్కిన మేడిపల్లి రెవెన్యూ అధికారులు కబ్జాదారులను ప్రోత్సహించడంపై ఎద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ భూములను తమ సొంత ఆస్తుల్లా కబ్జాదారులకు అప్పగించడంలో అధికారుల పాత్ర అధికంగా ఉండటం వల్ల ఖాళీ స్థలం కనిపిస్తే చాలు ఆక్రమించడానికి కబ్జాదారులు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల బోడుప్పల్‌లో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములన్నీ అన్యాకాంతమైనా ఇంతవరకు వాటిని పరిరక్షించిన పాపాన పోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను కాపాడేందుకు ప్రయత్నిస్తున్న రెవెన్యూ అధికారులను కబ్జాదారులు బరితెగించి బెదిరింపులకు గురి చేస్తున్నట్లు తెలిసింది. అందుకే అధికారులు భూకబ్జాలను తొలగించడానికి జంకుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. మరోవైపు భూకబ్జాల వెనుక అధికారులకు భారీ ఎత్తున ముడుపులు స్వీకరించడం వల్లనే ఆక్రమణలను తొలగించే ప్రయత్నాలు చేయడం లేదనే ప్రచారం జరుగుతోంది. భూకబ్జాలు జరుగుతున్నట్లు అధికారులకు స్పష్టంగా తెలిసినా వాటిని పరిరక్షించడంలో ఎందుకు వెనుకంజ వేస్తున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై ఎమ్మార్వో షేక్ హసీనాను వివరణ కోరగా కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి సిఫారసు చేస్తామని తెలిపారు.



ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

నవతెలంగాణ-శామీర్‌పేట

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య డాక్టర్లకు సూచించారు. శనివారం మూడు చింతలపల్లి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆస్పత్రి విశాలంగా ఉందని పేర్కొన్నారు. ఆస్పత్రిలోని నూతన సేవల వివరాలను ఆరోగ్య అధికారి డాక్టర్ దామయంతిని అడిగారు. దానికి ఆమె స్పందిస్తూ పూర్తి వివరాలను ఎంపీడీవోకు అందజేశామని తెలిపారు. ఆస్పత్రికి బీపీ, షుగర్ పేషెంట్లు ఎక్కువగా వస్తున్నారని కలెక్టర్‌కు తెలిపారు. చలికాలంలో సీజనల్ వ్యాధులు జలుబు, దగ్గు, జ్వరం వచ్చినవాళ్ళు వస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో నారాయణరావు, డాక్టర్ కౌశిక్, స్థానిక సర్పంచ్ జాము రవి, తదితరులు పాల్గొన్నారు.



విద్యాసంస్థల్లో మతపరమైన కార్యక్రమాలు సరికాదు

- వెంటనే నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి
- స్కూల్ చైర్మెన్ మల్క కొమరయ్యపై చర్యలు తీసుకోవాలి
- ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్



నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యా సంస్థల్లో మతపరమైన కార్యక్రమాలు నిర్వహించడం సరికాదని ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ అన్నారు. మతపరమైన కార్యక్రమాలు నిర్వహించిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మెన్ మల్క కొమరయ్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మతపరమైన కార్యక్రమాలు చేపట్టడం సరికాదన్నారు. విద్యా సంస్థలు అంటే సెక్యులర్ సంస్థలుగా ఉండాలని, శాస్త్ర సాంకేతిక రంగాలకు ప్రోద్బలంగా ఉండాలని, విద్యార్థుల్లో జిజ్ఞాసను, ఆసక్తిని పెంచే కార్యక్రమాలు చేపట్టాలి కానీ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మెన్ మల్క కొమరయ్య ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. మతం ప్రజల వ్యక్తిగత విశ్వాసాలకు సంబంధించిందని, దాన్ని రాజకీయంగా వాడుకోవడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణాన్ని కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కూడా ఇలాగే తన రాజకీయ అవసరాల కోసం వాడుకుంటుందన్నారు. ఒకవైపు దేశంలో ఆకలి, అసమానతలు, నిరుద్యోగం, అధిక ధరలు ప్రజలను పీల్చి పిప్పి చేస్తుంటే వాటి గురించి కనీసం పట్టించుకోవడం లేదన్నారు. పదేండ్ల నరేంద్ర మోడీ ప్రభుత్వ హయాంలో దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసినట్టు తెలిపారు. అన్ని రంగాల్లో కార్పొరేట్ విధానాలను అమలు పరిచిందని, దేశంలోని ప్రతిష్టాత్మక రంగాలన్నింటినీ అంబానీ, అదానీ, నీరవ్ మోడీ లాంటి కార్పొరేట్, పెట్టుబడిదారులకు తాకట్టు పెట్టినట్టు తెలిపారు. వీరికే రూ.లక్షల కోట్ల రుణమాఫీ చేశారని తెలిపారు. మరో వైపు పేద ప్రజలపై పన్నుల భారాన్ని వేసి పీడిస్తున్నారనీ, దీనితో ప్రజలు కనీస అవసరాలు తీరక తల్లడిల్లిపోతున్నారన్నారు. ఈ విధానాల మీద ప్రజలు ఐక్యం కాకుండా ఉండటానికి బీజేపీ రామాలయ నిర్మాణాన్ని రాజకీయాల కోసం వాడుకుంటుందన్నారు. ప్రజలను భావోద్వేగాల్లో ఉంచడం ద్వారా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలవాలి అని తాపత్రయపడుతుందని, అందుకే ప్రజా సమస్యలు చర్చకు రాకుండా ఉండటానికి రామాలయ నిర్మాణానికి విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నారన్నారు. ఇలా చేయడం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కి వెన్నతో పెట్టిన విద్య అని, దీన్ని ప్రజలు గమనించాలని కోరారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మెన్ మల్క కొమరయ్య బీజేపీ నుంచి మల్కాజ్‌గిరి లోక్‌సభ టికెట్‌ను ఆశిస్తున్నారని తెలిపారు. ఎంపీగా గెలవడం కోసం తన విద్యాసంస్థలనే మత పీఠాలుగా మార్చుతున్నారన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎలాగైతే రామ మందిరాన్ని రాజకీయాల కోసం వాడుకుంటుందో ఇక్కడ కొమరయ్య కూడా అదే పని చేస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యా సంస్థల్లో శ్రీరాముడి కల్యాణం జరిపించారనీ, మఠాధిపతి చిన్న జీయర్‌ను సైతం ఆహ్వానించారని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరుకావాలని కోరుతున్నారని, దీనికి భారీ ఎత్తున హోర్డింగ్స్, కటౌట్స్ ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారని, దీని ద్వారా ఎంపీగా గెలుపొందడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అంతగా రాజకీయాల పట్ల ఆసక్తి ఉంటే బీజేపీ, కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిందో ప్రజలకు వివరించి పోటీ చేస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదన్నారు. అలా కాకుండా తాను రాజకీయంగా లబ్ధి పొందడం కోసం తన విద్యాలయాలను వాడుకోవడం సహేతుకం కాదన్నారు. విద్యాసంస్థలు సెక్యులర్ కేంద్రాలుగా, శాస్త్ర సాంకేతిక రంగాలకు కేంద్రాలుగా బాసిల్లే విధంగా ఉండాలని కానీ, ఇందుకు విరుద్ధంగా మతపరమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్న కొమురయ్యపై, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతిభను వెలికి తీయడానికే ఎగ్జిబిషన్



- జన్య ఫౌండేషన్ కో ఆర్డినేటర్ రమణ

నవతెలంగాణ-శామీర్‌పేట

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడానికి ఎగ్జిబిషన్ దోహదపడుతుందని జన్య ఫౌండేషన్ కో ఆర్డినేటర్ రమణ అన్నారు. శనివారం తూంకుంట మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన్య ఫౌండేషన్ అండ్ గ్లాండ్ ఫార్మా ఆధ్వర్యంలో విద్యార్థులకు సైన్స్, మ్యాథ్స్ విభాగాల్లో రంగోలి కాంపిటీషన్, సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొని సైన్స్, మ్యాథ్స్ ప్రదర్శనలు ఇచ్చారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జన్య ఫౌండేషన్ వారు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జన్య ఫౌండేషన్ కో ఆర్డినేటర్ రమణ, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీ వెంకటేశం, ఉపాధ్యాయులు మేరీ, తిరుమలేష్, నాగ శారద, అన్నపూర్ణ, వనజ, అమీన, రజినీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

'సీఆర్ఓ'లో చేరికలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

వినియోగదారుల హక్కుల సంస్థ జాతీయ అధ్యక్షులు నవీన్ శర్మ ఆదేశాల మేరకు, రాష్ట్ర అధ్యక్షులు రామగిరి హరిబాబు నాయకత్వంలో పలువురు రాష్ట్ర కమిటీలో చేరారు. ఈ సందర్భంగా రామగిరి హరిబాబు మాట్లాడుతూ మహిళా విభాగం, సికింద్రాబాద్, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్టు తెలిపారు. వినియోగదారులను రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన పరుస్తూ, వారి హక్కులకు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడైనా సరే భంగం కలిగితే తక్షణమే పరిరక్షించే విధంగా సంస్థను బలోపేతం చేస్తామన్నారు. వీలైనంత త్వరలో రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో సీఆర్ఓ కమిటీ సభ్యులు వినియోగదారుల హక్కులను పరిరక్షించేందుకు అందుబాటులో ఉండేలా చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడపర్తి శివకుమార్, వల్లాల రవి, ప్రధాన కార్యదర్శి బొద్దుల నాగేష్, రాష్ట్ర కార్యదర్శి ఆర్.రాజేష్, గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు రమేష్, మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి సంజయ్, తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు వరం



- కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ - జగద్గిరిగుట్ట

ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు వరమని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. అయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ ఆధ్వర్యంలో శనివారం డివిజన్ పరిధి మగ్దూం నగర్ కార్పొరేటర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు ఇటువంటి వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఉచితంగా షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. కార్పొరేటర్ చేతుల మీదుగా మందులు పంపిణీ చేశారు. ప్రజలకు ఉపయోగపడే ఇటువంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయం అని డాక్టర్ గీత,ఆశ వర్కర్లను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు టి.యాదగిరి జి.విట్టల్ ముదిరాజ్ పి. నరసింహ రెడ్డి, బాలు, మైలారం రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యేను కలిసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేయగా మరికొందరు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన ప్రతి ఒక్కరి సమస్యలను స్వీకరించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిరంతరం అందుబాటులో ఉంటూ పరిష్కారం కోసం పని చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

సీఐలకు శుభాకాంక్షలు తెలిపిన మహేష్ గౌడ్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి నూతన ఇన్స్‌స్పెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న డి.కృష్ణమోహన్, పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ల బదిలీల్లో భాగంగా, ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న డి.కృష్ణమోహన్ కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ పై వచ్చారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ నూతన సీఐగా, శుక్రవారం ఆయన భాద్యతలు తీసుకున్నారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న సురేందర్ గౌడ్, సీసీఎస్ మేడ్చల్ జోన్‌కు బదిలీ అయ్యారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి



- **మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు**

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

బడుగు, బలహీన వర్గాలు వారి అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు స్పష్టం చేశారు. శనివారం ఆయన మౌలాలి డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్, షఫీ నగర్ ఏరియాలలో ప్రజా పాలన కేంద్రాలను పరిశీలించి దరఖాస్తు ఫామ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అభయ హస్తం ఆరు గ్యారెంటీ పథకాలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. నేటితో గడువు ముగిసి పోయినప్పటికి, దీని తరువాత కూడా అర్హులైన పేదలు ఆయా ఫథకాలు లబ్ధి కోసం మండల కేంద్రంలో దరఖాస్తులు సమర్పించ వచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీఎస్‌వీ సతీష్ కుమార్, బి బ్లాక్ అధ్యక్షుడువెంకటేష్ యాదవ్, సత్యమూర్తి, బి కే శ్రీనివాస్, మదర్ బాయ్, అలీజాన్, సలీం, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో 11న ముగ్గుల పోటీలు



- **మహిళా సమాఖ్య కార్యదర్శి హైమావతి**

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రతియేటా కుత్బుల్లాపూర్ మండల భారత మహిళా సమాఖ్య (ఎన్.ఎఫ్.ఐ.డబ్లు) ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని మహిళా సమాఖ్య కార్యదర్శి వి.హైమావతి తెలిపారు. ఈ మేరకు శనివారం జగద్గిరిగుట్ట మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల జనవరి 11న గురువారం నాడు ఉదయం 11 గంటలకు జగద్గిరిగుట్ట సీపీఐ కార్యాలయ ఆవరణలో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో పాల్గొని జయప్రదం చేసిన్నట్లు ఈ సంవత్సరం కూడా అధిక సంఖ్యలో మహిళలు, యువతులు పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్యనాయకురాలు గోవిందమ్మ, చంద్రమ్మ, భాగ్యమ్మ పద్మలు పాల్గొన్నారు.

'ఎంఎల్‌ఆర్‌ఐటీ'లో ఏరోట్రాన్ హాకథాన్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఈ నెల 5, 6వ తేదీల్లో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో ఏరోట్రాన్ హాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల చైర్మెన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ రావు, డైరెక్టర్ మర్రి అనుశ్రేయా రెడ్డి, డీన్ డాక్టర్ వి.రాధికాదేవి, ఏరోనాటికల్ ఇంజినీరింగ్ విభాగ అధిపతి డాక్టర్ సత్యన్నారాయణ గుప్తా హాజరై ప్రారంభించారు. ఈ హాకథాన్‌లో పాల్గొనడానికి తెలంగాణలోని పలు ఇంజినీరింగ్ కాలేజీల నుంచి వచ్చిన విద్యార్థులు దాదాపు 50 గ్రూపులుగా ఏర్పడి పాల్గొన్నారు. ఈ హాకథాన్‌లో విద్యార్థులకు విమానాల తయారీకి అవసరం అయ్యే ముడిసరుకులను అందించి, విద్యార్థులతో వాటిని తయారు చేయించి ఎగురవేశారు. ఈ విమానాల తయారీ శిక్షణ శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇలాంటి శిక్షణా శిబిరాలు విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఎంతగానో ఉపయోగపడుతాయని మల్కాజి గిరి ఎమ్మెల్యే, ఎంఎల్‌ఆర్‌ఐటీ కాలేజీ ఫౌండర్ సెక్రెటరీ మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఏరోథాన్ హాకథాన్‌ను నిర్వహించిన ఏరోనాటికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ సత్యనారాయణ గుప్తా, అధ్యాపకులను, పాల్గొన్న విద్యార్థులను మర్రి రాజశేఖర్ రెడ్డి అభినందించారు. 36 గంటల పాటు జరిగిన ఈ హాకథాన్‌లో పాల్గొని మొదటి, ద్వితీయ, తతీయ స్థానంలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు సాయి కుమార్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదివితే అద్భుతాలు సృష్టిస్తారు



- **ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**
- **గాజులరామారంలో "ఇంటెల్లిటోట్స్" ప్రీ స్కూల్ ప్రారంభం**

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

విద్యార్థులకు విద్యను కష్టపడి కాకుండా అధ్యాపక బృందం ఇష్టపడి బోధించడంలో ప్రీ ప్రైమరీ స్కూల్లు కీలకంగా వ్యవహరిస్తాయని అప్పుడే వారు అద్భుత ఫలితాలు సృష్టిస్తారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. శనివారం గాజుల రామారం డివిజన్ పరిధిలోని వొక్షిత్ ఎంక్లేవ్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన "ఇంటెల్లిటోట్స్" ప్రీ స్కూల్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రోత్సహించాలని సూచించారు. ముఖ్యంగా ప్రీ ప్రైమరీ దశలో ఓపికతో సంయమనం పాటిస్తూ చదివించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. చక్కటి వాతావరణంలో పాఠశాల ఏర్పాటు చేసిన యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ చైర్మెన్ సన్న శ్రీశైలం యాదవ్, ప్యాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, సీనియర్ నాయకులు రషీద్ బేగ్, అడ్వకేట్ ఎస్.కమలాకర్, ఇబ్రహీం ఖాన్, చౌదరి, చిట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి డీసీపీగా పీవీ పద్మజా రెడ్డి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి డీసీపీగా శనివారం పీవీ పద్మజా రెడ్డి ఐపీఎస్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...శాంతి భద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదే విధంగా నేరాల నియంత్రణకు కృషి చేస్తానన్నారు. అదే విధంగా ప్రజలు కూడా నేరాలు జరిగిన సమయంలో పోలీసులకు తమవంతు సహకారం అందించాలని ఆమె కోరారు.

ప్రజలకు మెరుగైన వసతుల కల్పనే లక్ష్యం



- **కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్**

నవతెలంగాణ-బాలానగర్

డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, జీహెచ్ఎంసీ ఏఈ పవన్‌తో కలసి పర్యవేక్షించారు. ఇందులో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణం, దోభీ ఘాట్‌ల భవన నిర్మాణ పనులను వారు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అభివృద్ధి నిర్మాణ పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సకాలంలో పనులు పూర్తి చేయాలని సూచించారు. డివిజన్ పరిధిలో స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఆయా ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన వసతుల కల్పనే లక్ష్యంగా అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరేశం గుప్తా, అశోక్ రజక, ఎట్టయ్య స్వామి, సురేంద్ర నాయుడు పాల్గొన్నారు.

శ్రీను నాయక్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

డాక్టరేట్ పొందిన సబవత్ శ్రీను నాయక్‌ను శనివారం జేఎన్టీయూ బంజారా విద్యార్థి సంఘం అధ్యక్షుడు ధరావత్ వినోద్ నాయక్ ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బంజారా విద్యార్థులు మాట్లాడుతూ సబవత్ శ్రీను నాయక్ చేసిన సేవలను గుర్తించి జెఎన్టీయూ యూనివర్సిటీలో మొదటి నుంచి ఎన్నో కార్యక్రమాలు చేస్తూ బంజారా విద్యార్థుల కోసం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వినోద్ నాయక్, ఉపాధ్యక్షులు పరమేష్ నాయక్, ఆకాశ నాయక్, యాకూబ్, సంతోష్, శశి, సురేష్, విష్ణు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధికి మారుపేరుగా కూకట్‌పల్లి



- **ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అభివృద్ధికి మారుపేరుగా కూకట్‌పల్లి నియోజక వర్గంను తీర్చిదిద్దామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో డివిజన్‌కు సంబంధించిన అసోసియేషన్ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేపీహెచ్‌బీ డివిజన్‌లోని కార్పొరేటర్ డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు కూడా గెలుపులో కీలక పాత్ర వహించారని వారందరికి ఎప్పటికీ రుణపడి ఉంటానని అన్నారు. అనునిత్యం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలు తెలుసుకుని వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలు అందించి నేడు ఇకముందు కూడా పార్టీలు ఏమైనా సరే అభివృద్ధి ఎజెండాగా ముందుకు వెళతామన్నా రు. నా ప్రాణం ఉన్నంతవరకు కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలను కాపాడుకుంటానని అన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో కృషి చేస్తారని కోరారు. అనంతరం తనను రాష్ట్రంలోనే రెండవ భారీ మెజార్టీ సభ్యునిగా గెలిపించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

విశ్వబ్రాహ్మణ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్‌లో విశ్వకర్మ కార్యాలయం ప్రాంగణంలో జగద్గిరిగుట్ట డివిజన్ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ (2024) ను స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ సంఘ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ ప్రాంత విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కులస్తుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీఆర్ఎస్ యువజన నాయకులు కొలుకుల జైహింద్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, నాయకులు మల్లేష్ గౌడ్, విట్టల్ ముదిరాజ్, దాసు, బాలు, విఘ్నేష్, సంపత్ రెడ్డి, రవీందర్ చారి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు మహిళల్లో సృజనాత్మకతను పెంచుతాయి



- **జనసేన నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్**

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ముగ్గుల పోటీలు మహిళల్లో సృజనాత్మకతను పెంచుతుందని కూకట్‌పల్లి నియోజక వర్గ జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ అన్నారు. శనివారం కేపీహెచ్‌బీ రమ్య గ్రౌండ్‌లో కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఉదయం పూట ఇండ్ల ముందు ముగ్గులు వేయడం మంచి వ్యాయామమన్నారు. ముగ్గుల పోటీలు ఐక్యతకు, ఆప్యాయతకు నిదర్శనమన్నారు. సంక్రాంతి పండుగ ప్రకృతి పండుగ అని తెలిపారు. సాంస్కృతిక అంశాలు మానసిక వికాసానికి, శారీరక ఆరోగ్యానికి, ఏకాగ్రతకు ఎంతగానో దోహదపడుతాయని తెలియజేశారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ముగ్గుల పోటీలలో పాల్గొన్న వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి వీర మహిళలు ముంతాజ్, ఎర్ర సత్యా, పుష్పలత, సరోజినీ దేవి, జనసేన నాయకులు మండలి దయాకర్, కొల్లా శంకర్, కిషోర్ నాగరాజు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన 'ప్రజా పాలన'



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన కార్యక్రమం శనివారం విజయవంతంగా ముగిసింది. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించే ఈ కార్యక్రమం గత నెల 28 న ప్రారంభమైన ఈ కార్యక్రమానికి అల్వాల్ సర్కిల్‌లో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు మహాలక్ష్మి, గృహ జ్యోతి, చేయూత, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు తదితర పథకాలతో పాటు తెల్ల రేషన్ కార్డుల కోసం ప్రజలు, అధికారులకు దరఖాస్తులు సమర్పించారు. అల్వాల్ సర్కిల్‌లో పెద్ద మొత్తంలో వివిధ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. మచ్చ బొల్లారం డివిజన్ 133 లో తోట్ల కారా నా వద్ద ఏర్పాటు చేసిన ప్రజా పాలన సెంటర్‌ను శనివారం మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు,స్థానిక కార్పొరేటర్ జితేంద్ర నాథ్‌తో కలిసి పరిశీలించారు. దరఖాస్తు గడువు ముగిసి నందున ఇక నుంచి దరఖాస్తులను ఆన్లైన్‌లో పొందు పరిచే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మైనంపల్లి తెలిపారు. అయితే, ప్రజా పాలన ధరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించాలని ప్రతి పక్ష రాజకీయ పార్టీలు కోరుతున్నాయి. ఈ కార్యక్రమంలో నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, ఎస్కే అప్సర్, సర్వేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్, వివిరావు, సహదేవుడు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 22 న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా అయోధ్య నుండి అక్షింతలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డి నగర్ డివిజన్ పంచశీల కాలనీకి చేరాయి. ఈ మేరకు శనివారం కాలనీలోని శ్రీ లలిత పరమేశ్వరి దేవాలయంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 18 కళాశాలలో అక్షింతలు నింపి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నందనం దివాకర్, ఆలయ కమిటీ సభ్యులు ఎల్.నాగరాజు గౌడ్, వి.రవీందర్ రావు, పంచశీల ఫౌండేషన్ అధ్యక్షులు జింకల వెంకటేశం ముదిరాజ్, సభ్యులు,బి.వి. సూర్యనారాయణ, ఎన్.వెంకట్ రెడ్డి, పి.సతీష్ రెడ్డి, వి.ప్రతాప్ రెడ్డి, స్థానిక నాయకులు కాపా సుబ్బారెడ్డి, కేఎల్.రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



కాంగ్రెస్ స్వచ్ఛమైన పాలన అందిస్తుంది



- **కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి రమేష్**

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే విధంగా కృషి చేస్తానని కాంగ్రెస్ కూకట్ పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. శనివారం కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన చివరిరోజు భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఇందిరానగర్ పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సెంటర్లను సందర్శించి సంబంధిత అధికారులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా పాలనలో కూకట్‌పల్లి నియోజక వర్గంలో నాలుగు లక్షల దరఖాస్తులు వచ్చాయని వాటిలో ఇండ్లు లేని నిరుపేదలు, రేషన్ కార్డులు దరఖాస్తులు అధికంగా ఉన్నాయని బండి రమేష్ వెల్లడించారు. బాలానగర్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చిట్ చాట్‌లో భాగంగా విలేకరులతో మాట్లాడుతూ కూకట్ పల్లి నియోజకవర్గంలో విద్య, వైద్యం, ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయని వీటి అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సాధించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించెందుకు కృషి చేస్తానని అన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు, చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని వాటిని సైతం రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించి అక్రమ దారులపై చర్యలు తీసుకునే విధంగా పనిచేస్తామన్నారు. ప్రధానంగా మూసాపేట్ వై జంక్షన్ బోయిన్‌పల్లి వై జంక్షన్ ట్రాఫిక్ విపరీతంగా పెరిగిందని నియంత్రణ కోసం ఫ్లైఓవర్ ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు. కూకట్‌పల్లిలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు, నియోజకవర్గంలో ఇంటర్ డిగ్రీ కాలేజీలకు ప్రత్యేక భవనాలు లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నియోజకవర్గంలోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని, కాంగ్రెస్ ప్రభుత్వంలో పనిచేస్తున్నామన్న ఆలోచన కూడా లేకుండా పోయిందని మండిపడ్డారు. బాహాటంగా అక్రమాలు జరుగుతున్న సంబంధిత అధికారులు వాటిపై చర్యలు తీసుకోవడం లేదని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో పనిచేస్తున్నారా లేక కాంగ్రెస్ ప్రభుత్వంలో పనిచేస్తున్నారో అధికారం తెలుసుకోవాల్సి ఉంటుందని, కాంగ్రెస్ ప్రభుత్వం స్వచ్ఛమైన పాలన అందించాలన్న సంకల్పంతో ముందుకు వెళుతుందని, ప్రజల పక్షాన నిలబడుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేరి సతీష్ రెడ్డి, కొప్పి శెట్టి దినేష్, సునీల్ యాదవ్, ఏ బ్లాక్ అధ్యక్షులు వేణు, సంతోష్, స్వరూప, వి రాజేష్ గౌడ్, మల్లేష్ యాదవ్, నయీమ్, జి సతీష్ రెడ్డి, కర్రమ్మ, మారుతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన తడక జగదీశ్వర్ గుప్తా



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వైఎస్ఆర్సిపి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్ గుప్తా శనివారం మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పూలబొకే, శాలువతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతి



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను పూర్తిగా విడుదల చేయాలని ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఛాంబర్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ మొదటి సంవత్సరం చదువు తున్న విద్యార్థులకు జూన్‌నెలలో స్కాలర్ షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకునే విధంగా వెసులు బాటు కల్పించాలని శనివారం వినతిపత్రం అందజేశారు. పైన తెలిపిన సమస్యలను పరిష్కరి స్తారని సానుకూలంగా ప్రిన్సిపాల్ స్పందించారని ఓయూ అధ్యక్షుడు మేడి శ్రీనివాస్ పేర్కొన్నారు.

గోషామహల్ సర్కిల్ పరిధిలో 64,621 దరఖాస్తుల స్వీకరణ



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

జీహెచ్ఎంసి గోషామహల్ సర్కిల్ -14 పరిధిలో ప్రజాపాలనను 24 కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల నుంచి అభయహస్తం పథకంలో మహాలక్ష్మి, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం, చేయూత పథకాలకు 64621 దరఖాస్తులు స్వీకరించినట్లు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి బాలయ్య తెలిపారు. అభయ హస్తం పథకంలో 64621 దరఖాస్తులు స్వీకరించమన్నారు. ఇతర కొత్త రేషన్ కార్డుల కొరకు, ఇతర సమస్యలపై 14827 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. 24 సెంటర్లకు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దరఖాస్తులను స్వీకరించామని చెప్పారు. దీంతో మొదటి విడత ప్రజా పాలన శనివారం ముగిసింది అన్నారు.

అర్హులైన అందరికీ ఆరు గ్యారెంటీలు అందించాలి

● ఎమ్మెల్యే లాస్య నందిత



నవతెలంగాణ-కంటోన్మెంట్

రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ ఆరు గ్యారెంటీలు అమలయ్యేలా చూడాలని ఎమ్మెల్యే లాస్యనందిత కోరారు. శనివారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని పరిధిలోని 150వ డివిజన్ లోని పర్కిబస్తీ, డొక్కాలమ్మఆలయ ప్రాంతాల్లో ఎమ్మెల్యే లాస్యనందిత పర్యటించి, ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలించారు. ఆరుగ్యారెంటీల దరఖాస్తులకు ఆఖరిరోజు కావడంతో అధికారులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దరఖాస్తుదారు లందరికీ న్యాయం జరిగేలా చూడాలని, పథకాల విషయంలో ప్రభుత్వానికి పూర్తిగా సహ కరిస్తామన్నారు.అనంతరం కాసేపు ప్రజలతో మాట్లాడి, ఆరుగ్యారెంటీల గురించి ఎమ్మెల్యే లాస్య నందిత వివరించారు. ఏ ఒక్క అర్హుడికి కూడా అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభు త్వానిదేనని, మహాలక్ష్మి పథకంపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసి అర్హులైన మహి ళలందరికీ న్యాయం చేయా లని సూచించారు.స్థానిక వారు శాలువాతో సన్మా నించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లాస్యనందితతో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయ కురాలు నివేదిత, పార్టీ నాయకులు దాసరి కర్ణకుమార్, అజయ్, సాయిప్రసాద్, గజ్జెల గోపాల్, మహిళా నేతలు భవాని, అనిత పాల్గొన్నారు.

సోరియాసిస్ వేధిస్తుందా..!

● ఈ వ్యాధితో జాగ్రత్త అవసరం

● నిర్లక్ష్యం చేయ్యొద్దు

● డాక్టర్ కాంచన లక్ష్మి



నవతెలంగాణ-బంజారాహిల్స్

మానసిక, శారీరిక ఒత్తిడి నేటి నవీనయుగంలో ఎక్కువ కావడంతో "సోరియాసిస్" వంటి చర్మ వ్యాధుల బారిన చాలామంది పడుతున్నారని డాక్టర్ కాంచన లక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదట్లో చర్మ వ్యాధి కదా! అని నిర్లక్ష్యం చేయటం, డాక్టర్ సలహా తీసుకోకపో వటం వలన ఈ వ్యాధి మరింత జఠిలమై మానసికంగా బాధిస్తుందన్నారు. సోరియా సిస్‌ను నిర్లక్ష్యం చేయకుండా ఆరంభంలోనే ఆయుర్వేద చికిత్స తీసుకొని ఉపశమనం పొం దవచ్చునని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ వ్యాధి కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్స్ వలన, వంశ పారపర్యంగా, మానసిక ఒత్తిడి వలన, చర్మం పొడిబారడాన్ని నిర్లక్ష్యం చేయడం వలన, అధికంగా ఆల్కహాలు, పొగత్రాగడం వలన, వ్యాధి నిరోధక శక్తి తగ్గటం వలన, ఇతర వ్యాధులకు వాడే మందులు, శస్త్రచికిత్సల దుష్ప్రభావం వలన సోరియాసిస్ వస్తుందన్నారు. ఈ వ్యాధి సోకిన వారిలో చర్మం పొలుసుల మాదిరిగా రాలిపోతుంది.చర్మం దళసరిగా మారడం, నొప్పి రావటం, నీటి బుడగల వంటి పొక్కులు వచ్చి నీరు వంటి ద్రవం కారుతూ ఉంటుందన్నారు.దురద, మంట రాత్రి వేళల్లో అధికంగా ఉంటుందని, తలలో చేప పొలుసుల వలె చుండ్రు, దురద, వెంట్రుకలు రాలుట, చెవి వెనుక, చెవి లోపల లేక చెవి తమ్మె లపై, నుదిటిపై మానని పుండ్లు, పొట్టు రాలడం. అరచేతుల్లో, అరికాళ్లలో వేడితోకోసి నట్లుగా పగుళ్ల రావడం, పొట్టురా లడం. గోళ్ళు పుచ్చిపోవడం, నొప్పి, వాపు, మోకాళ్ళ నొప్పి, వా పు, మోకాళ్ళ కదలిక తగ్గి, మోకాళ్ళు వంకర పోవడం, కొం దరి లో ఎండ తీవ్రత, ఎక్కు వగా ఉన్నప్పుడు "సోరియాసిస్" తీవ్రత ఎక్కువగా కనిపిస్తుందన్నారు. కొందరిలో శీతాకాలంలో చర్మం పొడి బారిపోయిపొలుసులుగా రాలుతూ మంట, దురద ఉంటుందన్నారు. ఆల్కహాలు, పొగతాగటం, ఫాస్ట్‌ఫుడ్, ఆయిల్‌ఫుడ్స్ తీసుకోవడం మానేయా లన్నారు.ఈవ్యాధి తగ్గటానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తాజా కూరగాయలు, పండ్లు ఎక్కువగా విటమిన్"సి"ఉన్నవి తీసుకోవాలని, మాంసాహారం తీసుకోవద్దని సూచించారు. వ్యాయామం,యోగా నిత్యం చేస్తూ మానసిక ఒత్తిడిని తగ్గించాలని, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. రోజుకు నాలుగు లీటర్లు తీసుకోవడం వలన చర్మం పొడిబార కుండ ఉండి. పొలుసులు రాలకుండ ఉంటుందన్నారు. సోరియాసిస్ వంటి చర్మ వ్యాధులకు ఆయుర్వేద వైద్యం ఒకవరం లాంటిది. ఆయుర్వేద వైద్యంగా వ్యక్తి శారీరక, మానసిక స్థితి. వ్యాధి లక్షణాలను పరిగణలోకి తీసు కొని చికిత్స చేయాల న్నారు. కేఎస్ఆర్ హెర్బ్స్ యుర్వేద వైద్యం ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా సోరి యాసిస్‌ను సంపూ ర్ణంగా నయం చేయ వచ్చును. డాక్టర్ సలహాతో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ జీవనశైలిలో మార్పులు చేసుకుంటే సోరియాసిస్‌ను మరల రాకుండా అదుపు చేయ వచ్చును. ఈవ్యాధికి తగిని చికిత్సకు సలహాలు,సూచనలకు కేఎస్ఆర్ హెర్బ్స్ యుర్వేద వైద్యంప్లాట్‌నెం.8-2-248/1/7/ 26/1, ఎస్ఎన్ ఆర్స్, విష్ణుభవన్ పంజాగుట్ట, నెంబర్లు 040-42020236, 7032 312362ను సంప్రదించాలన్నారు.



నవతెలంగాణ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బోరబండ ఇన్‌స్పెక్టర్ ఎస్.విజయ్ తో కలిసి జూబ్లీహిల్స్ రిపోర్టర్ ప్రసాదరావు శనివారం ఆవిష్కరించారు.
- నవ తెలంగాణ- జూబ్లీహిల్స్



నవతెలంగాణ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను, శనివారం మధురనగర్ పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌తో కలిసి జూబ్లీహిల్స్ విలేకరి ప్రసాదరావు ఆవిష్కరించారు.
-నవతెలంగాణ- జూబ్లీహిల్స్

కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఎర్రగడ్డ డివిజన్‌లోని సుల్తాన్‌నగర్‌లో షాదీ ముబారక్, కల్యాణలక్ష్మీ కింద మంజూరైన చెక్కు లను శనివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ శాసన సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్ అందజేశారు.సుమారుగా 14 మంది లబ్ది దారులు దరఖాస్తు చేసుకున్నారని, వారందరికి రూ.1,00116/-రూ చొప్పున 14 మంది లబ్దిదారులుకు 14,01,624/-విలువ గల చెక్కులను శని వారం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు డి.సంజీవ, మహ్మద్ అజర్, జావీద్,గంటా మల్లేష్, అజీమ్, అఫ్సర్, ఎండీ సర్దార్, బాబ్జానీ, అమ్జద్, ముజ్జు, పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన ఆర్థోపెడిక్ ఎడ్యుకేషన్ సదస్సు



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

కోఠి లోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో శనివారం 22వ హైదరాబాద్ ఆర్థోపెడిక్ మెడికల్ ఎడ్యుకేషన్ హెూమ్-2024 సదస్సు రెండో రోజు కొనసాగింది. హెూమ్ చైర్మన్ డాక్టర్ వై.తిమ్మారెడ్డి మాట్లాడుతూ.. యువ పీజీలకు ఆర్థోపెడిక్‌లో ప్రస్తుత వైద్య విధానం పై అవగా హన కలిగి ఉండాలన్నారు. పలు డెమోల ద్వారా వైద్య విజ్ఞానంపై అవగాహన కల్పించారు. ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు తమ అనుభవాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో సదస్సు సమన్వయకర్తలు డాక్టర్ జి.రమేష్, డాక్టర్ ఏ కృష్ణారెడ్డి, డాక్టర్ కే చంద్రశేఖర్, సదస్సు కమిటీ సభ్యులు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రవి కిరణ్, డాక్టర్ బి సుధీర్ ,డాక్టర్.శివరాం నాయ క్ , డాక్టర్ శేఖర్, డాక్టర్ సతీష్ చంద్ర , దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పీజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడమే హనుమంతు హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ లక్ష్యం

నవతెలంగాణ-అంబర్‌పేట

పేదలకు సేవ చేయడానికి హనుమంతు హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ లక్ష్యమని చైర్మన్ అన్నం ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని పటేల్‌నగర్‌లో హెల్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రైస్‌కార్డ్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల క్రితం తన తండ్రి చనిపోయాడని, ఆ సమయంలో తాను విదేశాల్లో ఉండడంతో ఆయన కోరికలను తీర్చలే కపోయానన్నారు. గ్రీన్‌ఎల్లో బ్లూ కార్డులను ప్రవేశపెట్టి వాటి ద్వారా ఏ ఆసరాలేని వారికి సహాయం చేయడంతో పాటు విద్యాపరంగా కూడా ఆదుకుంటున్నామని చెప్పారు. ప్రతినెల నిత్యవసర సరుకులను కూడా పంపిణీ చేస్తున్నామన్నారు. అసోసియేషన్ సభ్యులు రాగుల ప్రవీణ్ పటేల్,కే. రామారావు యాదవ్, పి. శ్రీకాంత్,ఎల్ కుమార్, శివమల్లీ నాగేష్ ముదిరాజ్, కిషోర్, రాజేష్, శివ, సతీష్ పాల్గొన్నారు.

మొదటి విడత ప్రజాపాలన విజయవంతం



● లబ్దిదారులకు త్వరలోనే పథకాల అమలు

● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అదం సంతోష్ కుమార్

నవతెలంగాణ-ఓయూ

మెదటి విడత ప్రజా పాలన విజయవంతం కావడం హర్షణీయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అదం సంతోష్ కుమార్ అన్నారు. మెదటి విడత ప్రజా పాలన రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుండి విశేష స్పందన లభించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని రోజుల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం కోసం ముమ్మరంగా ప్రయత్నాలు సీఎం, డిప్యూటీ సిఎం, మంత్రులు కృషి చేస్తున్నారన్నారు. దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ ముగియడంతో ఇక వాటిలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి సామాన్యులకు ప్రభుత్వ పథకాలు చేరవేసామన్నారు. ప్రజాపాలన విజయవంతం చేసిన అధికారులకు, ఉద్యోగులకు, సిబ్బంది సంతోష్ కృతజ్ఞతలు చెప్పారు.

'శాంతిభద్రతల కోసం పత్రికలు కృషి'

నవ తెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఓయూ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్



నవతెలంగాణ-ఓయూ

నవతెలంగాణ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఓయూ ఏసీపీ సుందరి సైదయ్య, ఇన్‌స్పెక్టర్ పారుపల్లి ఆంజనేయులు, నవ తెలంగాణ నూతన క్యాలెండర్ 2024 విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి శాంతిభద్రతల సంరక్షణ కోసం ఇటు పోలీసులు అటు మీడియా కృషి చేయాలని కోరారు. నవ తెలంగాణ దినపత్రిక చేస్తున్న కృషిని ప్రశంసించారు.

'దుఃఖాన్ని మింగి ఒక్కసారి నవ్వు' గ్రంథావిష్కరణ

డా.ఎన్ గోపి



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో శనివారం తెలంగాణ బంజారా సాహిత్య అకాడమీ, తెలంగాణ ట్రైబల్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో 'దుఃఖాన్నిమింగి ఒక్కసారినవ్వు' గ్రంథావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్.గోపి పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ గ్రంథాన్ని కన్నడంలో ఆచార్య సన్న రామచౌహాన్ రాయగ దాన్ని తెలుగులో డాక్టర్ అంజన్నప్ప అనువదించినట్లు తెలిపారు. గ్రంథావిష్కరణకర్త కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ మాజీ వీసీ మాట్లాడుతూ భారతదేశంలో భార్యాభర్తల బంధం గొప్పదని, జీవిత చరమాంకంలో భార్యను కలిగి ఉండడం గొప్ప వరమని కోల్పోవడం భరించలేని వేదన అని తెలిపారు. ఆర్ట్స్ కళా శాల ప్రిన్సిపాల్ ప్రో. చింతాగణేష్ మాట్లాడుతూ. కన్నడ నుంచి తెలుగులోకి అనువదించబడిన ఆత్మకథ గ్రంథావి ష్కరణ ఆర్ట్స్ కళాశాలలో జరగడం గొప్ప విశేషం అన్నారు. ఓయూ తెలుగు శాఖ మాజీ హెడ్ ప్రో. సూర్యాధ నుం జయ్, బంజారా సాహిత్య అకాడమీ తెలంగాణ ట్రైబల్ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపకులు, తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ డా. ఎం.ధనుంజయ్ నాయక్, ఓయూ తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య కాశీం, ఓయూ కన్నడ శాఖ అధ్య క్షులు ఆచార్య లింగప్ప గోనాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తుమ కూరు విశ్వవిద్యాలయం ఆచార్య అణ్ణమ్మ పాల్గొని తన స్పందనను తెలియజేశారు. కార్యక్రమ నిర్వాహకులు నిజాం కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ భూక్యా రాజారాం నాయక్ మరియు ఉస్మానియా తెలుగు శాఖ ఆచార్యులు పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మౌంట్ బాన్యన్ గ్లోబుల్ స్కూల్ వార్షికోత్సవం"







నవతెలంగాణ- జూబ్లీహిల్స్

అమీర్‌పేట్ డీకేరోడ్డులోని జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో మౌంట్ బ్యానియన్ గ్లోబల్ స్కూల్ వార్షి కోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు ప్రెసిడెంట్ ఎంఏ ఖరీమ్, చైర్మెన్, విసడం మైన్స్ ఎడ్యుకేషనల్ సొసైటీడైరెక్టర్ మిస్. అనిస్ ఫాలం, విశేషవన్ ,ఎస్.వి.వెంకటేష్, ప్రిన్సిపల్ మిస్ దీపా విజయరంగన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో డా. వరీ వెంకటేశ్వర్లు మాజీ, ఆర్‌టీఐ చీఫ్‌కమీషనర్, ఎస్ఎ.హుడా ఐపీఎస్ (ఆర్‌ఆర్‌ఐ) రిటైర్డ్ డీజీ మీషనర్ ఆఫ్ ఇంక్ట్రెన్స్, గోర్ట్‌ఆఫ్ ఏపీ (ఆంధ్రప్రదేశ్) తదితదరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈడెన్ అకడమిక్ ఎగ్జిబి ట్‌లు, స్టాల్స్, డ్యాన్స్ సాంగ్, ఎల్ఎంఐఎస్ ప్రద ర్శనలు, టాలెంట్‌షో, తదితరల షోలు, వివిధ ప్రయోగాలలో నైపుణ్యం ఉన్న యాజమాన్యం, విద్యార్థులు సిబ్బంది గొప్ప ప్రదర్శనలతో ముగించారని డాక్టర్ వారే వెంకటేశ్వర్లు వారిని అభినందించారు. ముఖ్య అతిథులకు, పాఠశాల సిబ్బందికి, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ మిస్ దీప విజయరంగన్ ధన్యవాదాలు తెలిపారు.

పావలా శ్యామలకు ఆర్థిక సహాయం





నవతెలంగాణ-జూబ్లీహిల్స్

వృద్ధాశ్రమంలో తన కుమార్తెతో సహ జీవనం సాగిస్తున్న సీనియర్ నటి పావలా శ్యామల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ దయనీయ స్థితిని తెలుసుకుని మనం సైతం సంస్థ తెలుసుకుని వారి కుటుంబం నుంచి రూ.25,000/- ఆర్థిక సాయాన్ని కాదంబరి కిరణ్ చేతుల మీదుగా శనివారం శ్యామల కుటుంబానికి అందజేసినట్లు తెలిపారు. ఎప్పుడైనా, ఎవరికైనా, ఎక్కడైనా మనం సైతం సంస్థ ద్వారా ఆపదలో ఉన్న సినీ కార్మికులను ఆదు కుంటామని తెలిపారు.

ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలి : కార్పొరేటర్లు





నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన అవసరం మీడియాపైనే ఉందని పాలకులుగా తాము చేస్తున్న సేవలను ప్రజలకు తెలియజేయాల్సిన సేవకులు మీడియా ప్రతినిధులేనని సోమాజిగూడ కార్పొరేటర్ సంగీత శ్రీనివాస్ యాదవ్, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెంకటేశులు అన్నారు. ఈ మేరకు శనివారం వారి చేతుల మీదుగా నవ తెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నవతెలంగాణ విలేఖరి ఎం.రఘునాథ్ ప్రతినిధి, రమేష్ తదితరులు పాల్గొన్నారు. క్యాలెండర్ను వారితో కలిసి ఆవిష్కరించారు.

ఎల్ఎల్ఎం, ఎల్ఎల్‌బీ సీట్లను పూర్తి స్థాయిలో నింపాలి

● ఏఐఎస్ఎఫ్, టీఐఎస్ఎఫ్



నతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ లా పిజి కాలేజ్‌లో మిగిలిన ఎల్ఎల్‌బి, ఎల్ఎల్ఎం సీట్లను పూర్తి స్థాయిలో నింపి విద్యార్థులకు కేటాయించాలనీ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణను శనివారం కలిసి ఎఐఎస్ఎఫ్, టీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఎంతో మంది విద్యార్థులు లాసెట్ ఉత్తీర్ణత అయి ఉండి, అధికారులు సీట్లు పూర్తి స్థాయిలో నింపకపోవడం వల్ల సీట్లు కాలిగా ఉన్నాయని, ప్రయివేట్ లా కాలేజ్‌లకు స్పాట్ పర్మిషన్ ఇచ్చిన లాసెట్ కన్వీనర్ యూ నివర్శిటీలలో మిగిలిన చివరి సీట్‌ను కూడ నింపి పేద విద్యార్థులకు ఆర్థిక భారం లేకుండా చేయాలని రిజిస్ట్రార్‌ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు సత్య, లెనిన్ టీఐఎస్ఎఫ్ (తెలంగాణ ఇండిపెండెంట్ స్టూడెంట్స్ ఫెడరేషన్) నాయకులు జి.విజయ్ నాయక్, అడ్వకేట్ కరణ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఆర్ఆర్‌పురం సైట్-3 హైటెక్ హెూటల్ దగ్గర వద్ద బోరబండ సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా బోరబండలో ద్విచక్ర వాహనాలకు నెంబర్ ప్లేట్లు, లైసెన్స్‌లేని 6 వాహనాల ను పోలీం స్టేషన్‌కి తరలించారు. ఎవరైనా నంబర్ ప్లేట్లు లేకుండా, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని, జైలుశిక్ష కూడా పడుతుందని హెచ్చరించారు. బోరబండ ఇన్‌స్పెక్టర్ విజయ్ హెచ్చరించారు.

విజ్ఞాన వైజ్ఞానిక రంగాల్లో ముందున్న మహిళలు



● సైంటిస్ట్ డా.సునీలా రెడ్డి

నవతెలంగాణ-ఓయూ

మహిళలు విజ్ఞాన వైజ్ఞానిక రంగంలో ముందు ఉన్నారని ఈపీటీఐఆర్ సైన్‌టిస్టు డా.సు నీలా రెడ్డి అన్నారు. ఓయూలో మేకస్టార్ ఆడిటోరియంలో శనివారం విజ్ఞాన దర్శిని ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే 193వ, జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రెండు రోజుల మహిళ టీచర్స్‌పెస్ట్‌లో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.మహిళలు అన్ని రం గాల్లో పురోగతి చెందుతున్నారన్నారు. మహిళ సాధికారత కోసం అందరూ పాల్పడలని కోరారు. ఉపాధ్యాయులు భవిష్యత్తు బాటలు వేసే సారథులు అని అలాంటి ఉపాధ్యాయులు నేడు ఇక్కడ ఏర్పాటు చేసిన వివిధ ప్రదర్శనలో నూతన ఆవిష్కరణలతో రాణిస్తున్న తీరు హర్షణీయం అన్నారు. ఈ పెస్ట్‌లో భాగంగా మహిళలకు డ్యాన్స్, పాఠాలు, చిత్రలేఖనం, సెమినార్స్ , కవిత గానం, ఇన్నోవేషన్ టీచింగ్, లెర్నింగ్, సైంటిఫిక్ మెడల్స్ ప్రత్యేకంగా ప్రదర్శనలో ఉంచి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రల నుండి 200 మంది మహిళ టీచర్స్ పాల్గొన్నారు. కార్యక్రమని విజ్ఞానదర్శిని రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్ అధ్యక్షత వహిం చారు.కార్యక్రమంలో సైన్ టిస్టులు డా.వీరంజనేయుల, డా.ఆలీషా, తులసీ రాం, శోభ రాణి, శ్రీతేజ, స్రవంతి, జయ ప్రసాద్, మల్లికార్జున్, శివకృష్ణ, విష్ణు, తదితరులు పాల్గొన్నారు .



ఎస్ డి నగర్ కమ్యూనిటీ హాల్ కేంద్రంలో ప్రజా పాలన కార్యక్రమంలో అభయ హస్తంలో వివిధ పథకాలకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్, నాంపల్లి మండల తహసిల్దార్ ప్రేమ్ కుమార్, శిరీష, రామకృష్ణ (కట్టప్ప) జీహెచ్ఎంసి సిబ్బంది తదితరులు.
నవతెలంగాణ -సుల్తాన్ బజార్



ప్రజల మధ్యలో పుట్టిన రోజు జరుపుకోవడం ఆనందంగా ఉంది

- డా. ఎస్. గౌతమ్ రావు

నవతెలంగాణ-అంబర్‌పేట

బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎస్. గౌతమ్ రావు తన జన్మదినం సంధర్భంగా పార్టీ నగర కార్యాలయంలో ప్రజలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ తన పుట్టిన రోజును ప్రజల మధ్యలో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రతీ వ్యక్తి సమాజంలో సేవ చెయ్యడంలో ముందుకు రావాలని సూచించారు. గోల్నాకలో బీజేవైఎం ఆధ్వర్యంలో విద్యార్థులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సూర్య ప్రకాష్ సింగ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అనంతలక్ష్మి, నాగభూ షణ్ చారి, మూల రవీందర్ గౌడ్, ప్రవీణ్, ఎస్ ఎస్ రెడ్డి, శిరీష, మహేష్, ప్రవీణ్, మనోజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో లక్షల్లో దరఖాస్తులు

- విజయవంతమైన ప్రజా పాలన కార్యక్రమం

నవతెలంగాణ-సిటీబ్యూరో

TS PRAJAPALANA

Date	No of households covered	No.of Applications Recieved: No of Abhayahastam applications received	No of other applications received	Total Applications Recieved
1	2	3	4	5=3+4
28.12.2023	209704	185202	22523	207725
29.12.2023	398448	313226	48802	362028
30.12.2023	443373	347669	74821	422490
02.01.2024	400537	285293	77313	362606
03.01.2024	323742	217812	75756	293568
04.01.2024	265991	180804	74310	255114
05.01.2024	249458	169072	79575	248647
06.01.2024	297261	202178	119969	322147
Total	2648621	1901256	573069	2474325

గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రజా పాలన దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది రోజుల పాటు నిర్వహించిన ప్రజా పాలనలో ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు అభయహస్తం 5గ్యారెంటీ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. గ్రేటర్‌లో ఆరు గ్యారెంటీలతోపాటు రేషన్ కార్డు కోసం భారీ ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. గ్రేటర్ పరిధిలో 24,74,324 దరఖాస్తులు అందాయి. మహిళలకు, పురుషులకు వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటు చేయటమే కాకుండా ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రతీ 100 దరఖాస్తు దారులకు ఒక కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాపాలన కార్యక్రమం మానిటరింగ్ చేయడానికి ప్రత్యేకంగా సిబ్బందిని, అధికారులను ఏర్పాటు చేశారు. ప్రజా పాలనలో అభయహస్తం కింద మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాల కోసం అర్హులైన వారు ముందస్తుగా దరఖాస్తును నింపి కౌంటర్లలో సమర్పించి రశీదును పొందే విధంగా చర్యలు తీసుకున్నారు.

ప్రజా పాలన ప్రారంభమైన మొదటి రోజు జీహెచ్ఎంసీ పరిధిలో 2,07,725 దరఖాస్తులు వచ్చాయి. రెండో రోజు నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో మొత్తం 3,62,028 దరఖాస్తులు వచ్చాయి. ఇక శనివారం వరకు మొత్తం కలిపి 24,74,325 వచ్చాయి. అభయహస్తంకు 19,01,256, ఇతర పథకాలకు 5,73,069 దరఖాస్తులు వచ్చాయి. డిసెంబర్ 28 నుంచి శనివారం 6వ తేదీ వరకు 24,74,325 దరఖాస్తులు అందాయి. ప్రజాపాలనలో పాల్గొన్న సిబ్బంది, అధికారులకు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ప్రత్యేకంగా అభినందించారు. ఎలాంటి అపశృతి లేకుండా సమర్థవంతంగా ప్రజా పాలన కార్యక్రం విజయవంతమైందని, స్వీకరించిన ప్రతీ దరఖాస్తులను సర్కిల్ వారీగా కంప్యూటరైజ్ చేస్తామని కమిషనర్ తెలిపారు.

మేడ్చల్‌లో 38 కిలోల గంజాయి పట్టివేత

నవతెలంగాణ-మేడ్చల్



38 కిలోల గంజాయి పట్టుకున్న ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ చెక్ పోస్ట్ ప్రాంతంలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా కిష్టాపూర్ లో నివాసం ఉండే ఉత్తమ్ చౌదరి, నాతరామ్‌లు బైక్ పై అక్రమంగా గంజాయి తరలి స్తుండగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గంజాయి, బైక్ ను స్వాధీనం చేసుకున్నారు. పెద్ద మొత్తంలో స్థానికంగా గంజాయి దొరక డం కలకలం రేపింది. గంజాయి,మాదకద్రవ్యాలు డ్రగ్స్ నివా రణ పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో పెద్ద మొత్తంలో గంజాయి పట్టుబడడం గమనార్హం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

8న 'సంఘం శరణం గచ్ఛామి' కళారూపం ప్రదర్శన

నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లా ఎస్సీ అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవితం, ఆశయం లక్ష్యాలపై అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్‌చే ప్రదర్శించనున్న "సంఘం శరణం గచ్ఛామి" కళారూపం ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి , ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారిని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు జిల్లాలో ఈ కళారూపం ఉచిత ప్రదర్శన ఉంటుందని చెప్పారు. కళారూపం ప్రదర్శనకు విచ్చేయు ఆహూతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భవన్, కొత్తపేట్ నందు 08-01-2024 రోజు కళారూపం ప్రదర్శిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్. అంబేద్కర్ జీవిత చరిత్ర నేటి తరాలు తెలుసుకునేందుకు ప్రభుత్వం హైదరాబాద్ జిల్లా పరిధిలో ఈ కళారూపం ఉచితంగా ప్రదర్శిస్తున్నారని చెప్పారు. అంబేద్కర్ జీవిత చరిత్ర వారి లక్ష్యాలు ఆశయాలు నేటి తరాలకు తెలియజేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు చెప్పారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరు ఈ కళాప్రదర్శన వీక్షించాలని సూచించారు

గ్రానైట్ రాళ్లు మీద పడి ఇద్దరు కార్మికులు మృతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి జీడిమెట్లలో విషాదం చోటు చేసుకుంది. లారీ నుంచి గ్రానైట్ రాళ్లు అన్‌లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు అవి ఇద్దరు కార్మికులపై పడి మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లిలో ఆర్‌ఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ భవనాల నిర్మాణాలు చేపడుతోంది. ఈ నిర్మాణ సంస్థలో పనిచేస్తోన్న ఇద్దరు కార్మికులు ఝార్ఖాండ్ కు చెందిన శితశరణ్ (36), మధ్యప్రదేశ్‌కు చెందిన లక్ష్మణ్ బరాక్(25)లు శనివారం లారీ నుంచి గ్రానైట్ రాళ్లను కిందకు దింపుతున్నారు. ఈ క్రమంలో అవి మీద పడటంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఆర్‌ఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ కనీస జాగ్రత్తలు పాటించకుండా కార్మికులతో పని చేయిం చడంతో ఈ ప్రమాదం జరిగిందని పలువురు కార్మికులు ఆరోపిస్తున్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫుల్ మేని ఏ జెమ్ పుస్తకంలో క్లుప్తంగా నాట్యరంగం చరిత్ర

- తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్

నవతెలంగాణ-ముషీరాబాద్



ఫుల్ మేని ఏ జెం పుస్తకంలో నాట్యరంగంలో చరిత్ర క్లుప్తంగా వివరించారని తెలంగాణ ఆర్టీసీ ఎండి సజ్జనార్ అన్నారు. కన్నడ నాట్యరంగం ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత కారోడి నిరంజన్ రచించిన ఫుల్ మేని ఏ జెమ్ పుస్తకం ఆవిష్కరణ, సంపూర్ణ రామాయణ తోలుబొమ్మలాట కార్యక్రమం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్టీసీ ఎండీ సజ్జనర్ హాజరై ఫుల్ మేని ఏ జెమ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయిత నిరంజన్ కర్ణాటక కల నాట్య రంగం చరిత్ర ప్రతీ ఒక్కరికి క్లుప్తంగా వివరించే విధంగా తన ఈ పుస్తకాన్ని రచించారని తెలిపారు. ప్రజల్లో నాట్య రంగంపై ఆసక్తి పెంపొందించేలా రచనలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా సంపూర్ణ రామాయణం తోలుబొమ్మలాట ఎంతో ఆసక్తి కలిగించిందన్నారు. ప్రతి ఒక్కరూ అంతరించిపోతున్న ఈ కళను ప్రజల్లోకి తీసుకెళ్లి తట్టి లేపాలి అన్నారు. ఈ కార్యక్రమంలో కన్నడ నాట్యమండలి అధ్యక్షులు మారడ కట్టి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు రత్నాకర్, రామ్మూర్తి, రామ్ చందర్, కోశాధికారి రామచంద్రరావు తదితర నాయకులు పాల్గొన్నారు

'ప్రజాపాలన'లో కాంగ్రెస్, ఎంఐఎం మధ్య గొడవ..

నవతెలంగాణ - ధూల్‌పేట్

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో కాంగ్రెస్ - ఎంఐఎం కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న సంఘటన టప్పచబుత్ర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్వాన్, నాంపల్లి నియోజవర్గంలో జిర్ర ప్రాంతంలోని కే హెచ్ ఫంక్షన్ హాల్లో ప్రజాపాలన కార్యక్రమం కొనసాగుతోంది. కాంగ్రెస్ నాంపల్లి కాంటెస్ట్ ఎమ్మెల్యే ఫిరోజ్ ఖాన్, తోటి నాయకులు ప్రజా పాలన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఆ క్రమంలో ఫంక్షన్ హాల్ వద్ద కొనసాగుతున్న ప్రజాపలన కేంద్రం వద్దకు ఎంఐఎం అనుచరులు సుమారు 50 మందికి ఒకేసారిగా రావడంతో ఇరువురి మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఘర్షణకు పాల్పడిన కాంగ్రెస్, ఎంఐఎం నాయకులపై కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



అయోధ్య శ్రీరామ మందిరంలో ప్రాణప్రతిష్ఠ పూజిత అక్షింతల ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపు మహోత్సవం నిర్వహించి ఇంటింటికి అయోధ్య రామ మందిరం అక్షింతలును బీజేపీ నాయకులు కిషోర్ శనివారం పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు అయోధ్య రామ మందిరం ప్రాణప్రతిష్ఠ పూజా కార్యక్రమం తిలకించాలని కోరారు. నాయకులు కమలాకర్ శాస్త్రి రమేష్ గుప్తా, ప్రకాష్ ,గోపాల్ దాస్, తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-ముషీరాబాద్

బాల మురళీకృష్ణ గానం నిత్య నూతనం



నవతెలంగాణ-కల్చరల్

మంగళంపల్లి బాలమురళీకృష్ణ గానం లోని మాధుర్యం నిత్య నూతనమై శ్రోతలను రంజింప చేస్తుందని ప్రముఖ గాయకులు కొనియాడారు. శ్రీ త్యాగరాయ గాన సభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై బుక్ రీడింగ్ అండ్ కల్చరల్ సొసైటీ,శ్రీ రాగ సినీ మ్యూజికల్ ఆర్కెస్ట్రా 25 సంవత్సరాల సందర్భంగా జరిగిన వేడుకల్లో గాయకుడు, రచయిత డీ.వీ.వీ.ఎస్.నారాయణ సంకలనం చేసిన సంగీత స్వర నిధి బాలమురళి సంపుటిని ప్రముఖ గాయకుడు త్రినాథ రావు, విశ్రాంత విద్యాధికారి పల్లా సోమ సుందర శర్మ,అన్నమయ్య సంకీర్తనల పరిశోధకుడు నాగ రాజులు ఆవిష్కరించి మాటాడారు. జాతీయ అత్యుత్తమ పురస్కారం పద్మవిభూషణ్ పొందిన బాల మురళి తన నాలుగవ ఏటనే సంగీత కచేరీ చేశారని గుర్తు చేశారు.సంకలనం లో ప్రము ఖులు రాసిన పలు వ్యాసాలు బాల మురళి గురించి తెలుసు కొనేందుకు ఉపయుక్తం అన్నారు. ఈ సందర్భంగా అణు శాస్త్రవేత్త విశ్వనాథ్ మద్దిపట్లను కళా వాచస్పతి బిరుదుతో రక్షణ శాఖలో పదవీ విరమణ చేసిన అది నారాయణ మూర్తి ని జీవిత సాఫల్య పురస్కారంతో, గాయని వీ. ఏ.లక్ష్మిని గాన సుధా రత్న బిరుదుతో గాయకుడు నేదునూరి శ్యామ కృష్ణ ను గాన కళా భూషణ బిరుదుతో సంస్థ పక్షాన సత్కరించారు. విశ్వనాథ్ అణు శాస్త్ర నిపుణులు మాత్రమే కాక సినీ పాటల పై గొప్ప పరిజ్ఞానం ఉన్న గాయకుడు అని అభినందించారు. సంస్థ కార్యదర్శి అలివేలు నివేదిక సమర్పించారు. అనంతరం లక్ష్మి, శ్యామ, కృష్ణ, శ్రీదేవి, తదితరులు పాడిన పాటలు ఆకట్టుకున్నాయి





ముగ్ధ మోహన రూపం భావాలు పలికించే నేత్రాలు పద ముద్రలలో మెరుపులు విరిసి హిత్విత నల్లూరి కూచి పూడి నాట్య రంగప్రవేశం రవీంద్ర భారతి లోప్రేక్షకులను ఆకట్టుకుంది. హిత్విత తొలి అంశంగా గణేష్ స్తుతి తో తన ప్రదర్శన ఆరంభించి తదుపరి అంశాలలో అన్నమయ్య కీర్తన, దీక్షితార్ తరంగం , త్యాగయ్య కీర్తనలో పద ముద్రలు అభినయంలో ప్రేక్షకుల ప్రశంస పొందింది. ప్రముఖ నాట్య గురువు దీపికా రెడ్డి శిష్యరికంలో హిత్విత పరిణత నాట్య ప్రదర్శన చేశారని ప్రముఖులు పేర్కొన్నారు.
నవతెలంగాణ-కల్చరల్



నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం మల్కా కొమురయ్య ఆధ్వర్యంలో శ్రీ రామ కళ్యాణ మహోత్సవంలో శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామి తో కలిసి పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి , మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి తదితరులు .
నవతెలంగాణ-కాప్రా



రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును వారి కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నీరడి భూపేష్ సాగర్ కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. నవతెలంగాణ-ముషీరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలి

- భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు

నవతెలంగాణ-హిమాయత్ నగర్

వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశాన్ని పీకల్లోతో అప్పుల్లోకి ముంచి, మోయలేని భారాన్ని దేశ ప్రజలపై రుద్దిన బీజేపీ కేంద్ర ప్రభుత్వానికి లోక్ సభ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థల పరం చేయడం, వివిధ శాఖల్లో ఉద్యోగుల సంఖ్యను తగ్గించడం వంటి విధానాలను అవలంబించి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన బీజేపీని ఓడించాలని విజ్ఞప్తి చేశారు.కేంద్ర ప్రభుత్వం తొమ్మిదిన్నర సంవత్సరాల కాలం పాటు దేశ ప్రజలకు చేసింది ఏమి లేదని, రామనామం పేరిట ప్రజలను మోసం చేస్తున్నదని ఆరోపించారు. రాష్ట్రంలోని 17 లోక్ సభ స్థానాల్లో ఒక్కటి కూడా బీజేపీకి దక్కకుండా చేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు రమేష్ బాబు, బాలయ్య ఆంజనేయులు, రాజు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుల నియామకాల ప్రక్రియను రద్దు చేయాలి

- తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ మానవతారాయ్



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

లోపా బూయిష్టంగా నిర్వహించిన స్టాఫ్ నర్సుల నియామకాల ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ మానవతారాయ్ డిమాండ్ చేశారు. శనివారం కోఠి లోని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డ్ కార్యాలయం ఎదుట అభ్యర్థులు శనివారం ఆందోళన చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అర్హులైన నర్సింగ్ అభ్యర్థులకు నియామ కాలలో అన్యాయం జరిగిందన్నారు. ఈ నియామకాల ప్రక్రియలో అవకతవకలపై ఏసీబీతో దర్యాప్తు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నకిలీ సర్టిఫికెట్లు పెట్టినవారికి మెరిట్ లిస్టులో పేరు ఉంచి.. అర్హులైన వారిని నిర్దాక్షి ణ్యంగా తొలగించారని ఆరోపించారు. ఏ నియామ కాల్లోనైనా మార్కులు కలుపుతారు కానీ తీసివేయరని కానీ ఇక్కడ ఈ ప్రక్రియలో మాత్రం వెయిటేజీ మార్కులను తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. దీనివల్ల అర్హులైన సుమారు వేలమందికి అన్యాయం జరిగిందని అన్నారు. ఇప్పటికైనా స్టాఫ్ నర్సుల నియమకాల ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వేలాది మందితో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆఫీసులో వినతి పత్రం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, రవి, ప్రమీల, నిర్మల, ఉమా, పెద్ద ఎత్తున బాధిత అభ్యర్థులు పాల్గొన్నారు.

హైదరాబాద్ జిందాబాద్‌కు సహాయ సహకారాలుంటాయి



- మంత్రి జూపల్లి కృష్ణారావు
- హైదరాబాద్ జిందాబాద్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ముషీరాబాద్

నగర అభివృద్ధికి హైదరాబాద్ జిందాబాద్ చేసే కార్యక్రమాలకు తమ సహాయ సహకారాలు ఉంటాయని టూరిజం, సాంస్కృతిక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.హైదరాబాద్ జిందాబాద్ పౌర సంస్థ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం మంత్రి తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి కె.వీరయ్య కార్యవర్గం మంత్రికి హైదరాబాద్ జిందాబాద్ నిర్వహిస్తున్న పర్యావరణం, ప్రజా ఆరోగ్యం, ప్రజా రవాణా, కల్చరల్ ఫెస్టివల్ మొదలగు కార్యక్రమాలను వివరించారు. పర్యావరణ సమస్యలపై హైదరాబాద్ జిందాబాద్ చేస్తున్న కృషిని, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహిస్తున్న తీరును మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిందాబాద్ నగర నాయకులు జేకే శ్రీనివాస్, కృష్ణమోహన్, ఎం శ్రీనివాసరావు, పి. శ్రీనివాస్, మోహన్ నాయుడు, పి నాగేష్, రాజమౌళి, గోపాల్ , సత్య పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి



- క్యాలెండర్ ఆవిష్కరణలో ఏఐటీయుసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహా

నవతెలంగాణ-హిమాయత్ నగర్

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) స్కీమ్ లో గత 20 ఏండ్లుగా దాదాపు 15 వేల మంది ఉద్యోగులు వివిధ కేటగిరిలో కాంట్రాక్టు ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ స్కీం ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయకుండా ప్రభుత్వాలు గతంలో తీవ్ర అన్యాయాన్ని చేశాయని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహా ఆరోపించారు. శనివారం హిమాయత్ నగర్ లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల బేసిక్ వేతనం కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ దాన్ని గతంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా రాష్ట్రంలో ఉన్న వేలాది మంది కాంట్రాక్టు కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. భవిష్యత్తులో వీరికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమా రాజేష్ ఖన్నా, ఉప ప్రధాన కార్యదర్శి బాపు యాదవ్, నాయకులు బాలసుబ్రమణ్యం, బత్తుల విష్ణు మూర్తి, సుమన్, నరసింహ, రాజేశ్వరి, వరలక్ష్మి, రేణుక, సంగీత, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

బొగ్గులకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హైదరాబాద్ జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ జయమాలిని శనివారం సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను ఆమె పరిశీలించారు. గర్భిణులకు అందిస్తున్న ఐరన్ మాత్రలు, గర్భిణులకు అందిస్తున్న వైద్యంపై వైద్యులను, ఏఎన్ఎంలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌ల ప్రక్రియను ప్రారంభించాలని ఆమెను కోరారు. ఈ విషయంపై స్పందించిన ఆమె పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. వైద్యులకు వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్‌బీఎస్‌కే డాక్టర్ వసంత, ఏఎన్ఎం సువర్ణ, అకౌంటెంట్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

- బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజకుమార్ డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్ బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్యను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ. రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని నామినేట్ పదవులను అధిక శాతం బీసీలకు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో బీసీ జనాభా ఎక్కువగా ఉందని.. ఇది పరిగణలోకి తీసుకొని ప్రాముఖ్యత గల పదవులు బీసీ నాయకులకు కేటాయిం చాలన్నారు. బీసీలకు ప్రభుత్వ ప్రయివేటు సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సమర్థవంతమైన బీసీ నాయకులను ఎన్నుకొని వారికి టికెట్ కేటాయిస్తే అత్యధిక మెజారిటీతో గెలుపొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జా కృష్ణ, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజేందర్, గ్రేట్ హైదరాబాద్ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బండారి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మహబూబియా ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు విహారయాత్రకు వెళ్లారు. పలు ప్రాంతాలను సందర్శించి ఆనందం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం సుధారాణి, టీచర్స్ కల్పన, సరోజా, భవాని ,శివప్రియ, జానకి, జ్యోతి, సునీత, శైలి స్టేరీల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ సుల్తాన్ బజార్



విద్యార్థినీల వంటకాలు అదరహో..

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

విద్యార్థినిలు వివిధ రకాల వంటకాలు చేసి అదరహో అనిపించారు. శనివారం గన్ ఫౌండ్రిలోని మహబూబియా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల హెచ్‌ఎం కిరణ్మయి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థినీలు చిన్ననాటి నుండే చదువుతోపాటు వివిధ రకాల వంటకాలు, స్వీట్లు, తినుబండారాలు తయారు చేయడం నేర్చుకోవాలని సూచించారు. ఈ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం ప్రతీ సంవత్సరం ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన వంటకాలను రుచి చూశారు. ఆ తినుబండారాలు ఎంతో రుచికరంగా ఉన్నాయని ప్రశంసించారు. ఈ ఫెస్టివల్‌లో విద్యార్థినీలు వివిధ రకాల స్వీట్లు, పానీ పూరి, దాయి ఓడ, మిర్చీలు, వివిధ రకాల జ్యూస్‌లు, బాదం కీర్, బేల్ పూరి, లెమన్ టీ, గ్రీన్ టీ లాంటివి తయారు చేశారు. మొత్తం 20 స్టాళ్లు ఏర్పాటు చేసి వంటలను, స్వీట్లు తయారుచేసి అదరహో అనిపించారు. ఈ కార్యక్రమంలో టీచర్ నీరజ, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం సుధారాణి, 400 మంది విద్యార్థినీలు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మెథడిస్ట్ కాలేజ్ గ్రాడ్యుయేషన్ వేడుకలు



నవతెలంగాణ-ముషీరాబాద్

మెథడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, అబిడ్స్, హైదరాబాద్, 2022 - 2023 ఉత్తీర్ణులైన బ్యాచ్ కోసం 11వ, 12వ గ్రాడ్యుయేషన్ వేడుకలను శనివారం బాగ్ లింగంపల్లిలోని ఆర్‌టీసీ కళాభవన్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలో 700 మందికి పైగా గ్రాడ్యుయేట్‌లకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్‌లను అందుకున్నారు. ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ లక్ష్మీనారాయణ, విశ్వవిద్యాలయంలోని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెథడిస్ట్ కళాశాల అద్భుతమైన అభివద్ధిని సాధించిందన్నారు. అత్యంత వేగంగా ఎన్బీఏ ఎన్ఏఏసి అక్రిడిటేషన్‌ను పొంది స్వయంప్రతిపత్తిని సాధించిందని తెలిపారు. గ్రాడ్యుయేట్‌లను కేవలం ఉద్యోగులుగా కాకుండా వ్యవస్థాపకత, ఉద్యోగ కల్పనలో పాల్గొనేలా ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట నాయకత్వ బందం, చైర్మెన్ శ్రీ కె. కృష్ణారావు, డైరెక్టర్లు ప్రదీప్ రెడ్డి, టి. రాకేష్ రెడ్డి,డాక్టర్ ఎం. లక్ష్మీపతి రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభు జి బెనకోప్, కన్వీనర్ అండ్ హెచ్ఓడి డాక్టర్ వై. మస్తానమ్మ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎ. సచేంద్రనాథ్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ (పీఆర్ఓ) ఆర్. శ్రీకాంత్‌తో పాటు డీన్‌లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



అభయా హస్తం దరఖాస్తులను విజయవంతంగా స్వీకరించినందుకు వివిధ శాఖల అధికారులు సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. నవతెలంగాణ-అంబర్‌పేట

పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని స్థానాలలో పోటీ

- శివసేన యూబీటీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

తెలంగాణలో అన్ని పార్లమెంటు స్థానాలకు శివసేన పార్టీ (యూబీటీ) పోటీ చేస్తుందని శివసేన రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ తెలిపారు. కాచిగూడలో శివసేన పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శివసేన పార్టీని రాష్ట్రంలో బలపేతం చేయడం కోసం జాతీయ స్థాయి నాయకులు వచ్చి అన్ని పార్లమెంటు కేంద్రాల్లో సభలు సమావేశాలు నిర్వహిస్తారని తెలిపారు. ధర్మం కోసం న్యాయం కోసం అతివాదులందరూ పాల్గొని శివసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. త్వరలో భారీ బహిరంగ సభకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కోర్ కమిటీ సభ్యుడిగా పూస శ్రీనివాస్‌ను రాష్ట్ర అధికార ప్రతినిధిగా ,కోర్ కమిటీ సభ్యులు గా అవినాష్ జస్వాల్ గౌటే గణేష్‌ను నియమించినట్టు తెలిపారు. సిరిసిల్ల కరీంనగర్ పెద్దపల్లి కామారెడ్డి జగిత్యాల జిల్లాలకు ఇన్‌చార్జిగా, కో. ఆర్డినేటర్ గా గౌట గణేష్ ను నియమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రాష్ట్ర అధికార ప్రతినిధి గౌట గణేష్, అవినాష్ జైస్వాల్, సామాజిక కార్యకర్త మహేందర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్, బీజేపీ కుట్రలను ప్రజలు గమనించాలి'



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నేతలు, అధికారం ఆశించి భంగపడ్డ బీజేపీ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీలలో ఒకటి మహాలక్ష్మి పథకం మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం పథకం పైన దుష్ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మొగిలి సునీతారావు మండిపడ్డారు. అధికారం రాలేదని అక్కస్సుతో ఇలాంటి కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని అన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు సునీత రావుతో కలిసి ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ , జూబ్లీ బస్ స్టాప్, ఇబ్రహీంపట్నం బస్ స్టాప్, ఇమ్లిబన్ బస్ స్టాప్ లను సందర్శించి మహిళా ప్రయాణికులను కలిసి వారి అభిప్రాయం తెలుసుకోవడం జరిగింది అన్నారు. మహాలక్ష్మి పథకం రాష్ట్రమంతటా బ్రహ్మాండంగా శాంతియుతంగా పనిచేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సదాలక్ష్మి, అమృత, రత్నకుమారి, కవిత, జయమ్మ, వెంకటమ్మ, తహసిన్, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రమేష్ నాయక్ జన్మదిన వేడుకలు పార్టీ కార్యకర్తలు అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీఆర్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలే నిరంజన్, తదితర నాయకులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-అంబర్‌పేట



నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను మాజీ మంత్రి సి కృష్ణ యాదవ్, బీజేపీ నాయకులు దినేష్ అంబారి తదితర నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.
నవతెలంగాణ-అంబర్‌పేట

ఘనంగా సీఎంఆర్ మోడల్ హై స్కూల్ వార్షికోత్సవం

- ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మల్లారెడ్డి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

గాజులరామారం డివిజన్ పరిధిలోని సీఎంఆర్ మోడల్ హై స్కూల్ 24వ వార్షికోత్సవాన్ని పాఠశాల ఆవరణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కష్టపడి చదివితే అద్భుత విజయాలు మీ సొంతం అవుతాయన్నారు. గత 24 సంవత్సరాలుగా సీఎంఆర్ పాఠశాలలు నెలకొల్పి ఎంతోమంది విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దామన్నారు. సీఎంఆర్ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో రంగాల్లో స్థిరపడ్డారన్నారు. నేటి తరం విద్యార్థులే భావిభారత పౌరులని.. ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూస్తున్నాయన్నారు, మారుతున్న టెక్నాలజీ అందిపుచ్చుకొని అధునాతన విద్యను అందిస్తున్న సంస్థ సీఎంఆర్ అని తెలిపారు. తమ విద్యాసంస్థల ద్వారా వేలాది మంది డాక్టర్లుగా, ఇంజనీర్లుగా తీర్చిదిద్దామని తెలిపారు. అనంతరం మల్లారెడ్డి మెడికల్ కాలేజ్ డైరెక్టర్ భద్రారెడ్డి మాట్లాడుతూ 60 వేల మందికి పైగా విద్యార్థులు సీఎంఆర్ గ్రూప్ సంస్థలలో విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. పిల్లలకు తల్లిదండ్రులు పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. పాఠశాల కారస్పాండెంట్ చామకూర గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పట్టుదలతో చదివితే ప్రతిభావంతులు అవుతారని, ప్రతీ విద్యార్థి ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని లక్ష్యసాధన వైపు అడుగులు వేయాలన్నారు, ముఖ్యంగా విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు చేసిన పలు నృత్య సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అల్లరించాయి. అనంతరం సీఎంఆర్ పాఠశాలలో 20 ఏండ్లు నుంచి విశేష సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను ఎమ్మెల్యే మల్లారెడ్డి, కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఎంఆర్ గ్రూప్స్ కరస్పాండెంట్ సెక్రెటరీ చామకూర గోపాల్ రెడ్డి, మల్లారెడ్డి హాస్పిటల్ డైరెక్టర్ భద్రరెడ్డి, సీఎంఆర్ బోయిన్‌పల్లి స్కూల్ డైరెక్టర్ ఎస్కే రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ హరిశంకర్, పాఠశాల ఏఓ సత్తిబాబు, యూనిక్ హై స్కూల్ కరస్పాండెంట్ శివయ్య, వివేకానంద విద్యా మందిర్ హై స్కూల్ కరస్పాండెంట్ ఎం శ్రీనివాస్ గౌడ్, కరస్పాండెంట్లు రాంబాబు, హరి ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.





'ఎయిర్ ఇండియా గ్రూప్ హెడ్-గవర్నెన్స్, రెగ్యులేటరీ కార్పొరేటర్‌గా పి.బాలాజీ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

గురుగ్రామ్ గ్రూప్ హెడ్-గవర్నెన్స్, రెగ్యులేటరీ, కంప్లయన్స్ కార్పొరేటర్‌గా పి.బాలాజీని నియమించినట్టు ఎయిర్ ఇండియా బుధవారం ఒక ప్రకటనలో ప్రకటించింది. బాలాజీ 11 జనవరి 2024న ఎయిర్ ఇండియాలో తన పాత్రను స్వీకరిస్తారని.. ఎయిర్ ఇండియాలో ఆయన ప్రభుత్వ వ్యవహారాలు, 5 చట్టప రమైన నీతి, సుస్థిరత, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ విధులు ఇతరములు చూస్తార న్నారు. బాలాజీ తన కెరీర్ ను టాటా అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్‌లో ప్రారంభిం చారు.రెగ్యులేటరీ పాలసీ, సమ్మతి, సేల్స్, ప్రొడక్ట్ మేనేజ్మెంట్, మార్కెటింగ్, స్ట్రాటజీ, ఎంఏ కార్యకలాపాలతో సహా విభిన్న విధుల్లో టెలికాం సెక్టార్ లో 30 సంవత్సరాలకు పైగా గొప్ప అనుభవం కలిగి ఉన్నారు.తర్వాత ఎయిర్ ఇండియాలో చేరారు. వోడాఫోన్ ఐడియా లిమిటెడ్ లో దశాబ్ద కాలం పాటు కొన సాగారు.అక్కడ ఆయన నియంత్రణ, పబ్లిక్ పాలసీ విధులకు నాయకత్వం వహిం చారు. ఎయిర్ ఇండియా సీఈఓ ఎండీ కాంప్బెల్ విల్సన్ బాలాజీ నియామకాన్ని ప్రకటిస్తూ బాలాజీని ఎయిర్ ఇండియాలో చేర్చుకున్నందుకు తాము సంతోషిస్తున్నామన్నారు. రెగ్యులేటరీ, పాలసీ స్పేస్‌లో పని చేసిన ఆయన ఎయిర్ ఇండియాలో కొనసాగుతున్న పరివర్తనకు విలువైన జ్ఞానం ఎయిర్ ఇండియాలో, విమానయాన సంస్థను గ్లోబల్ ఏవియేషన్ లో ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అవసరమైన అన్ని వనరులలో పెట్టుబడి పెట్టడం కొనసాగిస్తున్నందున అగ్ర నాయకత్వాన్ని నిర్మించేందుకు తాము కట్టుబడి ఉన్నామన్నారు.

స్వేచ్ఛ ఆధ్వర్యంలో 'ఏఐ చందమామ కథలు' ఆవిష్కరణ



నవతెలంగాణ-మియాపూర్

మనుషుల్లో నైతిక విలువలను పెంపొందించడమే లక్ష్యంగా స్వేచ్ఛ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న 'ఏఐ చందమామ కథలు' ను ఆర్కా మీడియా వర్క్స్ వ్యవస్థాపకుడు శోబు యార్లగడ్డ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. శనివారం గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వేచ్ఛ వ్యవస్థాపకులు వై.కిరణ్ చంద్ర మాట్లాడుతూ ఈ మొత్తం ప్రయత్నం ఎంతో ఉన్నతమైనదన్నారు. తనకు 20 ఏండ్ల క్రితం మొదటి తెలుగు ఆపరేటింగ్ సిస్టమ్‌ను రూపొందించడంలోనూ, ఫాంట్, గ్లోసరీని రూపొందించడంలోనూ చేసిన కృషిని గుర్తు చేసిందన్నారు. టెక్నాలజీని ప్రజాస్వామ్యీకరించే దిశలో ఈ ప్రయాణం ఒక తార్కిక అడుగుగా పేర్కొన్నారు. ఈ ప్రదేశంలో మరింత పనిని కొనసాగిస్తామన్నారు. ప్రొఫెసర్ గౌరవ్ రైనాతో భాగస్వామ్యం ఆలోచనను జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు మద్రాస్‌లోని ఐఐటీ పరిశోధకులు, విద్యార్థులతో సన్నిహితంగా మెలగడంలో తమకు సహాయపడుతుందని తెలిపారు. డేటా సేకరించిన తరువాత తదుపరి దశ కథనాలపై ఏఐ మోడల్‌కు శిక్షణ ఇవ్వడం, తద్వారా అది కొత్త కథనాలను సృష్టించగలదన్నారు. చైతన్య ఈ ప్రయత్నానికి నాయకత్వం వహించారని చెప్పారు. ఈ సందర్భంగా ఓజోనెటెల్ సీపీవో, కో-ఫౌండర్ చైతన్య మాట్లాడుతూ దీనికి సాంకేతిక నైపుణ్యం అవసరమన్నారు. దాదాపు నెల రోజుల పాటు సాగిన ప్రయత్నాల తర్వాత ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. ఇది ప్రారంభం మాత్రమేనని చెప్పారు. టీమ్ దీన్ని మెరుగుపరచడమే కాకుండా తెలుగు కోసం ప్రతిష్టాత్మకమైన ప్రణాళికలను కూడా కలిగి ఉందన్నారు. చందమామ కథలు డేటాథాన్ విజయం అధిక నాణ్యత డేటాసెట్‌లను రూపొందించడానికి స్వచ్ఛందంగా నడిచే ప్రయత్నం సాధ్యమవుతుందని నిరూపించిందన్నారు. ఈ డేటాసెట్‌లు, ఓపెన్‌గా ఉండటం వల్ల ఇప్పుడు యూనివర్సిటీలు, స్టార్టప్‌లలో పరిశోధనలు వెలుగులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గాయకుడు, స్వరకర్త రామ్ మిరియాల, ప్రొఫెసర్ రైనా, కిరణ్ చంద్ర, చైతన్య చొక్కారెడ్డి, ఓజోనెటెల్ రమాదేవి లంక, ప్రొఫెసర్ రాజన్, కిరణ్‌కుమార్, శశికాంత్ వల్లేపల్లి, నాగార్జున మల్లాది, తదితరులు పాల్గొన్నారు.

యెండల సౌందర్య... 2016 రియో ఒలింపిక్స్‌కు మన దేశం నుండి తొలిసారి అర్హత సాధించిన ఇద్దరు క్రీడాకారిణుల్లో ఈమె కూడా ఒకరు. అంచెలంచెలుగా ఎదిగి జిల్లా, రాష్ట్ర, జాతీయ జట్టులో స్థానం సంపాదించారు. జాతీయ టీంలో 12 ఏండ్ల పాటు కొనసాగారు. టీంకు వైస్ కెప్టెన్‌గా కూడా వ్యవహరించి 100 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి ఈ ఘనత పొందిన తొలి తెలంగాణ క్రీడాకాణిగా చరిత్ర సృష్టించారు. ప్రస్తుతం ఒలింపిక్స్‌కు సిద్ధమౌతున్న మన ఇండియా టీంకు కోచ్‌గా వ్యవహరిస్తున్న ఆమెతో మానవి సంభాషణ...



మన వాళ్ళు కోచ్‌లుగా ఎదగాలి

మాది నిజామాబాద్ జిల్లాలోని ఇందూరు గ్రామం. దిగువ మధ్య తరగతి కుటుంబం. అమ్మ చంద్రకళ, నాన్న సాయిలు. అమ్మ ఇంట్లోనే ఉండి బీడీలు చుట్టేది. 2015లో అనుకోకుండా నాన్న చనిపోయారు. నేను 7వ తరగతిలో ఉన్నప్పటి నుండే హాకీ ఆడేదాన్ని. స్కూల్లో ఉన్నప్పుడు ఖో-ఖో బాగా ఆడేదాన్ని. మా సీనియర్స్ హాకీ ఆడుతుంటే చూసి నేనూ ఆ ఆట నేర్చుకోవాలని అనుకున్నాను. మొదట్లో ఏదో వాళ్ళు ఆడుతున్నారు కాబట్టి ఆడేదాన్ని. ఎప్పుడైతే సికింద్రాబాద్ వచ్చి ట్రైనింగ్ తీసుకోవడం మొదలు పెట్టానో అప్పుడే హాకీనే నా ప్రపంచం అనే నిర్ణయానికి వచ్చాను. ఎలాగైనా ఇండియా టీంకి సెలక్ట్ కావాలనే లక్ష్యం పెట్టుకున్నాను. ఆ కోరిక తీరిన తర్వాత కోచ్ కావాలని కలలు కన్నాను. రిటైర్ అయిన తర్వాత డిప్లొమా చేశాను. దీనికి అవసరమైన కోర్సులు కూడా పూర్తి చేసి ఇప్పుడు మన అమ్మాయిల టీంకు కోచ్‌గా ఉన్నాను.

అప్పులు చేసేవారు...

మొదట్లో నేను హాకీ ఆడుతుంటే మా అమ్మానాన్న భయపడ్డారు. అమ్మాయిని కాబట్టి కంగారు పడ్డారు. తర్వాత ఆటలో నేను చూపిస్తున్న ఆసక్తి, బాగా ఆడటం చూసి ప్రోత్సహించారు. మొదట్లో టోర్నమెంట్లకు వెళ్ళాలంటే చాలా సమస్యలు ఉండేవి. డబ్బులు లేక అమ్మ వాళ్ళు వేరే వాళ్ళ దగ్గర అప్పు తీసుకొని పంపించేవారు. ఎంత ఇబ్బంది పడ్డా నన్ను మాత్రం ఆటలో ప్రోత్సహించారు. నా కోసం చాలా కష్టపడ్డారు.

రుణపడి ఉంటాను

సికింద్రాబ్‌లోని సాయ్ హాస్టల్లో చేరిన తర్వాత తిండికి, ఉండటానికి, కోచింగ్‌కి ఇబ్బంది లేకుండా గడిచిపోయింది. ఇందులో నాకు సహకరించిన నా మొదటి కోచ్ మక్బూల్ సార్‌కు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. నేను నిజామాబాద్ జిల్లా స్థాయిలో ఆడటానికి కారణం కూడా ఆయనే. 2009లో రైల్వేస్‌లో నాకు జాబ్ వచ్చింది. ఆర్థిక సమస్యలు కొంత తగ్గడంతో అప్పటి నుండి ఆటపై మరింత దృష్టి పెట్టాను. మా తమ్ముడు కూడా హాకీ ప్లేయర్. ప్రస్తుతం వనపర్తిలో హాకీ కోచ్‌గా చేస్తున్నాడు. నాకు ఓ చెల్లికి కూడా ఉంది, తనకు పెండ్లయింది. నా మోకాలికి కాస్త ఇబ్బంది కావడంతో 2016లో రిటైర్‌మెంట్ తీసుకున్నాను. నాలుగేండ్ల కిందట పెండ్లయింది. మా వారు సాఫ్ట్‌వేర్‌గా చేస్తున్నారు.

నేషనల్ టీం బాగుంది

అమ్మాయిల టీంకి గతం కంటే ప్రోత్సాహం బాగుంది. నేషనల్ టీంకి మంచి సౌకర్యాలు కల్పిస్తున్నారు. గతంలో క్వాలిఫై కావడమే కష్టంగా ఉండేది. అలాంటిది ఇప్పుడు క్వాలిఫై అయ్యి అంతర్జాతీయ స్థాయి వరకు వెళ్ళి ఆడుతున్నారు. ప్రస్తుతమున్న టీం మంచి పొజీషన్‌లో ఉంది. గతంలో చాలా మందికి హాకీ అంటే తెలీదు. హాకీ మన జాతీయ క్రీడ అయినా ఎవరూ దీని గురించి పట్టించుకునే వారు కాదు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితుల్లో కొంత వరకు మార్పు వచ్చింది. అమ్మాయిలు కూడా ఈ క్రీడ పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. అలాగే తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్ని ప్రోత్సహిస్తున్నారు. స్కూల్ స్థాయి నుండే పిల్లలకు ఆటలో శిక్షణ ఇస్తున్నారు. ఇది ఒక మంచి పరిణామం.



ఆటలో నైపుణ్యం చూసి

మనకు విదేశీ కోచ్‌లు చాలా మంది అందుబాటులో ఉన్నారు. వారి నుండి ఎంత వరకు నేర్చుకోగలిగితే అంత నేర్చుకొని మన టీంకి శిక్షణ ఇవ్వడమే నా లక్ష్యంగా పెట్టుకున్నాను. మొన్నటి వరకు విదేశీ కోచ్‌ల దగ్గర అసిస్టెంట్ కోచ్‌గా ఇచ్చాను. నా ఆటలో నైపుణ్యం చూసి ఇప్పుడు నాకు ఇండియా టీంకి కోచ్‌గా అవకాశం ఇచ్చారు. అయితే నా కోరిక ఏంటంటే విదేశీ కోచ్‌లు కాకుండా ఇండియా వాళ్ళనే కోచ్‌లుగా పెట్టుకునే స్థాయికి మన దేశం రావాలి. ప్రస్తుతం బెంగుళూరులో ట్రైనింగ్ ఇస్తున్నాం. ఎప్పుడు ఎలా ఆడాలి, ఏ సమయంలో ఎలాంటి ఎత్తుగడలు తీసుకోవాలి, ఎదుటి వాళ్ళకు కౌంటర్‌గా ఎలా ఆడాలి అనే దానిపై ఎక్కువ ఫోకస్ పెడతాం.

క్వాలిఫై అవుతారు

మన అమ్మాయిలు మొన్నటి ఏషియా గేమ్స్‌లో క్వాలిఫై కాలేక పోయారు. కానీ చాలా బాగా ఆడగలిగే సత్తా మన అమ్మాయిలకు ఉంది. ఈ నెల 13 నుండి ఒలింపిక్స్ పోటీలకు రాంచీలో సెలక్షన్స్ జరుగుతున్నాయి. దాని కోసమే ప్రస్తుతం మన ఇండియా టీంని సిద్ధం చేస్తున్నాం. ఆటలో వాళ్ళు చూపిస్తున్న ఆసక్తి, పట్టుదల చూస్తే ఈ సారి కచ్చితంగా క్వాలిఫై అవుతారు అనే నమ్మకం నాకు వచ్చింది. నేను నేషనల్ టీంలో ఉన్నప్పుడు 2009లో జూనియర్ వరల్డ్ కప్ ఆడి సిల్వర్ కప్ సాధించాము. 2016లో సౌత్ ఏషియన్ గేమ్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించాము. 2016లో ఒలింపిక్ క్వాలిఫై కోసం ఆడి క్వాలిఫై అయ్యాము. 36 ఏండ్ల తర్వాత మొదటి సారి మన అమ్మాయిల టీం ఒలింపిక్స్‌కు క్వాలిఫై అయ్యింది. అది నేను మర్చిపోలేని అనుభూతి.

- సలీమ

రాష్ట్రంలో అభివృద్ధి చేయాలి

తెలంగాణలో మాత్రం హాకీ క్రీడ అసలు లేదు. ఆడాలన్నా అకాడమీ, గ్రౌండ్ సదుపాయం లేదు. సౌకర్యాలు ఉంటే ఆడటానికి ఆసక్తి చూపిస్తారు. మరో విషయం మనకు కోచ్‌లు లేరు. ఆడటానికి ఆసక్తి చూపించే పిల్లలు ఉన్నారు, వాళ్ళంతట వాళ్ళు వచ్చి ఆడుకుని వెళ్ళిపోతారు. కానీ గైడెన్స్ ఇచ్చే వాళ్ళు లేరు. దాని వల్ల ముందుకు వెళ్ళలేకపోతున్నారు. ఈ సమస్యలు పరిష్కరించి ఇక్కడ కూడా కింద స్థాయి నుండి సదుపాయాలు కల్పిస్తే మన రాష్ట్రం నుండి కూడా మంచి క్రీడా కారులు తయారవుతారు. తెలంగాణలో కూడా మంచి ప్లేయర్లను తయారు చేయాలని కలలు కంటున్నాను.



ఈ కాలంలో అల్లం తీసుకుంటే...

చాలావరకు వంటల్లో మనం అల్లం వాడుతుంటాం. అల్లంలో కార్బోహైడ్రేట్లు, ఫైబర్, ప్రోటీన్, విటమిన్లు బి3, బి6, ఐరన్, పొటాషియం, విటమిన్ సి, మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్లుతో పాటు ఇతర పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. దీనిలో జింజరాల్ యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు కూడా ఉంటాయి. చలికాలంలో అల్లం రసం తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు సొంతం చేసుకోవచ్చని నిపుణులు అంటున్నారు. తరచూ అల్లం రసం తీసుకుంటే ఆరోగ్యానికి ఎలాంటి మేలు జరుగుతుందో చూద్దాం.?

ఇమ్యూనిటీ బూస్ట్ చేస్తుంది: అల్లంలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. దీనిలో జింజరాల్ యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. అల్లంలో రోగనిరోధక పనితీరును మెరుగుపరిచే యాంటీ బాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇది జలబు, ఫ్లూ, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తాయి.

జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి: అల్లం జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది, మెరుగైన జీర్ణక్రియ, పోషకాలను గ్రహించడంలో సహాయపడుతుంది. ఇది ఉబ్బరం, అజీర్ణం, వికారం వంటి సమస్యలను దూరం చేస్తుంది.



శ్వాసకోశ సమస్యలను దూరం: అల్లంలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది శరీరంలో మంట, జలుబు, వైరల్ సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. శ్వాసనాళాన్ని క్లియర్ చేస్తుంది. గొంతు నొప్పిని తగ్గించి, దగ్గు నుంచి ఉపశమనం ఇవ్వడానికి సహాయపడతాయి.

బ్లడ్ షుగర్ కంట్రోల్: అల్లంలోని ఔషధ గుణాలు ఇన్సులిన్ విడదలకు, సెన్సిటివిటీకి సహాయపడతాయి. రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్‌లో ఉంచడానికి తోడ్పడతాయి. డయాబెటిస్ ఉన్నవారు రోజూ అల్లం రసం తాగితే మేలు జరుగుతుంది.

గుండెకు మంచిది: అల్లం రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను, రక్తపోటును తగ్గిస్తుంది. ఫలితంగా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

నెలసరిలో అసౌకర్యాన్ని తగ్గిస్తుంది: నెలసరి సమయంలో అల్లం రసం తీసుకోవడం వల్ల నొప్పులు నియంత్రణలో ఉంటాయి. అధిక రక్తస్రావాన్ని అరికట్టే సుగుణాలు దీనిలో ఉన్నాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి.

మెదడు పనితీరు మెరుగుపడుతుంది: అల్లంలో ఉండే యాంటీఆక్సిడెంట్లు మెదడు కణాలను ఆక్సీకరణ ఒత్తిడి నుంచి రక్షించడానికి సహాయపడతాయి. తరచూ అల్లం రసం తీసుకుంటే.. అది మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది.

బరువు తగ్గుతారు: రోజూ అల్లం రసం తాగితే.. బరువు కంట్రోల్‌లో ఉంటుందని నిపుణులు అంటున్నారు. అల్లం జీవక్రియను పెంచుతుంది, ఆకలిని నియంత్రిస్తుంది. తద్వారా బరువును కంట్రోల్‌లో ఉంచుతుంది.

న్యాయ హక్కు లభించే వరకు..

(మొదటిపేజీ తరువాయి)

దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. కొత్త కార్మిక చట్టాలు, క్రిమినల్ చట్టాలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలు నియంతృత్వ సంకేతాలను చూపుతున్నాయని ఖర్గే అన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలు దురదృష్టకరమని అన్నారు. 'బీచ్‌లకు వెళ్తారు. అక్కడ స్విమ్మింగ్.. ఫోటో సెషన్ నడుస్తుంది. ఆలయ నిర్మాణ ప్రాంతంలో ఫోటోలు దిగుతారు. కేరళ, ముంబాయి వెళ్తారు. వెళ్లిన ప్రతిచోటా ఫోటోలు దిగుతూనే ఉంటారు. ఈ గొప్ప వ్యక్తి మణిపూర్‌కు మాత్రం వెళ్లరు' అంటూ ప్రధానమంత్రి మోడీపై విమర్శలు చేశారు. జనవరి 22న జరిగే రామ మందిర ప్రతిష్ఠాపన కార్యక్రమానికి తనకు ఆహ్వానం అందిందని, త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. ఇండియా ఫోరం కన్వీనర్‌పై మీడియా అడిగిన ప్రశ్నకు.... 'ఇది కౌన్ బనేగా కరోడ్‌పతి ప్రశ్న' అంటూ సమాధానం దాటవేశారు. కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ, తమకు ప్రజల వద్దకు వెళ్లడం మినహా మరో మార్గం లేదనే విషయం ప్రజలకు ఈ యాత్ర ద్వారా తెలియచేస్తామన్నారు. పార్లమెంటులో పలు అంశాలను లేవనెత్తాలని ప్రయత్నించినప్పటికీ తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదనీ, 146 మంది ఎంపీలను పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేయడం దేశ చరిత్రలోనే ఇది మొదటి సారని అన్నారు.2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ నేతృత్వంలో జనవరి 14 నుంచి భారత్ జోడో న్యాయ్ యాత్ర ప్రారంభంకానున్న విషయం తెలిసిందే.

ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ దూరం..?

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్ పోటీ చేయొద్దని భావిస్తోంది. 119 మంది ఎమ్మెల్యేలు ఓటింగ్‌లో పాల్గొనాల్సి రావటం వల్ల... ఆ సమయంలో తమ ఎమ్మెల్యేల ఓట్లన్నీ పడతాయో లేదోనన్న సందేహంతోనే గులాబీ పార్టీ ఈ నిర్ణయానికి వచ్చినట్టు నేతలు చెబుతున్నారు. తాము నిలబెట్టిన అభ్యర్థులకు ఒక్క ఓటు తక్కువ పడ్డా... అది అంతిమంగా పార్టీకి తీరని నష్టం చేకూరుస్తుందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు. అందువల్లే పోటీకి దూరంగా ఉండాలంటూ ఆయన దిశా నిర్దేశం చేశారు. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత దీనిపై ఒక స్పష్టమైన నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించనున్నట్టు తెలంగాణ భవన్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా ఎన్నికైన కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి తమ తమ ఎమ్మెల్సీ పదవులకు (వీరిద్దరూ ఎమ్మెల్యే కోటాలో ఎన్నికయ్యారు) రాజీనామా చేసిన క్రమంలో ఈ ఎన్నిక జరగనున్న సంగతి తెలిసిందే.

ఎన్ వెంకటేష్‌కు టికెట్ లేనట్టేనా?

(మొదటిపేజీ తరువాయి)

ఈ అంశం చర్చకొచ్చింది. అక్కడి సిట్టింగ్ ఎంపీ నేతగాని వెంకటేష్‌కు పార్టీ ఈ సారి మొండి చెయ్యి చూపనుందని సమాచారం. ఆ సీటు కోసం కేటీఆర్ సన్నిహితుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తీవ్రంగా పైరవీలు చేస్తున్నట్టు సమాచారం. ఇందు కోసం ఆయన ఇప్పటి నుంచే పార్టీ అగ్రనేతలను కాకా పడుతున్నట్టు తెలిసింది.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కూడా ఆయనకే మద్దతు పలుకుతున్నట్టు వినికిడి. కాగా పార్టీ అధినేత కేసీఆర్ మాత్రం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను పెద్దపల్లి నుంచి ఎంపీగా పోటీ చేయించాలని భావిస్తున్నట్టు నేతలు చెబుతున్నారు. ఆ నియోజకవర్గానికి సంబంధించిన తాజా మాజీ ఎమ్మెల్యేలు, కొత్త ఎమ్మెల్యేలు కూడా కొప్పుల పేరునే ప్రతిపాదిస్తున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో బాల్క సుమన్, కొప్పుల మధ్య సిట్టింగ్ ఎంపీ నేతగానికి నిరాశే ఎదురుకానుందని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ విషయమై మరింత స్పష్టత రావాలంటే మరి కొద్ది రోజులు వేచి చూడాల్సిందే.

మీ అభిప్రాయం చెప్పండి

(మొదటిపేజీ తరువాయి)

తెలిసిందే. భారత ప్రభుత్వ విధానాలను విమర్శించేందుకు న్యూస్‌క్లిక్ చైనా నుండి నిధులు పొందిందని పోలీసులు ఆరోపించారు. దేశ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసేందుకు, భారత్‌ను అప్రదిష్టపాలు చేసేందుకు జరిపిన ప్రయత్నంలో భాగంగా ఇదంతా చేసిందని తెలిపింది. అయితే ఈ ఆరోపణలను న్యూస్‌క్లిక్ తోసిపుచ్చింది. దాడులు చేసేటప్పుడు, ఎలక్ట్రానిక్ వస్తువులు స్వాధీనం చేసుకునేటప్పుడు అనుసరించాల్సిన పద్ధతులపై మార్గదర్శకాలు జారీ చేయాలని న్యూస్‌క్లిక్, ప్రబీర్ పుర్కాయస్థ న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై న్యాయమూర్తులు బీఆర్ గవాయ్, సందీప్ మెహతాతో కూడిన బెంచ్ కేంద్రం, ఢిల్లీ పోలీసులు, సీబీఐ, ఆదాయపన్ను శాఖ, ఈడీ నుండి స్పందనలు కోరింది. ప్రారంభంలో పిటిషన్‌ను అనుమతించేందుకు న్యాయస్థానం విముఖత ప్రదర్శించింది. ఆర్టికల్ 32 ప్రకారం ప్రతి ఒక్కరూ న్యాయస్థానాన్ని ఆశ్రయించడాన్ని ఆమోదించలేమని జస్టిస్ గవాయ్ తెలిపారు. ప్రాథమిక హక్కుల అమలుకు భంగం కలిగినప్పుడు సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 వీలు కల్పిస్తోంది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ ఎలక్ట్రానిక్ పరికరాల స్వాధీనానికి సంబంధించి దాఖలైన ఇతర పిటిషన్లను గతంతో కోర్టు అనుమతించిందని గుర్తు చేశారు. దీంతో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసేందుకు న్యాయస్థానం అంగీకరించింది. వీటిని ఇదే రకమైన ఇతర పిటిషన్లతో జత చేయాలని ఆదేశించింది.

ఇప్పుడు గుర్తొచ్చాయా?

(మొదటిపేజీ తరువాయి)

పెట్టి ఉంటే పరిస్థితి ఇక్కడదాకా వచ్చేదా..? అంటూ వారు సీనియర్ నేతలు హరీశ్‌రావు, కడియం శ్రీహరి తదితరుల ముందే ఆక్రోశం వెళ్లగక్కారు. బుధవారం ప్రారంభమైన బీఆర్ఎస్ పార్లమెంటు నియోజకవర్గాల సన్నాహక సమావేశాలు శనివారం నాటికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పెద్దపల్లి ఎంపీ స్థానంపై సమీక్ష నిర్వహించారు. సిట్టింగ్ ఎంపీ నేతగాని వెంకటేశ్‌తోపాటు ఆ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ఈ భేటీకి హాజరయ్యారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సమావేశంలో వాడివేడిగా చర్చ జరిగింది. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఎవరూ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో లేరని ఈ సందర్భంగా పలువురు నేతలు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీంతో క్యాడర్ తీవ్రమైన అసంతృప్తితో రగిలిపోయిందంటూ వారు హరీశ్, కడియం శ్రీహరికి వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి ఈ గ్యాప్ ప్రధాన కారణమని వారు ఎత్తిచూపారు. ఇప్పటికైనా ఈ పరిస్థితి మారాలంటూ సూచించారు. లేదంటే ఎంపీ ఎన్నికల్లో మరింత ఇబ్బందులు తప్పబోవని హెచ్చరించారు. మరోవైపు జ్వరంతో బాధపడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం నాటి సమావేశానికి కూడా హాజరు కాలేకపోయారు. జ్వరం, జలుబుతో బాధపడుతున్న ఆయన వైద్యుల సూచన మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారని తెలంగాణ భవన్ వర్గాలు తెలిపాయి. కాగా ఆదివారం జహీరాబాద్ ఎంపీ స్థానంపై సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నారు. ముందుగా విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఆదివారం నిజామాబాద్ పార్లమెంటుపై సమీక్ష జరగాల్సి ఉండగా.. దాన్ని సోమవారానికి వాయిదా వేసినట్టు కడియం శ్రీహరి మీడియాకు తెలిపారు.

స్టార్టప్‌లకు నిధులు డల్

- గతేడాది డిసెంబర్ త్రైమాసికంలో ఏడేండ్ల కనిష్టానికి
- 'ట్రాక్ఎక్స్ఎన్' సమాచారం



గతేడాది భారతీయ స్టార్టప్‌లు నిధుల విషయంలో ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. గతేడాది డిసెంబర్ త్రైమాసికంలో స్టార్టప్‌లకు నిధులు ఏడేండ్ల కనిష్ట స్థాయికి చేరుకున్నాయి. కారణం..2016 మూడో త్రైమాసికంలో నమోదైన పేలవ పనితీరు తర్వాత అతి తక్కువ ఈక్విటీ పెట్టుబడిని అందుకోవటమే. ఈ విషయాన్ని ట్రాక్ఎక్స్ఎన్ సమాచారం నివేదించింది. "ఏడేండ్ల కనిష్టం అనేది భారత్‌కు ప్రత్యేకమైనది కాదు. కానీ యూఎస్, యూకే, ఆగ్నేయాసియాతో సహా ప్రధాన భౌగోళిక ప్రాంతాలలో, అలాగే ప్రపంచవ్యాప్తంగా నిధులలో ఇదే అత్యల్పంగా ఉన్నది" అని ట్రాక్ఎక్స్ఎన్ సహ వ్యవస్థాపకులు నేహా సింగ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. భారతీయ స్టార్టప్‌లు 2023లో నిధుల సేకరణలో దాదాపు 73 శాతం క్షీణతను చవిచూశాయి. అంతకుముందు సంవత్సరం స్టార్టప్‌లకు 2022లో రూ.2.07 లక్షల కోట్లకు పైగా నిధులు అందగా.. అవి ఈ ఏడాది రూ.58 వేల కోట్లకు పడిపోవటం గమనార్హం. ఇందులో, ఫిన్‌టెక్, రిటైల్, ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్‌లు, ఎన్విరాన్‌మెంట్ టెక్, స్పేస్ టెక్ వంటి అగ్రగామి నిధులతో కూడిన రంగాలున్నాయి. 2023లో ప్రపంచవ్యాప్తంగా అత్యధిక నిధులు సమకూర్చే భౌగోళిక ప్రాంతాలలో భారత్ ఐదో స్థానానికి పడిపోయింది. ఇది 2022, 2021 రెండింటిలోనూ నాలుగో స్థానంలో ఉండటం గమనార్హం.

సీవోఈ కళాశాల ఎంట్రెన్స్‌కు నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశాలకుగాను నోటిఫికేషన్ విడుదలైందని హైదరాబాద్ మహేంద్రహిల్స్ ఎస్సీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ బి.వినోలా ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 38 సోషల్ వెల్ఫేర్ ప్రతిభ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీఇ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ప్రతిభా కళాశాలల్లో ఐఐటీ, జేఈఈ,నీట్, ఎంసెట్, సీఎంఏ క్లాట్ పరీక్షల కొరకు ఉచిత శిక్షణ అందజేస్తామని తెలిపారు. ఈ నెల 15 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలనీ, ప్రవేశ పరీక్షలో విద్యార్థులు చూపించే ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు.

అభ్యర్థుల అభ్యంతరాలపై సర్కార్ సానుకూల నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్టాఫ్ నర్స్ రిక్రూట్మెంట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పై పలువురు అభ్యర్థులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. వారి అభ్యంతరాలను స్వీకరించి నివృత్తి చేయాలని ప్రభుత్వం రిక్రూట్మెంట్ బోర్డ్ ను ఆదేశించింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌పై అభ్యర్థులు తమ అభ్యంతరాలను జనవరి 15వ తేది సాయంత్రం 5 గంట లలోగా వైద్య, ఆరోగ్య సేవల నియామక మండలి కార్యదర్శికి సమర్పించుకునేందుకు అవకాశం కల్పించాలని వైద్యా రోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. జనవరి 17లోపు అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేసి అర్హులకు సర్టిఫికెట్ వెరిఫి కేషన్‌కు అవకాశం కల్పించాలని ఆదేశించారు.

రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఒకే ఎన్నిక నిర్వహించాలి

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల కమిషన్ ఒకే ఎన్నిక నిర్వహించాలని కరీంనగర్ మాజీ పార్లమెంటు సభ్యులు బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఒకే నోటిఫికేషన్ ద్వారా ఎమ్మెల్సీలుగా ఎన్నికైన వారి స్థానంలో కొత్తవారి ఎన్నిక కోసం వేర్వేరుగా నోటిఫికేషన్లు ఇవ్వడం ఏంటని ఆక్షేపించారు.

తొలి సోలార్ మిషన్ విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

హాలో ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. సెప్టెంబర్ 2న నింగిలోకి దూసుకెళ్లిన ఆదిత్య ఎల్-1 127 రోజులపాటు సుదీర్ఘంగా ప్రయాణించి 1.5 మిలియన్ కిలోమీటర్ల దూరంలో ఉన్న గమ్యస్థానానికి శుక్రవారం చేరింది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇస్రో మరోసారి థ్రస్టర్లను మండించి హాలో ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది.ఇక్కడి నుంచే సూర్యుడిపై అధ్యయనం చేయనున్నది. భూమి నుంచి దాదాపు 1.5 మిలియన్ కిమీ దూరంలో ఉన్న మొదటి సూర్య-భూమి లాగ్రాంజియన్ పాయింట్ (%ా%1) చుట్టూ ఉన్న హాలో కక్ష్య నుంచి సూర్యుడి కరోనాపై పరిశోధనలు జరుపుతుంది. లాగ్రాంజ్ పాయింట్ భూమి-సూర్యుని మధ్య గురుత్వాకర్షణ సమానంగా ఉంటుంది. దాంతో ఇక్కడి నుంచే పరిశోధనలు చేపట్టేందుకు ఇస్రో మిషన్‌ను చేపట్టింది. విజయవంతంగా ఆదిత్య ఎల్-1 ప్రయోగం చేపట్టిన అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోను ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు.

అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగం

(మొదటిపేజీ తరువాయి)

జమచేసింది. 'ఎస్మా' అనేది 'ఎసెన్షియల్ సర్వీసెస్ మెయిన్‌టీనెన్స్ యాక్ట్'కు సంక్షిప్త రూపం. 1981లో రూపొందించిన చట్టమిది. ఇది సమ్మెలు, హర్తాళ్ల వంటి సందర్భాల్లో ప్రజల సాధారణ జీవనం సాఫీగా సాగేందుకు తోడ్పడే సర్వీసులకు భంగం కలగకుండా ఈ చట్టం ఉపయోగపడుతుంది. అత్యవసర సేవలు అందించే ఉద్యోగులు తమ విధులకు హాజరు కాకుండా ఆయా సేవలకు విఘాతం కలిగేలా సమ్మెలోకి దిగితే.. జనజీవనానికి ఇబ్బంది కలగకుండా చూసేందుకు ప్రభుత్వానికి ఈ చట్టాన్ని ప్రయోగించే అధికారం ఉంటుంది.

ఉపసంహరించుకోవాలి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అంగన్‌వాడీలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మాను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కారాములు, పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఐసీడీఎస్ శాఖలో పనిచేస్తున్న అంగన్‌వాడీ వర్కర్ల, టీచర్ల వేతనాల పెంపు, గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించకపోగా చేయకపోగా వారిపై నిర్బంధాన్ని ప్రయోగించటం అన్యాయమని పేర్కొన్నారు. నెల రోజులుగా సమ్మె చేస్తున్నా.వారిని పట్టించుకోలేదని తెలిపారు. అక్కడి సర్కారు అంగన్‌వాడీల పట్ల నిర్లక్ష్యంగానూ, వారు చేస్తున్న సమ్మె పట్ల మొండిగా వ్యవహరించిందని తెలిపారు. ఇప్పటికైనా వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమ్మెలను నిర్బంధాల ద్వారా అణచాలని చూడటం తగదని హితవు పలికారు. ప్రభుత్వ మొండి వైఖరి వల్లనే ఏపీ అంగన్‌వాడీలు సమ్మె బాట పట్టారని తెలిపారు. వారిపై ఎస్మాను ప్రయోగించడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ చర్య జగన్ ప్రభుత్వం నియంతృత్వ పోకడలకు నిదర్శనమని తెలిపారు. సమస్యలను పరిష్కరించి సమ్మెను నివారించాలని కోరారు. ఎస్మాను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నెల రోజులుగా వీరోచితంగా పోరాడుతున్న ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్, ఆయాలకు సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ తరుపున వారు మద్దతును ప్రకటించారు. ఆ ఉద్యమానికి తెలుగు రాష్ట్రాల్లోని కార్మికవర్గం అండగా నిలబడాలని కోరారు.

రేపటి నుంచి రైతుబంధు

(మొదటిపేజీ తరువాయి)

సంక్రాంతి తర్వాత మరోసారి సమీక్ష నిర్వహించనున్నట్టు మంత్రి పేర్కొన్నారు. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అందుకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని వెల్లడించారు.

ఫైనల్‌కు గాఫ్, స్విటోలినా
అక్లాండ్ ఓపెన్



అక్లాండ్: అక్లాండ్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్లోకి అమెరికా సంచలనం, టాప్ సీడ్ కోకా గాఫ్, 2వ సీడ్ ఎలీనా స్విటోలినా ప్రవేశించారు. శనివారం జరిగిన సెమీస్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కోకా గాఫ్ 6-3, 6-1తో అమెరికాకు చెందిన ఎమ్మా నవ్వారోపై విజయం సాధించింది. ఈ టోర్నీ బరిలోకి నవ్వారో మూడోసీడ్‌గా బరిలోకి దిగింది. మరో సెమీస్‌లో ఎలీనా స్విటోలినా(ఉక్రెయిన్) 2-6, 6-4, 6-3తో చైనాకు చెందిన వాంగ్ షియుపై చెమటోడ్చి నెగ్గింది. ఈ మ్యాచ్ గెలిచేందుకు స్విటోలీనా పలుమార్లు గాయానికి చికిత్స తీసుకొని మరీ పోరాడి నెగ్గింది. ఆదివారం జరిగే ఫైనల్లో గాఫ్‌తో స్విటోలినా టైటిల్‌కై తలపడనుంది.

యునైటెడ్ కప్ సెమీస్‌కు జర్మనీ

ఆస్ట్రేలియా వేదికగా జరుగుతున్న యునైటెడ్ కప్ సెమీఫైనల్లోకి జర్మనీ జట్టు ప్రవేశించింది. క్వార్టర్‌ఫైనల్లో జర్మనీ జట్టు 2-0తేడాతో గ్రీస్‌ను చిత్తుచేసింది. పురుషుల సింగిల్స్‌లో అలెగ్జాండర్ జ్వెరేవ్ వరుససెట్లలో స్టెఫానాస్ సిట్సిపాస్‌ను చిత్తుచేయగా.. మహిళల సింగిల్స్‌లో కెర్బర్ కూడా వరుససెట్లలోనూ మారియా సక్కారిపై ఘన విజయం సాధించింది. మహిళల సింగిల్స్‌లో 8వ సీడ్ మరియా సక్కారి 6-0, 6-3తో కెర్బర్‌ని చిత్తుచేసింది. దీంతో 1-1తో మ్యాచ్ సమమైంది. రెండో పురుషుల సింగిల్స్‌లో 7వ సీడ్ అలెగ్జాండర్ జ్వెరేవ్ 6-4, 6-4తో సిట్సిపాస్‌ను చిత్తుచేశాడు. ఇక నిర్ణయాత్మక డబుల్స్ మిక్స్ పోటీలో జ్వెరేవ్-లారా సీజ్‌మండ్ జోడీ 6-3, 6-3తో సక్కారి, సిట్సిపాస్ తమ్ముడైన పెట్రోస్‌ను చిత్తుచేశారు.

పవర్‌లిఫ్టింగ్ సంఘం కార్యవర్గం ఎన్నిక
అధ్యక్షుడిగా రమేశ్ గౌడ్ ఏకగ్రీవం

హైదరాబాద్ : తెలంగాణ పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. శనివారం ఎల్బీ స్టేడియంలోని ఒలింపిక్ భవన్‌లో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా రమేశ్ గౌడ్ ఎన్నికయ్యారు. చైర్మెన్‌గా బుచ్చిదాస్ గౌడ్, జనరల్ సెక్రటరీగా జోసఫ్ జేమ్స్, కోశాధికారిగా రవి సింగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భారత పవర్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ నుంచి కొటేశ్వరరావు, శాట్స్ నుంచి రవి కుమార్, తెలంగాణ ఒలింపిక్ సంఘం నుంచి శోభన్‌లు ఎన్నికలకు పరిశీలకులుగా వ్యవహరించారు. 'త్వరలోనే అసోసియేషన్ సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తాం. జిల్లాల్లో నెలకొన్న సమస్యలు, అవసరమైన సౌకర్యాలపై ఓ అవగాహనకు వస్తాం. ప్రభుత్వ సహకారంతో పవర్‌లిఫ్టింగ్‌కు అవసరమైన మౌళిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తాను. జాతీయ స్థాయి క్రీడల్లో పోటీపడుతున్న అథ్లెట్లకు సైతం కనీసం టీఏ, డీఏ అందించేందుకు ప్రభుత్వం ముందుకు రావటం లేదు. ఈ అంశంలో చొరవ తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్నివించేందుకు ప్రయత్నం చేస్తాను' అని నూతన అధ్యక్షుడు రమేశ్ గౌడ్ తెలిపారు.



ఇక్కడే పట్టేయ్యాలి..
నేడు ఆస్ట్రేలియా మహిళలతో రెండో టి20

రాత్రి 7.30 గం॥ లకు

ముంబయి : తొలి టి20లో ఘన విజయం సాధించిన భారత మహిళల జట్టు ఇక సిరీస్‌పై కన్నేసింది. మూడు టి20ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన తొలి టి20లో భారత్ 9వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి 1-0 ఆధిక్యతలో నిలిచింది. ఆస్ట్రేలియా మహిళల నిర్దేశించిన 142పరుగుల లక్ష్యాన్ని భారత్ 17.4ఓవర్లలో స్మృతి మంధాన వికెట్ కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. వన్డే సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైన భారత మహిళలకు ఈ విజయం ఫుల్ జోష్ నింపింది. పేసర్ టిటాస్ సద్ధుకి తోడు దీప్తి శర్మ, శ్రేయాంక పాటిల్ ఆస్ట్రేలియా మహిళలను కట్టడి చేసిన అత్యద్భుతం. ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో ఘన విజయం సాధించిన భారత మహిళల జట్టు ఆ తర్వాత జరిగిన వన్డే సిరీస్‌ను కోల్పోయింది. అయినా తొలి టి20లోనే టాప్‌సీడ్ ఆస్ట్రేలియాను చిత్తుచేసిన తీరు అత్యద్భుతం. ఇక ఆసీస్ జట్టులో అనుభవజ్ఞురాలైన ఎల్లీస్ ఫెర్రీకి ఇది 300వ అంతర్జాతీయ మ్యాచ్. దీంతో ఆస్ట్రేలియా జట్టు ఈ మ్యాచ్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతోపాటు సిరీస్‌ను చేజారకుండా చూసేందుకు ప్రయత్నించే ఛాన్స్ ఉంది.

జట్లు(అంచనా)..

ఇండియా : హర్మన్‌ప్రీత్(కెప్టెన్), స్మృతి మంధాన, జెమిమా రోడ్రిగ్స్, షెఫాలీ వర్మ, దీప్తి శర్మ, యాస్తికా భాటియా, రిచా ఘోష్, అమన్‌జ్యోత్ కౌర్, శ్రేయాంక పాటిల్, రేణుక, టిటాస్ సద్ధు, పూజ వస్త్రాకర్/కనిక అహుజా

ఆస్ట్రేలియా: ఎలీసా హీలీ(కెప్టెన్), బ్రౌన్, గార్డినర్, కిమ్ గ్రాత్, కింగ్, లిచ్‌ఫీల్డ్, తహియా మెక్‌గ్రాత్, బెత్ మూనీ, ఎలీసా ఫెర్రీ, మెఘన్ స్కట్, సథర్లాండ్/వారేహామ్.

ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్

సిడ్నీ: పాకిస్తాన్‌తో జరిగిన మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్ చేసింది. మూడో, చివరి టెస్ట్‌లో ఆస్ట్రేలియా జట్టు 8వికెట్ల తేడాతో పాకిస్తాన్‌పై ఘన విజయం సాధించింది. ఓవర్ నైట్ స్కోర్ 7వికెట్ల నష్టానికి 67పరుగులతో నాల్గోరోజు ఆటను కొనసాగించిన పాకిస్తాన్ జట్టు 115పరుగులకు ఆలౌటైంది. రిజ్వాన్(28), జమాల్(18) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. హేజిల్‌వుడ్‌కు నాలుగు, లియాన్‌కు మూడు, స్టార్క్, కమిన్స్, హెడ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. దీంతో ఆస్ట్రేలియా జట్టు 130పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి వచ్చింది. ఆ లక్ష్యాన్ని ఆసీస్ ఖవాజా(0), వార్నర్(57)వికెట్లు కోల్పోయి ఛేదించింది. లబూషేన్(62నాటౌట్), స్మిత్(4) మరోవికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. పాకిస్తాన్ బౌలర్ సాజిద్ ఖాన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అమీర్ జమాల్‌కు లభించగా.. సిరీస్ పాట్ కమిన్స్‌కు దక్కింది. ఈ గెలుపుతో డబ్ల్యుటిసి పట్టికలోనూ ఆస్ట్రేలియా అగ్రస్థానానికి ఎగబాకింది.



టెస్టుల ఆఖరి ఇన్నింగ్స్ ఆడిన వార్నర్...

కెరీర్ ఆఖరి టెస్ట్, ఆఖరి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా సీనియర్ బ్యాటర్ డేవిడ్ వార్నర్ సత్తా చాటాడు. రెండో ఇన్నింగ్స్‌లో 57పరుగులు చేసి కెరీర్ ఆఖరి ఇన్నింగ్స్‌ను ఘనంగా ముగింపు పలికాడు. మొత్తం 75బంతులను ఎదుర్కొన్న వార్నర్ 7ఫోర్ల సాయంతో 57పరుగులు చేశాడు. టెస్ట్ కెరీర్‌లో భాగంగా ఇప్పటివరకు 112టెస్టులాడిన వార్నర్ 44.6 స్ట్రయిక్‌రేట్‌తో 8,786పరుగులు చేశాడు. ఇందులో 37అర్ధసెంచరీలు, 26సెంచరీలతోపాటు మూడు డబుల్ సెంచరీలున్నాయి.

డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో
ఆస్ట్రేలియా టాప్



న్యూఢిల్లీ : వరల్డ్ టెస్టు ఛాంపియన్ షిప్ (డబ్ల్యూటీసీ) 2023-2025 పాయింట్ల పట్టికలో ఆసీస్ అగ్రస్థానానికి దూసుకెళ్లింది. సిడ్నీ వేదికగా పాకిస్తాన్‌తో జరిగిన మూడో టెస్టులో 8 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో ఆసీస్ క్లీన్ స్వీప్ చేసింది. దీంతో ఆసీస్ జట్టు 56.25 శాతం పాయింట్లతో టాప్ ప్లేస్‌కు చేరుకుంది. ఇప్పటివరకు టాప్ ప్లేస్‌లో ఉన్న భారత్ (54.16 శాతంతో) రెండో స్థానానికి పడిపోయింది. భారత్ తర్వాతి స్థానాల్లో బాకింది. దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ (50.0), బంగ్లాదేశ్ (50.0) పాకిస్తాన్ (45.83) కొనసాగుతున్నాయి.

జద్రాన్‌కు పగ్గాలు

- చోటు దక్కించుకున్న ముజీబ్, నవీన్
- భారత్‌తో టి20 సిరీస్‌కు జట్టును ప్రకటించిన ఆఫ్ఘనిస్తాన్ బోర్డు



దుబాయ్: భారత పర్యటనకు వచ్చే ఆఫ్ఘనిస్తాన్ జట్టుకు కెప్టెన్‌గా ఇబ్రహీమ్ జద్రాన్ ఎంపికయ్యాడు. ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్‌బోర్డు శనివారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. బోర్డు ప్రకటించిన 19మంది ఆటగాళ్లతో కూడిన ఆఫ్ఘన్ జట్టు ఈనెల 11నుంచి భారత్‌తో టి20 సిరీస్‌లో ఆడనుంది. తొలి టి20 11న మొహాలీ వేదికగా జరగనుంది. గాయం నుంచి కోలుకున్న స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ కూడా జట్టులో చోటు దక్కించుకొన్నాడు. భారత పర్యటనకు వచ్చే ఆఫ్ఘనిస్తాన్ జట్టు మూడు టి20ల సిరీస్‌లో తలపడనుంది. జద్రాన్ సారథ్యంలో ఆఫ్ఘన్ జట్టు ఇటీవల యుఏఇ పర్యటనకు వెళ్లి 2-1తో టి20 సిరీస్‌ను చేజిక్కించుకొంది. స్టాండ్‌బై వికెట్ కీపర్‌గా ఇక్రమ్ అలిఖిల్ జట్టులో చోటు దక్కించుకొన్నాడని ఏసిబి ఛైర్మన్ మిర్‌వైల్ అష్రాఫ్ ఆ ప్రకటనలో తెలిపాడు.

జట్టు: ఇబ్రహీం జద్రాన్(కెప్టెన), గుర్బాజ్, అలిఖిల్(వికెట్ కీపర్లు), జజాయ్, రామత్ షా, నజీబుల్లా జద్రాన్, మహ్మద్ నబి, కరీమ్ జనత్, ఒమర్జాయ్, షరాఫుద్దీన్, ముజీబ్, ఫారూఖీ, ఫరీద్ అహ్మద్, నవీన్-ఉల్-హక్, నూర్ అహ్మద్, సలీమ్, ఖ్విస్ అహ్మద్, గులాబుద్దిన్ నబి, రషీద్ ఖాన్.

ఆ.. అంచనాలకు మించి ఎంజాయ్ చేస్తారు



శివ తుర్లపాటి, అంజలి, కోన వెంకట్

అంజలి టైటిల్ పాత్రలో నటిస్తున్న హర్రర్ కామెడీ చిత్రం 'గీతాంజలి మళ్ళీ వచ్చింది'. రైటర్, ప్రొడ్యూసర్ కోన వెంకట్ సమర్పణలో ఈ సీక్వెల్‌ను ఎంవీవీ సినిమా, కోన ఫిల్మ్ కార్పొరేషన్ సంస్థలపై ఎంవీవీ సత్యనారాయణ, జీవీ నిర్మిస్తున్నారు. అంజలి నటిస్తోన్న 50వ సినిమా ఇది. హర్రర్ కామెడీ జోనర్‌లో ట్రెండ్ సెట్ చేసిన 'గీతాంజలి' సినిమాకు ఇది సీక్వెల్. ఈ ఏడాది ప్రథమార్థంలో విడుదలకు సిద్ధమవుతోన్న ఈ సినిమాను శివ తుర్లపాటి తెరకెక్కిస్తున్నారు. శనివారం ఈ సినిమాలోని క్యారెక్టర్స్‌ను పరిచయం చేస్తూ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో డైరెక్టర్ శివ తుర్లపాటి మాట్లాడుతూ, 'కోన వెంకట్ నాపై నమ్మకంతో డైరెక్టర్‌గా అవకాశం ఇచ్చారు. ఆయన్ని ఎప్పటికీ మరచిపోలేను. 'గీతాంజలి' పెద్ద బ్లాక్ బస్టర్ అయిన తర్వాత సీక్వెల్ చేయటానికి కొత్త డైరెక్టర్ అవకాశం ఇచ్చిన కోనకి, ఎంవీవీకి థ్యాంక్స్. అంజలి, శ్రీనివాస్ రెడ్డి సహా అందరూ చాలా చక్కగా సపోర్ట్ చేశారు' అని తెలిపారు. 'ఈ కథ వినగానే థ్రిల్ అయ్యాను. సినిమా నవ్విస్తూ భయపెట్టిస్తూ ఎంజాయ్ చేసేలా ఉంటుంది. సినిమా చాలా బాగా వచ్చింది. మూవీలో అంజలి, గీతాంజలి కాంబినేషన్‌ని ప్రేక్షకులు ఆస్వాదిస్తారు. అలీ, సునీల్ ఇలా చాలా మంచి టీమ్ వర్క్ చేసింది' అని శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

సమర్పకుడు కోన వెంకట్ మాట్లాడుతూ, "గీతాంజలి' మూవీ ఓ ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది. ఈ సీక్వెల్ విషయానికి వస్తే సుజాత సిద్దార్థ్ ఎంతో అడ్వాంటేజ్ అయ్యారు. అలాగే ప్రవీణ్ లక్కరాజు సంగీతం ఎసెట్ అయ్యింది. సినిమాను ఏ ఎక్స్‌పెక్టేషన్స్‌తో అయితే ఆడియెన్స్ చూడటానికి వస్తారో దాన్ని మించి ఎంజాయ్ చేస్తారు. భాను కిరణ్, నందు రైటింగ్ పరంగా అద్భుతమైన డైలాగ్స్ రాశారు. మా శివకు 'గీతాంజలి మళ్ళీ వచ్చింది' చాలా పెద్ద బ్రేక్ అవుతుంది. సంక్రాంతికి టీజర్‌ను విడుదల చేయటానికి ప్లాన్ చేస్తున్నాం' అని చెప్పారు.

'గీతాంజలి' నా కెరీర్‌లో తొలి హీరోయిన్ ఓరియెంటెడ్ మూవీ. చాలా పెద్ద హిట్ అయ్యింది. అదే కాన్ఫిడెన్స్‌తోనే ఈ సినిమా చేశాం. సినిమా చూశాను. చాలా బావుంది. సినిమా అంతా ఒక ఎత్తైతే .. క్లైమాక్స్ మరో రేంజ్‌లో ఉంటుంది. విజువల్, గ్రాండ్ నెస్ నెక్స్ట్ రేంజ్‌లో ఉంటాయి. సీక్వెల్‌లో పార్ట్2 వెయిట్‌ను మోయటానికి స్టార్ క్యాస్ట్ పెరిగింది. అలీ, సునీల్, సత్య ఇలా అందరూ నవ్విస్తారు. డైరెక్టర్ శివ తుర్లపాటికి ఈ సినిమా చాలా పెద్ద బ్రేక్ అవుతుంది. కోన కామెడీ ట్రాక్, సినిమాను ఆయన డిజైన్ చేసిన తీరు ఆకట్టుకుంది.

- అంజలి

ముఖ్య గమనిక
టీజర్‌కి సూపర్ రెస్పాన్స్



అల్లు అర్జున్ కజిన్ విరాన్ ముత్తం శెట్టి హీరోగా పరిచయమవుతున్న సినిమా 'ముఖ్య గమనిక'. సీనియర్ సినిమాటోగ్రాఫర్ వేణు మురళీధర్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు.

లావణ్య హీరోయిన్‌గా నటిస్తోంది. శివిన్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం.1గా రాజశేఖర్, సాయికృష్ణ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర టీజర్‌ను దర్శకుడు మారుతి విడుదల చేశారు. ప్రస్తుతం ఈ టీజర్ సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్‌తో దూసుకుపోతుంది. ఈ సందర్భంగా దర్శకుడు మారుతి మాట్లాడుతూ, 'టీజర్ చూశాను.. చాలా ప్రామిసింగ్‌గా ఉంది. ఒక మంచి థ్రిల్లర్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిందని తెలుస్తోంది. కానిస్టేబుల్‌గా విరాన్ క్యారెక్టర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. టీమ్ అందరికీ ఈ సినిమా మంచి బూస్టప్ ఇస్తుందని ఆశిస్తున్నాను' అని అన్నారు. 'టీజర్ అందరికీ నచ్చిందని భావిస్తున్నాను. డైరెక్టర్, డీఓపీ వేణుతో పని చేయడం ఆనందంగా ఉంది. మా నిర్మాత ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమాను తెరకెక్కించారు. ఫిబ్రవరిలో రిలీజ్ ప్లాన్ చేస్తున్నాం' అని హీరో విరాన్ ముత్తంశెట్టి చెప్పారు. దర్శకుడు వేణు మురళీధర్ మాట్లాడుతూ, 'మా మూవీ నుంచి వచ్చిన ఫస్ట్ సాంగ్ అందరికీ నచ్చింది. టీజర్‌కి కూడా మంచి రెస్పాన్స్ వస్తుందని ఆశిస్తున్నాను. థ్రిల్లింగ్ అంశాలతో సాగే ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామాగా ఈ మూవీ తెరకెక్కింది. విరాన్ చక్కగా నటించారు' అని తెలిపారు. 'ఆల్రెడీ మా మూవీలోని ఫస్ట్ సాంగ్ 'ఆ కళ్ల చూపుల్లోనా..'కు మంచి రెస్పాన్స్ వచ్చింది. అలానే మా టీజర్‌కు కూడా మంచి రెస్పాన్స్ వస్తుందనే నమ్మకం ఉంది' అని నిర్మాత రాజశేఖర్ అన్నారు.

నవచిత్రం

క్రేజీ ప్రాజెక్ట్‌కి ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం



బుచ్చిబాబు సానా, ఏ.ఆర్.రెహ్మాన్, సుకుమార్

రామ్ చరణ్, 'ఉప్పెన' డైరెక్టర్ బుచ్చిబాబు సానతో మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై అత్యంత భారీ స్థాయిలో నిర్మాత వెంకట సతీష్ కిలారు ఓ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ మెగా వెంచర్ కోసం ఆస్కార్-విన్నింగ్ కంపోజర్ ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందించనున్నారు.

శనివారం రెహ్మాన్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఈ విషయాన్ని అధికారికంగా అనౌన్స్ చేశారు. బుచ్చిబాబు 'ఉప్పెన' మ్యూజికల్ హిట్, రెండవ చిత్రం కూడా మ్యూజికల్ చార్ట్‌బస్టర్ కాబోతుంది. రెహమన్ సంగీతం ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కి ప్రధాన ఆకర్షణగా ప్రేక్షకులను అలరించనుంది.

రెగ్యులర్ షూటింగ్‌లో ప్రతినిధి 2



'ప్రతినిధి 2'తో కమ్ బ్యాక్ ఇస్తున్న హీరో నారా రోహిత్ తన ల్యాండ్‌మార్క్ 20వ చిత్రాన్ని అనౌన్స్ చేశారు. సందీప్ పిక్చర్ ప్యాలెస్ (ఎస్‌పిపి) బ్యానర్‌పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్న ఈ సినిమాతో వెంకటేష్ నిమ్మలపూడి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. అందరినీ ఆకట్టుకునే ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్ టైనర్ శనివారం గ్రాండ్‌గా పూజా కార్యక్రమాలతో లాంచ్ అయింది.

సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి, విజయ్ కృష్ణ స్క్రిప్ట్‌ను మేకర్స్‌కి అందజేశారు. ప్రదీష్ ఎం వర్మ కెమెరా స్విచాన్ చేయగా, ముహూర్తం షాట్‌కి గౌతమ్‌రెడ్డి క్లాప్ కొట్టారు. తొలి షాట్‌కి విజయ్‌కృష్ణ గౌరవ దర్శకత్వం వహించారు. అలాగే రెగ్యులర్ చిత్రీకరణ కూడా మొదలైంది. విర్తి వాఘని కథానాయికగా నటిస్తుండగా, శ్రీ దేవి విజయ్ కుమార్, నరేష్ విజయ కృష్ణ, వాసుకి ఆనంద్ కీలక పాత్రలు పోషించనున్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సందీప్.

ఈ సంక్రాంతికి పర్‌ఫెక్ట్ సినిమా



విజయ్ బిన్ని

నాగార్జున అక్కినేని నటించిన తాజా చిత్రం 'నా సామిరంగ'. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్‌పై శ్రీనివాస చిట్టూరి నిర్మించారు. సంక్రాంతి కానుకగా ఈనెల14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు విజయ్ బిన్ని మీడియాతో ముచ్చటించారు.

- కొరియోగ్రాఫర్ నుంచి దర్శకుడిగా టర్న్ అవ్వడం చాలా ఆనందంగా ఉంది. దర్శకుడిని కావాలనే పరిశ్రమలోకి వచ్చాను. 'నువ్వొస్తానంటే నేనొద్దంటానా' సినిమా చూసిన తర్వాత అన్నీ క్రాఫ్ట్ బాగా చేశారు. కొరియోగ్రాఫర్‌కి ఆ గ్రిప్ ఉంటుందని భావించి కొన్నాళ్ళు కొరియోగ్రఫీ వైపు వెళ్లాను. నా తొలి సినిమానే నాగార్జున లాంటి పెద్ద స్టార్‌ని డైరెక్ట్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. గతంలో నాగార్జునకి కొన్ని పాటలు చేశాను. దీంతో సినిమాని కూడా చాలా హ్యాపీగా చేసుకుంటూ వెళ్లాం.
- నాగార్జునతో ఒక సినిమా చేయాలని ఆయనకి కథ చెప్పాను. అప్పుడు ఆయన ఈ కథ గురించి చెప్పి ఈ ప్రాజెక్ట్‌ని డైరెక్ట్ చేయమని చెప్పారు. ఆయన చెప్పిన కథని వోన్ చేసుకుని నా స్టయిల్‌లో చేశాను. ఈ సినిమాలో చాలా హైస్ ఉంటాయి. వింటేజ్ నాగార్జున కనిపిస్తారు. నేను ఆయన్ని ఎంత డిఫరెంట్‌గా చూపించాలని అనుకున్నానో అంత కొత్తగా ప్రజెంట్ చేశానని అనుకుంటున్నాను.
- అల్లరి నరేష్, రాజ్ తరుణ్ పాత్రల గురించి చెప్పాలంటే ఇదొక ఫ్రెండ్షిప్ మూవీ. నరేష్‌కి నాగార్జున గారంటే పిచ్చి. వారిద్దరిని ఈ కథలో పెడితే బావుంటుందనిపించింది. నరేష్ అద్భుతంగా చేశారు, వీరితో పాటు మరో యంగ్ యాక్టర్ ఉండాలి. ఆ పాత్రకు రాజ్ తరుణ్‌ని తీసుకున్నాం. ఇందులో ముగ్గురికి ఒకొక్క కథ ఉంటుంది. ఈ కథలు ఎలా కనెక్ట్ అవుతాయి?, వాళ్ళ మధ్య జరిగిన సిచ్యువేషన్స్ ఏమిటనేది చాలా కొత్తగా ఉంటుంది. స్నేహం, మంచి ప్రేమకథ, చాలా మంచి ఎమోషన్ ఉంటాయి. 80-90 మధ్య కాలంలో జరిగే కథ ఇది.
- ఇందులో ఐటెం సాంగ్ సర్‌ప్రైజ్ మాత్రమే కాదు చాలా సర్ప్రైజ్‌లు ఉన్నాయి. అవన్నీ తెరపై చూడాల్సిందే (నవ్వుతూ). కీరవాణి చాలా సపోర్ట్ చేశారు. ఎప్పుడూ కొత్త దర్శకుడిలా చూడలేదు. నేను కొరియోగ్రఫర్‌ని కాబట్టి మ్యూజిక్ సెన్స్ ఉంటుంది. ఆయనకి ఏదైనా చెప్పినా ఒక సెన్స్‌తోనే చెబుతుంటాడని భావించేవారు. ఇప్పటివరకూ వచ్చిన మూడు పాటలు సూపర్ హిట్ అయ్యాయి. రాబోయే మూడు పాటలు కూడా వైరల్ అవుతాయి. ఇందులో నాలుగు పాటలకు నేను కొరియోగ్రఫీ చేస్తే, ఒక పాట విజయ్, మరో పాట దినేష్ మాస్టర్ చేశారు.అలాగే నిర్మాతలు కూడా చాలా సపోర్ట్ చేశారు. కావాల్సిన ప్రతీదీ సమకూర్చారు.

సైంధవ్‌లో యూనిక్ క్యారెక్టర్ చేశా..



నవాజుద్దీన్ సిద్దిఖీ

వెంకటేష్ నటించిన తన 75వ చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వం వహించారు.

నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మాత వెంకట్ బోయనపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈనెల 13న గ్రాండ్‌గా విడుదల కానుంది. సంక్రాంతి కానుకగా రాబోతున్న ఈ ఈ సినిమాలో ఓ కీలక పాత్ర పోషించిన నవాజుద్దీన్ సిద్దిఖీ మీడియాతో మాట్లాడుతూ, 'ఈ సినిమాతో తెలుగు పరిశ్రమలోకి రావడం ఆనందంగా ఉంది. దేశ వ్యాప్తంగా ప్రేక్షకాదరణ పొందినప్పటికీ తెలుగులోకి రావడానికి ఆలస్యమైంది. ప్రతి నటుడు ఒక మంచి కథ కోసం ఎదురు చూస్తాడు. నేను కూడా అలా సరైన స్క్రిప్ట్ కోసం ఎదురు చూశాను. అది 'సైంధవ్'తో కుదిరింది. చాలా ఆసక్తికరమైన కథ ఇది. వెంకటేష్‌తో కలసి పని చేయడం ఎవరికైనా ఒక డ్రీమ్. పైగా ఆయన ల్యాండ్ మార్క్ 75వ సినిమాలో నటించటం ఆనందంగా ఉంది. ఇందులో ఆయనది చాలా ఇంటెన్స్ క్యారెక్టర్. ఈ ప్రయాణంలో ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఇందులో ప్రతి నాయకుడిగా నటించాను. ఈ సినిమా కోసం దర్శకుడు శైలేష్ చాలా యూనిక్ రోల్‌ని డిజైన్ చేశారు. నటించడానికి చాలా అవకాశం ఉన్న పాత్ర. నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పా. ఈ విషయంలో శైలేష్ ప్రేరణ ఇచ్చారు. నా నటనకు వేరే ఎవరో డబ్బింగ్ చెప్పడం కూడా నాకు ఇష్టం ఉండదు. ఇందులో నాది హైదరాబాదీ పాత్ర. హిందీ, తెలుగు రెండూ మాట్లాడతాను. ఈ పాత్రకు నేను డబ్బింగ్ చెబితేనే న్యాయం జరుగుతుంది. శైలేష్ చాలా ప్రొఫెష నల్ డైరెక్టర్. తనకి చాలా క్లారిటీ ఉంటుంది. ఎడిటింగ్ కూడా తన మైండ్‌లో ఉంటుంది. కథని ఎంత బాగా చెప్పాడో అంతే అద్భుతంగా చిత్రాన్ని తీశాడు. నిహారిక సంస్థ చాలా ప్యాషనేట్ ప్రొడక్షన్ హౌస్. ఈ ప్రొడక్షన్‌లో మళ్ళీ చేయాలని ఉంది' అని అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2014/59462.